SAPTHAGIRI (TELUGU)
ILLUSTRATED MONTHLY
Volume: 52, Issue: 3
August - 2021, Price Rs.5/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక


ఆగష్టు 2021.. వెల రూ.5/-



శ్రీనాథ! నారాయణ! వాసుదేవ!
శ్రీకృష్ణ! భక్తప్రియ! చక్రపాణే!
శ్రీపద్మనాభాచ్యుత! కైటభారే!
శ్రీరామ! పద్మాక్ష! హరే! మురారే!



నమస్తే! సర్వభూతానాం
జననీ మబ్ధి సంభవామ్।
శ్రియ మున్నిద్రపద్మాక్షీం
విష్ణువక్షస్థ్సల స్థితామ్॥



## గీతాశ్లోకార్థసారం

**శ్లో :** తత్రాపశ్యత్థ్సితాన్ పార్థః పితౄనథ పితామహాన్ ।
ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీంస్తథా ॥
శ్వశురాన్ సుహృదశ్చైవ సేనయోరు భయోరపి

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 26, 27)

**ప్రతిపదార్థం:** అథ= తర్వాత; పార్థః= అర్జునుడు; తత్ర= అక్కడ; ఉభయోః సేనయోః అపి= రెండు సేనలయందును; స్థితాన్= ఉన్నట్టి; పితౄన్= తండ్రులను; పితామహాన్= తాతలను; ఆచార్యాన్= గురువులను; మాతులాన్= మేనమామలను; భ్రాతౄన్= అన్నదమ్ములను; పుత్రాన్= కొడుకులను; పౌత్రాన్= మనుమలను; సఖీన్= స్నేహితులను; తథా= అటులనే; శ్వశురాన్= మామలను; సుహృదశ్చైవ= హితంగోరేవారినీ; అపశ్యత్= చూచాడు.

**భావం:** తదుపరి అర్జును డక్కడ రెండుసేనలయందు నిల్చియున్నట్టి తండ్రులను, తాతలను, గురువులను, మేనమామలను, అన్నదమ్ములను, కొడుకులను, మనుమలను, స్నేహితులను, మామలను, హితైషులను (అందరిని) చూచాడు.

---

## మమ్ము కాచేటి కమలాక్షుడు

ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీఁడు
దిద్దరాని మహిమల - దేవకీసుతుఁడు

అంత నింత గొల్లెతల - అరచేతి మాణికము
పంతమాడే కంసుని - పాలి వజ్రము
కాంతుల మూఁడు లోకాల - గరుడపచ్చఁబూస
చెంతల మాలోనున్న - చిన్ని కృష్ణుడు

రతికేళి రుక్మిణికి - రంగుమోవి పగడము
మితి గోవర్ధనపు గో - మేధికము
సతమై శంఖు చక్రాల - సందుల వైడూర్యము
గతియై మమ్ముఁ గాచేటి కమలాక్షుఁడు

కాళింగుని తలలపైఁ - గప్పిన పుష్యరాగము
యేలేటి శ్రీ వేంకటాద్రి - యింద్రనీలము
పాలజలనిధిలోనఁ - బాయని దివ్యరత్నము
బాలునివలెఁ దిరిగీఁ - బద్మనాభుఁడు

(అధ్యాత్మ సంకీర్తన, సంపుటము: 3 - 577)





*బాలకృష్ణుడు ఇద్దరుతల్లుల ముద్దుబిడ్డడు. శ్రీకృష్ణుని కొందరు ప్రణయంతో సాధిస్తే - మరికొందరు పగతో సాధిస్తారు. బాలునివలె తిరిగే యోగేశ్వరేశ్వరుడు కృష్ణుడు. రత్నాల గుణాలన్నీ ఈ రాజీవాక్షునిలో రాశీభూతమై నిలిచినవి.*

# థర్డ్ వేవ్‌తో జాగ్రత్త!

## వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ భారతదేశ ప్రజానీకాన్ని హెచ్చరించింది



ఇప్పటిదాకా కోవిడ్-19 వైరస్ మొదటి, రెండు వేవ్‌లను మనం చూసాం. ఇక రాబోయేది పై రెండింటికన్నా ఎక్కువ ప్రమాదకారి అయిన థర్డ్‌వేవ్. దీన్ని డెల్టా వేరియంట్‌గా శాస్త్రవేత్తలు పరిగణించారు. ఈ ప్రమాదం నుండి మనల్ని మనం కాపాడుకోవాలి.

దీనికి ఏకైక పరిష్కారం మిమ్మల్ని మీరు మాత్రమే రక్షించుకోవడం.
కుటుంబ సభ్యులందరూ దయచేసి గమనించండి.

- కడుపులను ఖాళీగా ఉంచకండి. వేళకు ఆహారం తీసుకోండి!
- ఈ సమయంలో ఉపవాసాలు ఆచరించడం సముచితం కాదు.
- రోజూ ఒక గంట సూర్యరశ్మిని తప్పక ఆస్వాదించండి.
- ఏ.సి. ఏ మాత్రం ఉపయోగించవద్దు.
- వెచ్చని నీరు త్రాగండి, గొంతు తడిగా ఉంచండి.
- ముక్కుకు ఆవనూనె రాయండి.
- ఇంట్లో హారతి కర్పూరం కాల్చండి.
- ప్రతి కూరగాయకు అర టీస్పూన్ పొడి అల్లం జోడించండి.
- దాల్చినచెక్క వాడండి.
- రాత్రి కప్పు పాలతో ఒక స్పూన్ పసుపు త్రాగాలి.
- వీలైతే ఒక చెంచా చ్యవన్ ప్రాష తినండి.
- ఇంటిలో కర్పూరం మరియు లవంగాలతో పొగ వేయండి.
- ఉదయం టీలో లవంగం వేసి మరిగించి తాగండి.
- పండ్లలో ఎక్కువ నారింజ మాత్రమే తినండి.
- పాలలో పసుపు మీ శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది.
- రెండు మాస్కులను సక్రమంగా ధరించాలి.
- చేతులను తరచుగా సానిటైజ్ చేసుకోవాలి (లేదా) సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.

వీలు అయినంత త్వరగా అందరూ వ్యాక్సిన్ వేయించుకోండి.







మీరు థర్డ్‌వేవ్‌ను ఓడించాలనుకుంటే,
దయచేసి ఇవన్నీ చేయండి.

పై వాటిని పాటించడం వ్యక్తిగతమే కాదు,
సామాజిక బాధ్యత కూడా!




1970-2020

50 వసంతాల

తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక


# సప్తగిరి


సంపుటి : 52 ఆగష్టు, 2021 సంచిక : 03


వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥


**గౌరవ సంపాదకులు**
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకులు**
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| మా ఇంటికి.. రావమ్మా | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 07 |
| నీలాల మబ్బుతునక నేలకు దిగి వచ్చెనా? | శ్రీమతి సి.వేదవతి | 10 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ ఈ.జి.హేమంత కుమార్ | 11 |
| 'దేశభక్తి' తాత్కాలిక అవసరం కాదు.. | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ | 13 |
| పరిపూర్ణ వేదమూర్తి | డా॥ కప్పగంతు రామకృష్ణ | 15 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు, కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 17 |
| నిత్యవరదుడు | డా॥ యల్లాప్రగడ మల్లికార్జున రావు | 19 |
| అన్నీ సాధించవచ్చు! | శ్రీ గరిమెళ్ళ శరవణ దీక్షితులు | 22 |
| ఎంత దయామతివయ్యా... | బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుశర్మ | 23 |
| మురిపాల.. అరచేతా మొగ్గా తొడిగింది.. | కళారత్న డా॥జి.వి.పూర్ణచందు | 25 |
| యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం | శ్రీ అరవింద్ ఆర్య | 31 |
| మాంగల్యసిద్ధికి.. | శ్రీ కపిలవాయి రైవతశర్మ | 34 |
| శ్రీమద్భగవద్గీత | ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ | 36 |
| ప్రకృతికి ప్రతీక ఈ దేవుడు! | శ్రీమతి జె.ఎస్.కె.దుర్గ | 37 |
| సౌభాగ్యకరం... వరలక్ష్మీ వ్రతం | శ్రీ కె.జానకిరామావధాని | 38 |
| చేతవెన్నముద్ద! | శ్రీమతి పురాణపండ వైజయంతి | 40 |
| హరిదాసవాఙ్మయంలో... శ్రీవేంకటాచలాధీశుడు | శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 42 |
| రక్తసంబంధాలకు రక్ష.. రక్ష! | శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి | 44 |
| మనోబలం ఈయన వల్లే... | డా॥ మేడికుర్తి ఓబులేశు | 46 |
| నా తండ్రి... | శ్రీ టి.శివకుమార్ | 47 |
| పరమ పవిత్ర మంగళద్రవ్యం | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 48 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య, నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 49 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 50 |
| భూదానానికి మించిన ఫలం | ఆచార్య పి.ఎల్.శ్రీనివాస రెడ్డి | 51 |
| దేవుడి రథాన్ని ఆపిన హారతి (చిత్రకథ) | కథ : డా॥ కంపల్లె రవిచంద్రన్, చిత్రాలు : శ్రీ కె.తులసీప్రసాద్ | 52 |
| బాలవినోదం | | 54 |


ముఖచిత్రం : నవనీతకృష్ణుడు (తిరుమల)

వెనుక చిత్రం : శ్రీహయగ్రీవమూర్తి, చిత్రం: పి.శివప్రసాద్


ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777
2233333





వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం

# శ్రీనివాస వైభవ వ్యాప్తిలో తి.తి.దేవస్థానములు

భారతీయులు ఆలయనిర్మాణాల ద్వారా భక్తి, ధార్మిక, ఆధ్యాత్మికచైతన్యం పొంది, తాము తరించడమే కాక ఇతరుల్ని తరింపజేస్తున్నారు. అత్యంత ప్రాచీనకాలం నుండీ దేవాలయవ్యవస్థ ద్వారా సమాజం సుఖశాంతులతో విరాజిల్లుతోంది. సప్తసంతానాలలో దేవాలయనిర్మాణం గొప్పది. మనదేశంలో దేవాలయమో, భజనమందిరమో లేని ఊరు ఉండదు. దేవాలయం ధర్మానికీ, ధర్మ ప్రచారానికీ, సంస్కారవంతమైన జీవితానికి కేంద్రం. ఆలయంలో ఉండేది శిలామూర్తి కాదు. అది సాక్షాత్తు అర్చాస్వరూపమైన భగవంతుని మూర్తియే!

ప్రపంచంలో ఉన్నతప్రమాణాలతో దినదినాభివృద్ధి నొందుతున్న ఆలయం తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆలయం. అందుకే శ్రీనివాసుడు కలియుగ ప్రత్యక్షదైవం. తిరుమల కలియుగ వైకుంఠంగా ప్రసిద్ధికెక్కిన దివ్యక్షేత్రంగా ప్రకాశిస్తోంది.

భగవంతుడు సర్వవ్యాపకుడు. అన్నింటా, అన్ని కాలాల్లోనూ ఉంటాడు. ఆ పరమాత్మను దర్శించాలంటే సామాన్యులకు సాధ్యం కాదు. అందుకే అనువైన, సులభమైన పవిత్రస్థలం దేవాలయం. సామాజికజీవనవిధానాన్ని భక్తి, ధార్మిక ఉన్నతమార్గంలో పయనింపజేయడానికి ఆలయాలు శక్తిమంతమైన కేంద్రాలు. వర్ణభేదాలు లేకుండా అందరినీ ఒక చోట చేర్చేవి ఆలయాలు.

హైందవ ధర్మభక్తిప్రచారంలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం వారు గ్రామాల్లో శ్రీవేంకటేశ్వర, శ్రీరామ దేవాలయాలు నిర్మించి గ్రామాల్ని ధార్మికపథంలోనికి తేవాలని నిర్ణయించారు. ఇందుకు తగిన ప్రణాళికలూ సిద్ధం చేస్తున్నారు. గతంలోనూ ఆలయాలు నిర్మించి, అక్కడ అర్చకులుగా అక్కడివారికే అవకాశం కల్పించి, అర్చకత్వవిషయంగా శిక్షణ కూడా ఇచ్చారు. ఆ అర్చకులు యథాశక్తిగా పూజాకైంకర్యాలు నిర్వహిస్తున్నారు.

భగవంతునిపై విశ్వాసం ఏర్పడితే, పిదప భక్తి, ధార్మిక, ఆధ్యాత్మికచింతన క్రమంగా సిద్ధిస్తాయి. సమాజంలోని అసమానతలు తొలగి వసుధైకకుటుంబ భావన ఏర్పడుతుంది. మా ఊరి ఆలయం, మా దేవుడు అనే భావన కలుగుతుంది. కనుక తమ ఆలయాన్ని అభివృద్ధి చేసుకొంటారు.

ప్రత్యేకశిక్షణ పొందిన అర్చకులు తి.తి.దేవస్థానం నిర్వహించే ధార్మిక, ఆధ్యాత్మికాది కార్యక్రమాల్లో తోడ్పడతారు. వారు స్థానికులు గనుక ఆ ఊర్లో వారి ద్వారా ఆలయంలో భజనలు, ప్రవచనాలు, హరికథలు మున్నగు కార్యక్రమాలు నిర్వహించడం సులభమౌతుంది. కనీసం రోజులో ఒక్కమారైనా ఆలయానికి వచ్చి దేవతల్ని దర్శించి, కొంతసేపు అక్కడ కూర్చుండడం అలవాటైతే కలిగే ఆనందం, ప్రశాంతత ఎలా ఉంటుందో గ్రహించుకోగలరు.

ఆలయాలు కేవలం నైవేద్యాలకే పరిమితంకాక ఆ ఊరిప్రజల్ని ఒక త్రాటిమీద ఐకమత్యంతో, భక్తితాత్పర్యాలతో నడిపించే దివ్యకేంద్రంగా రూపుదిద్దుకోవాలి. ఇలా అనేకమంచి కార్యక్రమాలు ఆలయంలో జరుగుతూ ఉంటే గ్రామాలు ప్రశాంతవాతావరణంలో ఉంటాయి. ఇలా ఎన్నో గొప్ప శుభాశయాలతో తి.తి.దే.వారు ఈ 'ఆలయనిర్మాణం' అనే కార్యక్రమాన్ని చేపట్టారు.

శ్రీవారి కృపతో ప్రతిగ్రామంలో క్రమంగా ఒక ఆలయం వెలసి, గ్రామాలు ధార్మికంగా అభివృద్ధి చెందాలని ఆశిద్దాం!!

# మా ఇంటికి రావమ్మా...

వసంత, గ్రీష్మ, వర్ష, శరత్, హేమంత, శిశిరాలు ఆరు ఋతువులు. సంవత్సరంలో సూర్యుని గతిని బట్టి ఇవి ఏర్పడుతాయి. అందులో గ్రీష్మ, హేమంతాల మధ్య వర్షర్తువు సంవత్సరంలో సంధి సమయం. ఇది అత్యంత ప్రమాదకరం. రోగాలు, ఉపద్రవాలు సంభవిస్తాయి. సాధారణవైద్యులు రోగాలను కొంతవరకే అరికట్టగలరు. చేయి దాటే పరిస్థితి వస్తే "మేం చేయాల్సింది చేశాం, ఆ పైన భగవంతుని ఇచ్ఛ" అని చెబుతారు. ఎంతవారలైనా విధిగా విధికి తలొంచాల్సిందే!

కాబట్టి, పురుషకారం ఒక్కటే చాలదు. దైవబలం, దైవానుగ్రహం ఎంతో అవసరం. వాటిని సంపాదించాలంటే దేవతారాధన చేయాలి. ధర్మకార్యాచరణ చేయాలి. సమస్తధర్మాలకు మూలం వేదం. కాబట్టి, వేదవిహితధర్మకార్యాచరణ చేత దైవానుగ్రహం సంపాదించుకోవాలనేది ఆదిశంకరుల ఉపదేశం.

భారతీయులదృష్టిలో ఒక్కొక్క కాలభాగానికి ఒక్కొక్క విశిష్టత ఉంది. సంవత్సరంలో మేఘావృతమై మేఘాన్ని తిరోగమించే కాలాన్ని చాతుర్మాస్యదీక్షాకాలంగా మన మహర్షులు నిర్ణయించారు. కాళిదాస మహాకవి ఆషాఢశుద్ధ ఏకాదశి నుండి కార్తిక శుద్ధ ఏకాదశి దాకా చాతుర్మాస్యదీక్షా కాలమనీ, ప్రజలందరూ అప్రమత్తులై, ఆహారనియమాలతో, భగవదారాధన చేస్తూ గడపాలనీ మేఘసందేశకావ్యంలో తెలిపాడు.

కుబేరశాపగ్రస్తుడైన యక్షుడొకడు రామగిరి అడవులలో తిరుగుతూ, విరహపీడితురాలైన భార్యకు మేఘం ద్వారా సందేశం పంపుతాడు. శ్రీమహావిష్ణువు యోగనిద్ర నుండి లేచే రోజున ఆ శాపం ముగుస్తుంది. అప్పటివరకు ఈ నాలుగు నెలలు కళ్లు మూసుకుని, ఆహారనియమాలతో, భగవదారాధనతో గడుపమని సందేశం. కాబట్టి ఆషాఢశుద్ధఏకాదశిరోజు దీక్షారంభం. కార్తిక శుద్ధ ఏకాదశినాడు శాపాంతం (దీక్షాంతం) మధ్య నున్న నాలుగు నెలలు చాతుర్మాస్యదీక్షాకాలం అని తెలుస్తోంది.



ఈ చాతుర్మాస్యదీక్షాసమయంలో శ్రావణమాసం వస్తుంది. ఈ నెలలోని మంగళ, శుక్రవారాలు హైందవ స్త్రీ ముఖ్యమైన పండుగరోజులు మంగళవారాల్లో మంగళగౌరిని, శుక్రవారాల్లో శ్రీవరలక్ష్మిని ఆరాధించి, సకలసన్మంగళాలను పొందుతున్నారు. ఇక పురుషులకు శ్రావణపూర్ణిమ ఒక పవిత్రమైన రోజు. ఆనాడు వటువులకు అధ్యాయోపాకర్మ సంస్కారం చేసి వేదాధ్యయనమారంభిస్తారు. ఇది అనూచానంగా వస్తున్న శాస్త్రసంప్రదాయం.

అయితే, సాధారణంగా పూర్ణిమ అనధ్యయన దినం. అనధ్యయనదినాల్లో వేదాధ్యయనం చెయ్యరు. కానీ, శాస్త్రం శ్రావణ పూర్ణిమనాడు ఉపాకర్మ సంస్కారాన్ని, కొత్తగా వేదాధ్యయనం ప్రారంభాన్ని విధిస్తోంది.

– డా॥ కంపల్లె రవిచంద్రన్



## ఇతర పూర్ణిమలకన్న శ్రావణపూర్ణిమలోని విశిష్టత!

ఈ మాసంలో పూర్ణిమనాడు చంద్రుడు "శ్రవణ" నక్షత్రంలో కలిసి ఉంటాడు కాబట్టి ఈ మాసం శ్రావణమాసం. వేదవాక్కుకు "శ్రుతి" అని పేరు. మహర్షులకు వేదవాణి మహా తపస్సమాధిలో శ్రుతిగోచరమైంది. శ్రుతి అంటే చెవి. మహర్షు లకు శ్రుతి గోచరమైందంటే మహర్షులు వేదవాణిని శ్రవణం చేశారు. అనగా విన్నారని అర్థం. ఈనాటికీ గురుముఖం ద్వారా ఉచ్చరింపబడే వేద వాణిని శిష్యులు శ్రవణం చేసి ధారణ చేస్తున్నారు. సృష్టి మొదలు నేటి దాకా గురుశిష్యపరంపరలో శ్రవణం ద్వారా భువికి అవతరించి, నేటికీ శ్రవణం చేయబడుతూ ప్రజల్ని తరింప జేస్తుండడం వల్ల వేదవాణికి 'శ్రుతి' అనే పేరు సార్థకమైంది.

'శ్రుతి-శ్రవణ' శబ్దాలు సమానార్థకాలు. మహర్షులు ఈనక్షత్రంద్వారా వేదవాణిని విన్నారు. వేదం ఈ నక్షత్ర స్వరూపాన్ని వర్ణిస్తూ నక్షత్రేష్టిలో ఈ విషయాన్ని వెల్లడించింది.

శ్రుణ్వంతి శ్రోణా మమృతస్యగోపాం।
పుణ్యామస్యా ఉపశ్రుణోమి వాచమ్॥



'శ్రోణా' అంటే శ్రవణానక్షత్రం. ఇది అమృతగోప. అంటే అమృతాన్ని భద్రపరిచే జ్యోతిస్సు. ఋగ్యజుస్సామాత్మక మైన వేదం సత్పురుషులకు అమృతం. సిరిసంపద. ఆ వేదాన్ని మహర్షులు తెలుసుకున్నారు.

"ఈ శ్రవణానక్షత్రం నుండి వెలువడే వాక్కులను నేను వింటున్నా"నని, వేదమంత్రాలు ఉన్నాయి. దీన్ని బట్టి శ్రవణా నక్షత్రం పవిత్రమైన వేదవాక్కుల నిలయమనీ, ఆ వాక్కులను మహాత్ములు వింటూ ఉంటారని వేదం చెబుతోంది.

శ్రావణపూర్ణిమరోజున ప్రొద్దునపూట ఉపాకర్మ సంస్కారం పూర్తి చేసి, ఋషులను పూజించి, మధ్యాహ్నం రక్షా బంధనం వటువుకి కట్టాలి. దాన్ని మంత్రాక్షలతో పూజించాలి. ఈ రక్షా బంధనమనేది పెద్దవేడుక.

శ్రావణపూర్ణిమనాడు శ్రవణానక్షత్రంలో శ్రీమహావిష్ణువు హయగ్రీవుడుగా అవతరించి సర్వకల్మషనాశకమైన సామగానం చేశాడు.

కనుక ఆనాడు అందరూ శంఖచక్రగదాధరుడైన హయగ్రీవుణ్ణి పూజించాలని కల్పతరువు అనే గ్రంథం ఉపదేశి స్తోంది. శ్రావణమాసంలో హయగ్రీవారాధన సమస్తపాపక్షయ కరం. శ్రావణశుద్ధపంచమినాడు ఇంటి ద్వారానికి బయట రెండు వైపుల ఆవుపేడతో సర్పాలబొమ్మలను గీచి, ఆ సర్పాలను దర్భలు, అక్షతలు, పెరుగు మొదలగు వానితో అర్చిస్తే, ఆ ఇంటికి పాములబెడద ఉండదు.

గ్రీష్మతాపానికి, ఎండి, ఎండి, వానలు కురవగానే శ్రావణమాసంలో అనేక ఔషధాలు పుడతాయి. గనుక, ఈ మాసం ప్రశస్తమైంది. స్త్రీలు వేదమాతృ స్వరూపిణి అయిన శ్రావణ మంగళగౌరిని, శుక్రవారవరలక్ష్మిని, మాతృ స్వరూపిణు లైన ముత్తయిదువులను ఆరాధిస్తారు. గౌరీపూజ అంటే వేద మాతృపూజ. వేదాధ్యయనం చేసే పురుషుల వలె, స్త్రీలు గౌరీపూజ చేసి, వేదమాతృ పూజ చేసి, వేదమాత యొక్క అనుగ్రహపాత్రులౌతున్నారు. అందుచేత, వివాహానికి ముందు కన్నెపిల్లలచే గౌరీపూజలు చేయించడం సంప్రదాయం. రుక్మిణీ దేవి, పార్వతీదేవి కూడా వివాహానికి ముందు గౌరీపూజ చేశారు.

శ్రావణమాసంలోని మరొక పర్వదినం శ్రీకృష్ణాష్టమి. దీన్నే కృష్ణజయంతి అంటారు. జయంతి అంటే రాత్రి అని



కరుణ లేకుంటే కలిమి కల్గి ప్రయోజనమేమి?

"చంద్రమా మనసో జాతః" అని వేదం. చంద్రుడు పరమేశ్వరుని మనస్సు నుండి ఆవిర్భవించాడు. కాబట్టి, చంద్రుడు మనఃకారకుడు.

అలాంటి, చంద్రుడు శ్రావణపూర్ణిమనాడు షోడశకళాప్రపూర్ణుడై సాధకుల మనస్సులకు ఉత్తేజం కలిగిస్తూ ఉంటాడు. నియమపూర్వకంగా గ్రహించాల్సిన వేదరాశి యొక్క అధ్యయనానికి, అభ్యాసానికి శ్రావణపూర్ణిమ ముఖ్యం. భారతీయ సంస్కృతికి మూలభూత మైన ఈ వేదవాణిని ఆరాధించే పరమపవిత్రమైన రోజు శ్రావణ పూర్ణిమ.

అర్థం. జయంతి అంటే సర్వపాపాలను నశింపజేసే రాత్రి, శ్రీకృష్ణుడు జన్మించిన ముహూర్తానికి 'విజయ' అని పేరు. కృష్ణాష్టమీ పూజ అంటే గణపతి పూజయే.

"గణేశ రూపః శ్రీకృష్ణో కల్పే కల్పే తవాత్మజః" (బ్రహ్మ వైవర్త పురాణమ్)


ప్రతికల్పంలోను శ్రీకృష్ణుడు, గణపతి రూపంలో నీకు కుమారుడుగా జన్మిస్తాడని పార్వతీదేవికి బ్రహ్మదేవుని వరం.

శ్రీకృష్ణునికి గల గోపాల, గోవింద అనే పేర్లు ఆయన వేదస్వరూపుడు, వేదరక్షకుడని తెల్పుతున్నాయి. కాబట్టి, వేదపురుషుడు శ్రీకృష్ణపరమాత్మను పూజిస్తే ఆయన మానవుల మనస్సుల్ని దున్నుతాడట. రైతుపొలందున్ని కొత్తవిత్తనాల్ని నాటి చక్కని పైరును ఇచ్చేటట్లు, శ్రీకృష్ణుడు మానవుల మనసుల్ని దున్ని, కలుపుమొక్కల వంటి అసత్య, అవైదికలక్షణాలను పీకి పారేసి, సత్యప్రతిష్ఠ గావిస్తాడు. వైదికలక్షణాలను నెలకొల్పుతాడు. పాపప్రక్షాళన చేస్తాడు.

కృష్ణ అనే పదంలోని కృషి అంటే భక్తి. 'ణ' కారం అంటే దాస్యం. కాబట్టి భక్తి, దాస్యాల నిచ్చేవాడు శ్రీకృష్ణుడు. కృషి అంటే నిఖిలప్రపంచం. 'ణ' కారం దానికి మూల కారణ మైన బీజం. కాబట్టి, కార్యకారణస్వరూపుడు కృష్ణుడు. ప్రపంచానికి కారణభూతుడు. అందరి మనస్సుల్ని తన వైపు ఆకర్షించ గలవాడు శ్రీకృష్ణపరమాత్మ. అలాంటి పరమాత్మను ఆరాధించడం ద్వారా జనాలు పాపాల నుండి, పలు రకాల వ్యాధుల నుండి రక్షింపబడుతున్నారు.

సర్వవ్యాధినివారిణి అయిన వేదమాతను, వేదమాతృ స్వరూపిణి అయిన పరాశక్తిని, వేదపురుషుడైన పరమేశ్వరుణ్ణి ఆరాధన చేసి ప్రజలందరూ తరించాలని వేదమాత ఉపదేశం. వేదాధ్యయనమే గాక, వేద శబ్దశ్రవణం గూడ పుణ్యమనీ, మహర్షుల వలే అందరూ వేదమంత్రశ్రవణం చేసి, వేదమయులు. తద్వారా దేవమయులు కావాలనీ, ఇలా దైవానుగ్రహాన్ని సంపాదించే కాలమవడమే శ్రావణమాస విశిష్టత!

## నియమాలు పాటిస్తే... ఎందుకు భయం!!



కరోనా విజృంభన అనేది గతంలాగా ఉండదు కానీ, జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. కరోన వైరస్ నివారణకు వ్యాక్సిన్ వచ్చినా, అది మనల్ని వదలదు. కనుక, మన స్వీయ సంరక్షణలో మనం ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆసుపత్రికి వెళ్లకుండా ఆరోగ్యజాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం.

ఎవరికి వారు ఆరోగ్యపరంగా వ్యక్తిగత ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పోషక విలువలు కల్గిన సరైన ఆహారం తీసుకోవాలి. పరగడుపున వేడినీళ్లు త్రాగడం, వాకింగ్, యోగాసనాలు మొదలైనవి చేస్తూ రోగనిరోధకశక్తి (ఇమ్యూనిటీ పవర్) పెంచుకుంటూపోతే భయపడాల్సిన అవసరం ఉండదు.

# నీలాల మబ్బుతునక నేలకు దిగి వచ్చెనా?

- శ్రీమతి సి.వేదవతి


లోకంలో ధర్మానికి ఆపద వాటిల్లినప్పుడల్లా మంచిని పెంచడం కోసం, చెడును నిర్జించటం కోసం స్వయంగా దిగి వస్తానని చెప్పిన భగవంతుడు అవనిలో కృష్ణశిశువై అవతరించిన వేళ – ఇది!

దేవుడై పుట్టినా, మనిషిలాగే వర్తిస్తూ, మధ్యమధ్యలో దేవుడల్లే మహిమలు చేస్తూ, కన్నతల్లి ఒడినుండీ, కురుక్షేత్ర మధ్యం దాకా, అనేకానేక అద్భుతాల లీలావిలాసాలను ప్రదర్శించినవాడు శ్రీకృష్ణుడు.

అపరిమితమైన జగద్వ్యాపకత్వం, ఆ పరబ్రహ్మ స్వరూపమైతే, జగద్రక్షకత్వం ఆయన స్వభావం. అప్పుడప్పుడూ పరిమితత్వానికి తనను తాను కుదించుకుని లీలామానుషవిగ్రహాన్ని ప్రదర్శిస్తుంటాడు. అది లోకకల్యాణం కోసం!

మహాసమ్మోహనకరమైన రసస్వరూపమూ, నిగూఢమైన తాత్త్వికజ్ఞానస్వరూపమూ కలపోతగా ఈ పృథివికి దిగి వచ్చిన భగవత్ చైతన్యమే శ్రీకృష్ణపరబ్రహ్మతత్త్వం! ఈ శ్రీకృష్ణ రూప చైతన్యమే అనాదిగా భారతీయాత్మను వెన్నెలవాకవలె స్పర్శిస్తున్నది. పులకింపచేస్తున్నది. భక్తిరసస్రోతస్వినిలో ముంచెత్తుతున్నది. అతిలోకమైన వాత్సల్య, శృంగార, తాత్త్వికపరమైన అనుభవాలను అందచేస్తున్నది. రక్తికీ, ముక్తికీ, జీవనసఫలతకూ, బంధవిమోచనకూ మధ్య వారధి అవుతున్నది.

అద్భుతమైన ఒక మహాసౌందర్యం భువికి దిగివచ్చి కృష్ణుడై నడయాడటమూ ఒక జగదధీశ్వరశక్తి పరమశిశువై పల్లె తల్లి పొత్తిళ్లలో ఒదిగిపోవటమూ– ఇదంతా భారతీయ భావసంస్కారం పండించుకొన్న పరమాకర్షక కృష్ణతత్త్వ స్వరూపం!



ఈ కృష్ణతత్త్వంలోని మనోహరమైన, రసోలక్షణాన్ని మనకు మహాభారతం, హరివంశం, విష్ణుపురాణం, శ్రీమద్భాగవతం చాటిచెపుతాయి. చదివిన కొలదీ చవులూరించే కృష్ణకథాసుధార్ణవంలో ముంచెత్తుతాయి! నాటినుండీ మన సాహిత్య, సంగీత, నాట్య, చిత్రకళావైభవాలన్నిటా తానే నిండిన కృష్ణభావనామాధురి ఒక తరగని, తనివితీరని సుధాస్రవంతిగా అటు రసికులనూ, ఇటు యోగులనూ ఆకర్షిస్తున్నది. రక్తికీ భక్తికీ సోపానమౌతున్నది.

బాలకృష్ణుడు అంటేనే చాలు చేత వెన్నముద్ద, చెంగల్వ పూదండ, బంగారు మొలతాడు పట్టుదట్టి సందిట తావీదు– సిరిమువ్వగజ్జెలతో ఒక ముగ్ధకిశోర రూపం మన కన్నుల ముందు నిలుస్తుంది. ఎంతటి వాత్సల్యపరవశత్వాన్ని కలిగిస్తుంది ఆ రూపం! అందుకేనేమో ఈ దేశంలో తల్లులందరూ యశోదలు – శిశువులందరూ బాలకృష్ణులూ అయినంతగా మమేకం కావడం! ఒక అద్భుత వాత్సల్యార్ణవంగా ఈ బాలకృష్ణానుభవం!

బృందావనిలో, వెన్నెలవేళలో మ్రోయించే మురళీ రవం, జగత్సర్వస్వాన్నీ సమ్మోహింపచేసే మోహనత్వం, రాధామాధవప్రేమతత్త్వంలోని అపురూపమైన ప్రణయోత్కర్ష– అదంతా ఒక దివ్యరసోల్లాసలీలా విశేషం!

ఈ బాల్యలీలా విలాసాలన్నిటినీ దాటి, ప్రౌఢనిర్భరవయఃపరిపాకంతో ఆరితేరి, రాజనీతిజ్ఞుడై పాండవులకు హితుడై, సన్నిహితుడై, సచివుడై మంత్రాంగం జరిపిన భారతీయ కృష్ణ తత్త్వం! అటుపైన కురుక్షేత్రమధ్యంలో విషాదంతో అస్త్ర సన్యాసం చేసిన అర్జునుడికి ధైర్యం చెప్పి, తత్త్వం తెలిపి, గీతను బోధించిన యోగీశ్వరతత్త్వం– ఇవన్నీ కృష్ణభావనలో బహువర్ణ విలసితంగా మనకు స్ఫురించే చిత్రమాలికలు. ఎంత సమ్మోహనకరమో అంత గంభీరమైన పరతత్త్వం కృష్ణతత్త్వం. అన్నీ తానే అయి అందినట్టు అందుతూనే అందకుండాపోయే లీలామానుషతత్త్వం శ్రీకృష్ణతత్త్వం!

# శ్రీమద్భగవద్గీత

9

## 9వ-అధ్యాయం (సారసంగ్రహం)

విద్వాన్, డా॥ ఈ.జి. హేమంత కుమార్,
94416 45995



### రాజవిద్యా రాజగుహ్య యోగం అధ్యాయ నామౌచిత్యం

"రాజవిద్య" అనగా రాజర్షులచే అనుష్ఠింపబడ్డ విద్య అనీ, విద్యలన్నిట్లోకి ఈ నిష్కామ కర్మయోగవిద్య రాజు అనీ, రాజగుహ్యమనగా రాజర్షులచే రహస్యంగా ఉంచబడిందనీ, రాజ రహస్యం అంటే రహస్యాలన్నిట్లోకి రహస్యమైందని తెలుస్తుంది. అధ్యాయమహిమ పేరులోనే నిరూపింపబడి ఉంది.

రాజ శబ్దం శ్రేష్ఠతావాచకం. విద్యల్లో కెల్ల మేలైన విద్య రాజవిద్య, అతి రహస్యమైన తత్వం చెప్పబడింది కనుక రాజగుహ్యం అన్నారు. ఈ అధ్యాయంలో అమూల్యమైన అధ్యాత్మవిద్యాప్రభావం చెప్పబడింది. అధ్యాత్మవిద్య అంటే బ్రహ్మవిద్య. ఇది మహాపవిత్రమైంది. ఉత్తమమైంది. ఇది పరోక్ష విద్యకాదు. అపరోక్షవిద్య. దీన్ని ఆచరించటం చాలా సులభం. అయితే శ్రద్ధ అవసరం. శ్రద్ధావిశ్వాసాలు లేనివారు భగవంతుణ్ణి పొందలేరు. మృత్యువుకు లోనవుతారు. ప్రాణులన్నీ పరమాత్మ లోనే ఉన్నాయి. గాలి ఆకాశంలో ఉన్నట్లు సర్వభూతాలు భగవంతుడిలోనే ఉన్నాయి. కల్పాంతంలో అంతరించిన ప్రాణులు కల్పాదిలో మళ్ళీ సృష్టింపబడతాయి. కర్మచేత పరమాత్మ బద్ధుడు కాడు. ఆయన అధ్యక్షుడు. చరాచరప్రకృతిని సృష్టిస్తాడు. మూఢులు పరతత్వాన్ని గుర్తించలేరు. మహాత్ములు గుర్తిస్తారు. వాళ్ళు సదా పరమాత్మను కీర్తిస్తారు. జ్ఞానయజ్ఞం చేస్తారు అని శ్రీకృష్ణుడన్నాడు. ఈ జగత్తుకు తండ్రి కృష్ణ భగవానుడే. అంతా ఆయన నుండే ఉద్భవించింది. ఆయనలోనే లీనమౌతుంది. ఈ బ్రహ్మవిద్యను అనుష్ఠించే మను, మాంధాత, జనక, భగీరథ, ఇక్ష్వాకాది రాజులంతా రాజులై ఉండి కూడా ఋషిత్వాన్ని పొందగల్గారు. రాజర్షులని కీర్తింపబడ్డారు. అటువంటి పరమ రహస్యమైన యోగాన్ని నీకు ఉపదేశిస్తున్నానని కృష్ణభగవానులు చెప్పడం చేత దీనికి రాజవిద్యా రాజగుహ్యయోగం అనే పేరు వచ్చింది.

ఈ అధ్యాయంలో మరో రహస్యం కూడా చెప్పబడి ఉంది. ఎంత దురాచారపరుడైనా, భగవదారాధన చేయగల్గితే సజ్జనుడే. వాడు తప్పకుండా ధర్మాత్ముడు, శాంతుడౌతాడు.

ఈ అధ్యాయం చదివితే ప్రతిగ్రహణ దోషం- అంటే ఇతరుల దగ్గర్నుంచి ఏదైనా వస్తువు తీసుకోవటం వల్ల సంక్రమించిన పాపం నశిస్తుంది.

### భగవంతుడంటున్నాడు

"అర్జునా! నీవు అసూయారహితుడవు గనుక విద్యలలో కెల్లా రాజు అనదగింది, అతిరహస్యమూ, విజ్ఞాన సహితమూ ఐన ఈ విద్యను నీకు తెలుపుతాను. దీన్ని తెలుసుకుంటే అశుభాల నుండి బయటపడతావు. ఈ విద్యను ఆచరించటం చాలా సులభం. ఇందుకు శ్రద్ధ అవసరం. శ్రద్ధ, విశ్వాసం లేనివారు నా మహిమ తెలుసుకోలేక, నన్ను పొందలేక మృత్యువుతో కూడిన సంసారకూపంలో పడిపోతుంటారు. పార్థా! కనబడని ఈ సమస్తప్రపంచం నాచే వ్యాపింపబడి ఉంది. చరాచర భూతకోటి అంతా నా యందే ఉంది. నేనే ప్రాణి కోటిని పుట్టిస్తున్నాను. పోషిస్తున్నాను. కానీ, నేను మాత్రం వాటియందు లేను. ఆకాశమంతా వాయువుఉంది. బ్రహ్మాండ మంతా నేను వ్యాపించి వున్నాను. గాలి ఆకాశాన్ని అంటనట్లు ఏ ప్రాణి యొక్క దోషం నన్నంటదు.

కౌంతేయా! ఈ ప్రకృతి నా అధీనం. ప్రళయకాలంలో భూతకోటి నాలో లీనమవుతుంది. సృష్టి ప్రారంభంలో మరల వ్యక్తమౌతుంది. సృష్టి, స్థితి లయ కారకుణ్ణి నేనే. ఆ వ్యాపారాలు నన్ను నిమిత్తంగా చేసుకునిసాగుతాయి.



ఆ కర్మబంధం నన్ను బంధింపదు. నేను కేవలం సాక్షిని మాత్రమే. ఈ జగన్నాటకం ఇలానే అవిచ్ఛిన్నంగా జరుగుతున్నది.

మూఢులైన మానవులు మాయవల్ల నన్నూ, నా పరం జ్యోతిని తెలుసుకోలేక సామాన్యమానవునిగా భావించి అనాదరంతో ఉంటారు. పార్థా! మానవులు దైవస్వభావులని, అసురస్వభావులని రెండు తెగలు. దైవస్వభావులు నన్నెల్లప్పుడు అనన్యచిత్తులై భక్తిపూర్వకంగా నమస్కరిస్తూ, పూజిస్తూ, ధ్యానిస్తూ, భజిస్తూ ఉంటారు. వీరు జ్ఞానయజ్ఞాన్నే ఆచరిస్తుంటారు. అసురస్వభావులు ఆలోచనారహితంగా వ్యర్థమైన ఆశలతో వ్యర్థకర్మల్ని చేస్తూ ఆసురస్వభావాన్ని కలిగి అహంకారదర్పంతో అజ్ఞానులై ఉంటారు.

**ఎడమచేతితో కరోనాను ఓడించవచ్చు**

**బయటికి వెళ్లినప్పుడు ఏ పనైన గానీ ఎడమ చేతితో మాత్రమే చేయండి. నోట్లు తీసుకోవడం, లిఫ్ట్ డోరు తెరవడం ఇలా ఏ పనైన ఎడమ చేతితో చేస్తే పొరపాటుననైన మనం కుడిచేతితో కళ్లు, ముక్కు, ముఖం, తాకడం లాంటివి చేస్తే వైరస్ సోకే ప్రమాదం చాలా తక్కువ.**

అర్జునా! నేనే క్రతువు. నేనే యజ్ఞం. పితృదేవతల కర్పించే అన్నం, ఆజ్యం, అగ్ని, హవిస్సు, సర్వఓషధులు, యజ్ఞమంత్రం నేనే. ఈ జగత్తు కంతటికీ తల్లిని, తండ్రిని, తాతను, తెల్సుకోవలసిన వాణ్ణి. ఓంకారస్వరూపుణ్ణి, వేద వేద్యుడను నేనే. ఈ ప్రాణులకు ప్రభువును. సర్వసాక్షిని, సృష్టి, స్థితి, లయకారుణ్ణి, నిధినిక్షేపాన్ని అన్నీ నేనే. కానీ అల్పజ్ఞులు కొందరు నన్ను, నా స్వరూపాన్ని తెలుసుకోలేక ఏవో కొన్ని పుణ్యకార్యాలు చేసి స్వర్గలోక సుఖాలనుభవించి పుణ్యం క్షీణించి పోగానే మరల మరల ఈ లోకంలోనే జన్మిస్తూ, ఈ సంసారంలోనే తిరుగులాడుతూ ఉంటారు.

ఎవరు నా పట్ల అనన్యభక్తి కలిగి వేరే చింతలేక, దేన్నీ కోరక, ఇంద్రియవిషయాల మీదకు మనస్సును పోనీయక నిరంతరం నన్ను స్మరిస్తారో, పూజిస్తారో వారు జన్మరాహిత్య స్థితి పొందగల్గుతారు. అట్టివారి యోగాన్నీ, క్షేమాన్ని నేనే స్వయంగా నిర్వహిస్తూ ఉంటాను.

అర్జునా! నన్ను పూజించుట సులభం. భక్తుడు ప్రీతి పూర్వకంగా ఆకును గానీ, పువ్వునుగానీ, పండునుగానీ, నీటిని గానీ అర్పిస్తే చాలు. మనుజుడు ఏపని చేసినా, ఏమి తింటున్నా, ఏ హోమం చేసినా, ఏది ఇతరులకు ఇచ్చినా ఏ రకమైన తపస్సు చేసినా దాన్ని పరమేశ్వరార్పణబుద్ధితో అర్పిస్తే చాలు. వారికి సద్గతి చేకూరుతుంది. అర్జునా! నే నన్ని ప్రాణుల యెడల సమభావంతోనే ఉంటాను. నాకు ఇష్టుడు గానీ, అనిష్టుడుగానీ ఎవరూ లేరు. భక్తితో నన్నారాధించే వారిలో నేనున్నాను. నా యందు వారున్నారు.

నన్ను భక్తితో కొలిచే వారిని నేను రక్షిస్తాను. గొప్ప దురాచారపరుడైనా నా భక్తుడైనవాడు సాధువనే తలుస్తాను. నా భక్తుడెన్నడూ చెడడు. ఇక పుణ్యాత్ముల విషయమై వేరే చెప్పాలా అర్జునా? ఈ ప్రపంచం అనిత్యం, అశాశ్వతం. ఇక్కడ సుఖం లేదు. కనుక అర్జునా! శాశ్వతపదవికోసం, పరమానంద స్థితి కోసం జనులు నన్ను తప్పక సేవించాల్సిందే.

నా యందే మనస్సు నిలిపి, భక్తితో నన్నే ఆరాధిస్తూ, నమస్కరిస్తూ, నా కోసం యజ్ఞాలు చేస్తూ, నన్నే శరణాగతి చేస్తే అలాంటి భక్తునికి తప్పక సాయుజ్యం ఇస్తానంటున్నాడు కృష్ణపరమాత్మ.

# 'దేశభక్తి' తాత్కాలిక అవసరం కాదు.

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

భూమిని 'మాతృమూర్తి'గా భావించి ఆరాధించడం మన సంప్రదాయం. అమ్మలో ఉన్న లక్షణాలన్నీ భూమిలో కనిపిస్తాయి. ఉనికినీ, పోషణనీ, రక్షణనీ, భద్రతనీ ప్రసాదించి, చివరకు లయమైతే తనలో పొదువుకొని కడుపులో కలుపుకొనే భూదేవిని అమ్మగా కాక ఇంకెలా భావించుతాం. కనుక **'వందేమాతరమ్'** మానవుల నినాదం.

వేదంలో ఈ భావన పల్లవించింది.


**"మాతృభూమిని సేవించు"** అని ఋగ్వేదం ప్రవచించింది.

వసుధనంతటినీ ఒక కుటుంబంగా భావించాలి అనే చింతనను కూడా ఋషి సంస్కృతి ప్రసరించింది. భూఖండమంతా మన తల్లే. సందేహం లేదు. కానీ 'మనదైన భూభాగం మనదేశం' అని ఏ భూమిని భావిస్తున్నామో, దానిని మన 'మాతృభూమి'గా సేవించడం ప్రధానం. ఎవరి ఇల్లు వారు చక్కబెట్టుకుంటే సమాజమంతా క్షేమమే. అదే విధంగా ఎవరి దేశాన్ని వారు మాతృభూమిగా సమర్చించి, దాని సర్వతోముఖాభి వృద్ధికి తనవంతు కృషిని సమర్పించి తీరాలి.

**"మాతా భూమిః పుత్రో అహం పృథివ్యాః"**- అని అథర్వణ వేదమంత్రం. "అమ్మ భూమి. నేను ఈ భూమికి పుత్రుణ్ని"- అని దీని అర్థం. **"వయం రాష్ట్ర జాగృయామ"** అని యజుర్వేద మంత్రం. (మనమంతా దేశాభివృద్ధికై జాగరూకులమై ఉండాలి).

దేశభక్తి సనాతన వైదికభావనగా ఈ మంత్రాల వల్ల స్పష్టమౌతోంది. ఇతరుల్ని హింసించి మనదేశాన్ని బాగు చేసుకోవడమనేది నీచమైన విషయం. ఒకరిఇంటిని కొల్లగొట్టి మన ఇంటిని సుసంపన్నం చేసుకోవడం తగదని దీని భావం.

పృథివి మొత్తాన్ని గౌరవిస్తూనే స్వదేశాన్ని రక్షించుకోవడం ఈ దేశం చెప్పిన నీతి. అందుకే భారతచరిత్రలో ఈ దేశం దేనిపైనా తనంత తాను దాడి చేయలేదు. ఇతరుల ఆక్రమణను భరించింది, ఎదిరించింది.



భూమిని మాతృమూర్తివలె, గోమాత వలె దర్శించిన పృథుచక్రవర్తి, ఈ ధరణిని హింసించకుండా, మేధాశక్తితో ఇందులోని సంపదను ఎలా వెలికి తీయాలో గ్రహించాడు. ఎలా వినియోగించాలో ఆకళింపు చేసుకున్నాడు. ఆ ప్రయత్నంలో ప్రకృతికీ, పర్యావరణానికి ప్రమాదం రాని విధంగా ఎలాంటి జాగ్రత్త తీసుకోవాలో అవలంబించాడు.

**ఆగష్టు, 15 స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా...**

భారతచక్రవర్తి పృథువు తన విజ్ఞాన సంపదతో, పాలనా దక్షతతో నేలతల్లి విలువను తెలియజెప్పిన కారణంగా ఈ తల్లికి 'పృథ్వి' అని పేరు వచ్చింది. భూమి గోరూపంలో రాగా, ఆమె పొదుగు నుంచి బహుసంపదలు గ్రహించినట్లుగా పురాణాలు సంకేతించడంలో ఎంతో అద్భుత భావన ఉంది. ఇది ప్రపంచదేశాలు గ్రహించ వలసిన ప్రకృతి పరిరక్షణరీతి.

ఈ నేల పై ఊపిరి తీసుకొని, ఈ తల్లి ఇచ్చే ఆహారాన్ని తినే అందరికీ తమ వంతు బాధ్యత ఉంది. అలసత్వాన్ని విడిచి, అక్రమాన్ని వదలి, కాలుష్యాలను ఈ దేశ పరిసరాల్లో లేకుండా జాగ్రత్తపడాలి. "నేనొక్కణ్ణీ చేస్తే సరిపోతుందా!" అని నిర్లక్ష్య పడటం తప్పు. ఇలా అందరూ నిర్లక్ష్యాన్ని కనబరిస్తే ఇక అంతా అభద్రతే!

మన కొద్దిపాటి నిర్లక్ష్యం, స్వార్థం దేశానికి పెద్దనష్టాన్నే కల్గించవచ్చు. మాతృభూమిపై భక్తి అనే భావన నుంచి "వందే మాతరం" అనే జాతీయ స్వరగీతిక ఈ జనజిహ్వలపై నర్తించింది.

**'దేశభక్తి' అనేది ఏ యుద్ధాల సమయంలోనో, ఏ పరాయిపాలనలోనో పుట్టుకు రావాల్సిన అవసరం కాదు. అది నిత్యం మనలో రగుల్కొనవలసిన చైతన్యం!**

స్వాతంత్ర్యంసిద్ధి ఉపాసనలో పరమమంత్రమైంది. దేశం అనగానే కేవలం మట్టి మాత్రమే కాదు. ఆ మట్టిలో పరిమళించే తరతరాల సంస్కృతి, దాని ఔన్నత్యం. అమ్మతో పాటు అమ్మ చరిత్రను గౌరవించే శిశువులా ఉండాలి. అదృష్ట వశాత్తు మన దేశధారుణి సార్వకాలికవిలువల్ని, సార్వజనీన సత్యాలనీ యుగాలనాడే ఆవిష్కరించిన పవిత్రఘనచరిత్ర కలిగిన జనని. ఆ పరంపరనీ, నేటి ప్రగతినీ విస్తృతపరచి రక్షించుకునే బాధ్యతనే దేశభక్తి అంటారు.

"తల్లికీ దేశానికీ తేడా లేదు. స్వర్గం కన్నా మిన్న నా దేశం" అని శ్రీరామచంద్రుడే అన్నట్లుగా పూర్వీకులు చెప్పుకొంటూ వస్తున్నారు.

ఈ దేశభక్తిని పసితనం నుంచే పిల్లలలో పెంచిపోషించకపోతే, ఈ తల్లి నేలపై మమత పెరగదు. అది పెరగనినాడు దేశం పట్ల తమ బాధ్యతను విస్మరించే ప్రమాదం ఉంది!

# తేనెల తేటల మాటలతో..

– శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత శర్మ

తేనెల తేటల మాటలతో మన దేశ మాతనే కొలిచెదమా
భావం భాగ్యం కూర్చుకుని ఇక జీవనయానం చేయుదమా

సాగరమేఖల చుట్టుకుని
సురగంగచీరగా మలచుకుని
గీతాగానం పాడుకుని
మన దేవికి ఇవ్వాలి హారతులు

గాంగ జటాధర భావనతో
హిమశైల శిఖరమే నిలబడగా
గల గల పారే నదులన్నీ
ఒక బృందగానమే చేస్తుంటే

ఎందరో వీరుల త్యాగఫలం
మన నేటి స్వేచ్ఛకే మూలబలం
వారందరిని తలచుకుని
మన మానసవీథిని నిలుపుకుని

తేనెల తేటల మాటలతో మన దేశమాతనే కొలిచెదమా
భావం భాగ్యం కూర్చుకుని ఇక జీవనయానం చేయుదమా


తాను సేయునట్టి ధర్మమే తన సొమ్ము



# పరిపూర్ణ వేదమూర్తి

- డా॥ కప్పగంతు రామకృష్ణ

శ్రీమహావిష్ణువు ధరించిన అవతారాల్లో హయగ్రీవ అవతారం ఒకటి. ఈ అవతారంలో స్వామి వేదాలను ఉద్ధరించారు. అందువల్ల, వేదాలతో పాటు సమస్తవాఙ్మయానికి, జ్ఞానానికి హయగ్రీవుడు అధిపతి అయ్యారు.

ఈ అవతారంలో స్వామి గుర్రం ఆకారపు ముఖం, మానవశరీరంతో కలిసిన రూపులో దర్శనమిస్తారు. స్వామి వామాంకం మీద లక్ష్మీదేవి ఆసీనురాలై ఉంటుంది. స్వామి తెల్లటి శరీరఛాయ కలిగి ఉండి; శంఖం, చక్రం, చిన్ముద్ర, పుస్తకాలను నాలుగు చేతుల్లో ధరించి భక్తులకు దర్శనమిస్తారు.

శ్రావణపూర్ణిమ రోజున హయగ్రీవ అవతారం జరిగినట్లు పురాణకథనం. దేవీభాగవతం, స్కందపురాణం, భాగవతం వంటి పురాణ, ఇతిహాసాల్లో హయగ్రీవ అవతారానికి సంబంధించి అనేక అంశాలు వర్ణితమై ఉన్నాయి.

మధుకైటభులనే రాక్షసులు వేదాలను అపహరించి, పాతాళంలో దాచిపెడతారు. వేదాలు లేనిదే సృష్టి కార్యం చేయలేనని బ్రహ్మదేవుడు విష్ణుమూర్తికి విన్నవించుకుంటాడు. వెంటనే, శ్రీమహావిష్ణువు హయగ్రీవ అవతారంలో పాతాళానికి చేరి, మధుకైటభులను వధించి, వేదాలను రక్షించి, బ్రహ్మదేవునకు తిరిగి అప్పగిస్తాడు.



హయగ్రీవోత్పత్తికి సంబంధించిన మరొక కథ కూడా వ్యాప్తిలో ఉంది. దేవాసురయుద్ధంలో అలసిపోయిన శ్రీమహావిష్ణువు నారి బిగించి ఉన్న తన ధనుస్సు మీదే గడ్డం ఆనించి గాఢనిద్రలోకి జారుకున్నాడు. ఆయన్ని నిద్రలేపడానికి దేవతలు చెదపురుగును సృష్టించి వింటినారిని తినమని ఆదేశించారు.

“నిద్రాభంగం, భగవత్కథాశ్రవణ విఘ్నం, దంపతులను విడదీయటం, మాతాశిశువులను వేరుచేయడం... బ్రహ్మహత్యా సమానం అని చెబుతారు కదా. అలాంటిది సాక్షాత్తు శ్రీమన్నారాయణునికే నిద్రాభంగం కలిగించటం నేరం కాదా? నన్నీ పాపానికి ఎందుకు ప్రోత్సహిస్తున్నారు? దీనివల్ల నాకేమిటి ప్రయోజనం?” అని ఆ పురుగు బ్రహ్మదేవుడిని ప్రశ్నించింది.

యజ్ఞాల్లో మాకు వచ్చే హవిస్సులో నీకూ భాగం ఇస్తామని బ్రహ్మదేవుడు మాట ఇవ్వటంతో ఆ పురుగు విష్ణుమూర్తి వింటి నారిని కొరికింది. అంతే, త్రివిక్రముని తల తెగి ఎక్కడపడిందో తెలియలేదు. దేవతలు మొండెం మాత్రమే కనిపించటంతో దిగ్భ్రాంతి చెందారు.



"ఏమిటీ దారుణం?
ఎవరిదీ మాయ?
నిన్నుమించిన మాయ కూడా
ఉందా ఈ జగత్తులో జగన్నాథా?"

అని వాపోయారు. బృహస్పతి సలహాతో పరాశక్తిని ప్రార్థించారు.

అప్పుడామె ప్రత్యక్షమై.... దేవతలారా! పూర్వం హయగ్రీవుడనే అసురుడు ఘోరతపస్సు చేసి తనకు మరణం లేకుండా వరం ఇమ్మన్నాడు. అది అసంభవం మరొకటి కోరుకోమనగా తన మరణం తన వల్లనే (హయగ్రీవుని చేతనే) కలగాలని అర్థించాడు. నేను అలాగే అనుగ్రహించాను. కాబట్టి గుర్రపు తల తెచ్చి విష్ణువు మొండేనికి తగిలించండి అని పరమేశ్వరి బోధించింది. దేవతలు అలాగే చేశారు. దీంతో శ్రీమహావిష్ణువు హయగ్రీవుడై అవతరించి హయగ్రీవుడనే రాక్షసుణ్ణి సంహరించాడు. ఆదిశక్తి అనుగ్రహంతో అన్ని విద్యలకు ఆదిదేవుడయ్యాడు. దేవీభాగవతంలో ఉన్న ఈ కథకు శతపథ బ్రాహ్మణం మూలం.

ఇద్దరు హయగ్రీవులలో ఒకరు దేహభావంతో ఉన్న జీవుడు(నరుడు) కాగా మరొకరు ఆత్మనిష్ఠుడైన దేవుడు (నారాయణుడు). దేహభ్రాంతితో ఉంటే పురుషుడు. అది తొలగితే పురుషోత్తముడు. నరునికి నారాయణత్వం కలిగించటమే అవతార ప్రయోజనం. హయగ్రీవుని చేతిలో హయగ్రీవుడు మరణిస్తేనే, అనగా తన చేత తాను నశించినప్పుడే జీవుడికి అమరత్వం సిద్ధిస్తుంది.

## హయగ్రీవ క్షేత్రాలు

**సకల విద్యాధినాయకుడైన హయగ్రీవుని ఆలయాలన్నీ శక్తిమంతమైనవిగా ప్రసిద్ధిపొందాయి. తిరుమల, శ్రీరంగం, కంచి, తిరువేండి క్షేత్రాల్లో హయగ్రీవస్వామి ఆలయాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని గొల్లప్రోలు సమీపంలో కూడా హయగ్రీవస్వామి ఆలయం ఉంది. అస్సాం రాష్ట్రంలోని గౌహతి నుంచి సుమారు 20 కి.మీ. దూరంలో 'హాజో' అనే ప్రాంతం లోని ఓ పర్వతాగ్రంపై హయగ్రీవ ఆలయం ఉంది. ఇక్కడ స్వామి 'హయగ్రీవమాధవుడి'గా పూజలందుకుంటారు.**

## వేదమూర్తి హయగ్రీవుడు

హయగ్రీవుడు పరిపూర్ణ వేదమూర్తి. స్వామి రూపం సకల విద్యలకు నిలయంగా భాసిస్తుంది. అంతేకాదు, హయగ్రీవుడు సకల దేవతాస్వరూపం కూడా. సాక్షాత్తు హయగ్రీవ స్వామి అగస్త్యమహర్షికి శక్తి ఉపాసనారహస్యాలను బోధించాడు.


అంతేకాదు, సకలమంత్ర, తంత్రాలకు సైతం హయగ్రీవుడు అధిపతి అని బ్రహ్మాండాది పురాణాలు విస్పష్టంగా ప్రకటిస్తున్నాయి.

మహోన్నత అవతారమూర్తి అయిన హయగ్రీవస్వామిని అర్చించిన ఎందరో ఋషులు ఆత్మజ్ఞానాన్ని సంపాదించి, తిరిగి ఆ విజ్ఞానాన్ని సమాజ పునరుద్ధరణకోసం వినియోగించారు. సాక్షాత్తు పరమేశ్వర స్వరూపమైన ఆదిశంకరులు, విశిష్టాద్వైత మత సిద్ధాంతకర్త రామానుజాచార్యులు హయగ్రీవోపాసన చేసి, సర్వోన్నతజ్ఞానాన్ని సంపాదించారు. హయగ్రీవోపాసన పుణ్యఫలితంవల్ల 'శ్రీపాద రాజతీర్థుల'నే పండితుడు రాజాస్థానంలో జరిగిన పాండిత్య సభలో విజయం సాధించాడు. మంత్రప్రభావంవల్ల శ్రీపాదునకు కలిగిన వాగ్బంధనం కూడా హయగ్రీవోపాసన వల్ల తొలగిపోయింది. గాలవుడనే మహర్షి హయగ్రీవుని ఉపాసన చేయటం వల్లనే వేదవిద్యాపారంగతుడయ్యాని మహాభారతం చెబుతోంది. సూర్యునితోసహా దేవతలందరూ హయగ్రీవుని ఉపాసన చేసినట్లు హయగ్రీవోపనిషత్ చెబుతోంది.

హయగ్రీవస్తుతిని నిశ్చలబుద్ధితో పారాయణ చేసిన వారికి సకల విద్యాబుద్ధులు కలుగుతాయని శాస్త్రవచనం. హయగ్రీవోత్పత్తి జరిగిన శ్రావణపూర్ణిమరోజున శ్రీమహావిష్ణువును హయగ్రీవమూర్తిగా అర్చించి, శనగలు, ఉలవలు, గుగ్గిళ్ళు నివేదన చేయాలి. ప్రత్యేకించి, విద్యార్థులు నిత్యం హయగ్రీవస్తోత్రాన్ని పఠించటం వల్ల ఉత్తమవిద్య స్వామిఅనుగ్రహ ఫలితంగా లభిస్తుంది.

*(గత సంచిక తరువాయి....)*

# తిరుమల సమయాచారములు



(తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)


తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు


వేంగడత్తుఱై వాన్ (ఉత్సవమూర్తి) తన యవతారదిన వైభవముచే దివ్యనగరాభివృద్ధికి అనుకూలురు కారు అను ఐతిహ్యము ఆ స్థలమున ప్రసిద్ధమై యుండుటచేత, ఇక, నగరాభి వృద్ధికై శ్రీవేంకటాచలపతి(మూలవిరాట్టు) కనకలతా యోగమున అవతరించినను, సన్నిధియందు దివ్యైశ్వర్యము ఉత్తరోత్తరాభివృద్ధి చెందుటకై అప్పుడు ఉత్సవమూర్తిగా ఆరాధన లందుకొనుచున్న వేంగడత్తుఱై వానును కౌతుకమూర్తిగను, కౌతుకమూర్తియగు 'మలై కునియ నిన్ఱ పెరుమాళు'ను (విగ్రహమును) ఉత్సవమూర్తి గను ఆరాధనము పొందునట్లుగ యంత్రోద్ధరణ పూర్వకముగ ఆవాహనము చేసి ఆరాధన లందుకొనునట్లును చేయ సంక ల్పించినారు.

బింబాధరుని (శెంగనివాయన్) వంశమున పుట్టిన పరమభాగవతుల శ్రీహస్తముతోడనే శ్రీవేంకటేశ్వరుడు నిత్యా రాధన మందుకొనునట్లును-

"గోక్షీరైర్హేమకుంభస్థై ర్వల్మీకవివరోదరమ్,
అనుస్యూతాచ్ఛిన్నధారై రభిషేకం ప్రచక్రమే.
క్రియమాణాభిషేకేణ వల్మీకవివరాంతరాత్,
ఆవిర్బభూవ భగవాన్ వరాహవపురీశ్వరః."

(బంగారు కలశములందలి యావుపాలచే అవిచ్ఛిన్న ధారలతోడ పుట్టరంధ్రము లోభాగమును అభిషేకించు టారంభ మాయెను. అట్లు చేసెడి యభిషేకముచేత పుట్టరంధ్రము లోపలి నుంచి వరాహరూపియును సర్వనియంతయు నగు భగవాను డావిర్భవించెను.)

అనునట్లుగ భూగోళవరాహ (పురాణ)ము ఆరవయధ్యా యమునందును వరాహపద్మపురాణములందును ప్రసిద్ధమై స్వయంవ్యక్తముగా ఆవిర్భవించిన జ్ఞానమూర్తి (వరాహస్వామి) వేంకటాధీశ్వరునకు పూర్వపుకల్పము నందే దివ్యావతారము గైకొని యున్నందునను,

"రథ్యాబల్యంతరే దేవం బలిహోమవివర్జితమ్,
ఆరాధయే దప్రధానం న కుర్యా దుత్సవాదికమ్."

(వీథి- బలిస్థానములకు మధ్యనున్నట్టి దేవుని బలి హోమములు లేకుండ అప్రధానముగనే ఆరాధింపవలెను. ఉత్సవాదులు చేయరాదు.)

అని వైఖానసశాస్త్రమున ఆనందసంహితయం దుండుట చేత ఒక క్షేత్రమున రెండు విగ్రహములకు సమప్రాధాన్యము తోడపూజామహోత్సవాదులు నిషిద్ధమని జ్ఞానమూర్తికి బలిపీఠా ర్చన నిత్యమహోత్సవాదులు ఏవియు లేకుండ,

"మత్స్థాపిత వరాహస్య పూర్వం స్యా త్పూజనం హరే,
దర్శనం స్నానదానాద్యై రిత్యుక్తోయం శ్రియఃపతిః
తథాఽ స్త్వితి వరం దత్వా కారయామాస తత్తథాః."

(హరీ, నాచే స్థాపింపబడిన వరాహస్వామికి స్నాన దానాదులతోడ పూజనము దర్శనము ముందుగా జరుగవలెను- అని బ్రహ్మ చెప్పగా శ్రియఃపతి అట్లే యగుగాక యని వరమిచ్చి యని యట్లే చేయించెను.)

అని బ్రహ్మపురాణమునందు అష్టమాధ్యాయమునం దున్నట్లే శ్రీవేంకటాచలపతికంటె ముందుగ త్రిసంధ్యలందును జ్ఞానవరాహస్వామికి ఆరాధనయు నివేదనము జరుగునట్లును అచ్చోటను ఉత్సవమూర్తిని కూడ ప్రతిష్ఠింపజేసి ఆరాధన చేయునట్లును జరిపించెను. అధ్యయనోత్సవము మాత్రము ఒకే దినమున జరిపింపవలెను.

"శ్రీవేంకటవరాహాయ స్వామిపుష్కరిణీతటే,
శ్రవణే తులామాసే ప్రాదుర్భూతాత్మనే నమః."

(స్వామిపుష్కరిణీ తీరమున తులామాసము శ్రవణ నక్షత్రమున ఆవిర్భూతస్వరూపుడగు శ్రీవేంకటవరాహునకు నమస్కారము.)

అనినట్లుగ ఆయన జన్మనక్షత్రమగు తులామాసమందలి శ్రవణనక్షత్రమందు శ్రీవరాహజయంతియు విశేషోత్సవముగా కొండాడవలెను"

"నిత్యం బిలేన చాగత్య దేవం నత్వా నృపోత్తమః,
రాజ్యం చకార ధర్మేణ భుంజానో భోగముత్తమమ్."

(ఆ రాజశేఖరుడు ప్రతిదినము బిలమార్గమున వచ్చి దేవునకు మొక్కి ఉత్తమభోగము లనుభవించుచు ధర్మముగ రాజ్యముచేసెను.)

అని భూగోళవరాహమున పదవ యధ్యాయమందు చెప్పిన చొప్పున తొండమాన్ చక్రవర్తి కలియుగారంభమున శ్రీవేంకటేశ్వరుని పాదారవిందములపై పరిపూర్ణభక్తి గలవాడై భగవదనుగ్రహముచే రాజ్యమును ధర్మమార్గమున పరిపాలించుచు, సకలభోగముల ననుభవించుచు, ప్రతిదినమున తన రాజభవనమునకు తిరుమలకును రాకపోకలకైన ఒక బిల మార్గమును స్వామి చూపగ అందుచొచ్చి స్వామి సన్నిధికి పోయి సేవించి వచ్చుచుండెను. ఇట్లుండగా–

"స్థితే కదాచిత్క్షితిపే శ్రీనివాసస్య సన్నిధౌ,
శత్రవశ్చ బలోద్రిక్తా రురుధుస్తస్యవై పురీమ్."

(ఆ ప్రభువు శ్రీనివాసుని సన్నిధిలో నుండగా, ఒకానొకప్పుడు బలదర్పితులగు శత్రువులు అతని పట్టణమును ముట్టడించిరి.)

అని బ్రహ్మపురాణము వర్ణించిన విధముగా సామంతరాజు లితనిని జయింపవచ్చి పట్టణము ముట్టడించిరి. అప్పుడు చక్రవర్తియు వారిని తరుముతూపోయి పోరుసలుపుచుండ పరస్పరయుద్ధము నడచుచుండెను. చక్రవర్తి బలము క్షీణింపగ పరాజితుడై స్వదేశమునకు పరుగిడి వచ్చి శ్రీనరసింహునికి ప్రణమిల్లి మరల బయలుదేరి శ్రీభూదేవులతో కలసియున్న శ్రీనివాసుని చూడ నరిగెను. హఠాత్తుగ వచ్చుచున్న ఆతనిని చూచి శ్రీదేవి భూదేవులు దాగుకొనిరి, (స్వామి) ఓయీ నృపా, అకాలమున వచ్చితివేల?– అని నమస్క రించుచున్న అతనితో ననెను.

అని భూగోళవరాహమున దశమాధ్యాయమున నున్న తీరుగ బిలద్వారమున ప్రవేశించి అకాలమున వచ్చి నిలువగ, అప్పుడు ఏకాంతసన్నివేశమున సేవించుచున్న శ్రీభూదేవు లిరువురును అదృశ్యులైరి. అంతఃపురమునకు పరపురుషుడు వచ్చినాడని సంకోచించి శ్రీదేవి తనకు నిత్యనివాసస్థానమైన శ్రీనివాసుని దివ్యవక్షఃస్థల మధిష్ఠించినది. భూదేవి బయలు వెడలి పూర్వకాలము రంగదాసుడు శ్రీనందవన కైంకర్యార్థమై త్రవ్విన, సమీపముననున్న బావిలో దుమికినది.

ఈ కథ ఆ స్థలమున పండితపావనసాధారణము, సర్వసంప్రతి సంపన్నమునై యున్నందున ఆ భూదేవిని అర్చా (విగ్రహ) రూపముగ ప్రతిష్ఠ చేయించి దేవికి సమీపమున ఒక 'తీర్థనయినార్' అను శ్రీనివాసునికూడ ప్రతిష్ఠించి ఆ బావిలో వారి నిరువురిని జంటగా విజయము చేయించి వారికి ప్రతి దినము ప్రసాదము ఆరగింపుచేయునట్లేర్పరచిరి.

(ఇంకా ఉంది)

## తిరుమలలో భక్తులు...

**తిరుమల మాడవీధులలో భక్తులు పాదరక్షలు వేసుకొని తిరుగరాదు.**

**ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్క్ ధరించవలెను.**

**మీ చుట్టు ప్రక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలెను.**

**ప్రతి ఒక్కరూ సామాజికదూరం తప్పక పాటించవలెను.**



అనువు గాని చోట అధికుల మనరాదు

# నిత్యవరదుడు

- డా॥ యల్లాప్రగడ మల్లికార్జునరావు

ఒక పిలుపుతో పలికే దైవంగా, భక్తులపాలిట కొంగు బంగారంగా అన్నవరం శ్రీసత్యనారాయణస్వామికి పేరుంది. ఆ స్వామి సత్యస్వరూపుడు, నిత్యవరదుడు. శ్రీసత్యనారాయణస్వామిఆలయం అన్నవరంలో రత్నగిరిపై ఉంది. ఈ ఆలయం నిర్మితమై ఒక శతాబ్దంపైగా మాత్రమే అయినా చాలా ప్రాముఖ్యతను పొందింది. సమీపంలో పంపానది గలగలా పారుతుంటుంది. కొండపై ఉన్న ఈ దేవాలయంలో వేంచేసి ఉన్న శ్రీసత్యనారాయణస్వామిని దర్శించు కొనేందుకు గుడివరకు ఘాట్‌రోడ్డు ఉంది. మెట్లమార్గాన కూడా వెళ్ళవచ్చు. ఇక్కడ సామూహికంగా వందలాది దంపతులు కూర్చుని ఒకేసారి శ్రీసత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆనందంగా చేసుకుంటూ ఉండటం ఒక ప్రత్యేకత.

## పేరులోనే పెన్నిధి

అడిగినవరాలను తీర్చే దేవుడు ఉన్న ఊరు కనుక అన్నవరం అనే పేరొచ్చింది. అలాగే అంతులేని వరాలను ఇచ్చే దేవుడు ఉన్న ఊరు కనుక అన్నవరం అనే పేరొచ్చిందని జనబాహుళ్యంలో ప్రచారంలో ఉంది.

స్థలపురాణం ప్రకారం పర్వతరాజైన మేరువు, ఆయన భార్య మేనక శ్రీమహావిష్ణువును గురించి తపస్సు చేసి, ఆ స్వామి అనుగ్రహంతో ఇద్దరు మగబిడ్డలను పొందుతారు. భద్రుడు, రత్నుడు అనే వారే ఆ ఇద్దరు. భద్రుడు విష్ణుమూర్తిని గురించి తపస్సు చేసి శ్రీరామచంద్రమూర్తికి నివాసస్థానమైన భద్రాచలంగా మారుతాడు. రత్నుడు కూడా విష్ణువు గురించి తపస్సు చేసి మహావిష్ణువు శ్రీవీరవేంకటసత్యనారాయణ స్వామిగా వెలసే రత్నగిరిగా ఉండే వరాన్ని పొందాడు. రత్నగిరినే రత్నాచలమని కూడా అంటుంటారు.

## పూర్వచరిత్ర

తూర్పు గోదావరిజిల్లాలో పిఠాపురానికి సమీపంలో గోరస గ్రామ ప్రభువు రాజా ఇనుగంటి వేంకటరామారాయణిం బహద్దరు పాలనలో అరికెంపూడి దగ్గర అన్నవరం అనే గ్రామం ఉంది. అక్కడ ఈరంకి ప్రకాశరావు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆయన మహాభక్తుడు. ఒకనాడు శ్రీమహావిష్ణువు ఈయనకు, రాజా ఇనుగంటి వేంకటరామారాయణిం బహద్దరుకు ఒకేసారి కలలో కనిపించి "వచ్చే శ్రావణశుక్లవిదియ మఖానక్షత్రంలో గురువారంనాడు రత్నగిరి మీద వెలవబోతున్నాను, నీవు నన్ను శాస్త్ర విధిగా ప్రతిష్ఠించి సేవించు". అని చెప్పి మాయమయ్యాడు.

మరునాడు ఇరువురు కలసి, తమకు వచ్చిన కలను ఒకరికొకరు చెప్పుకుని, ఖరనామ సంవత్సర శ్రావణశుక్లపాడ్యమి



నాటికే అందరు అన్నవరం చేరుకున్నారు. అక్కడ స్వామివారి కోసం వెదుకుతుండగా ఒక చెట్టు కింద పొదలో స్వామివారి పాదాలమీద సూర్యకిరణాలుపడుతూ కనిపించాయి.



వెంటనే ఆ పొదను తొలగించి, స్వామివిగ్రహాన్ని రత్నగిరిపైకి తీసుకు వెళ్లి కాశీ నుంచి తెచ్చిన శ్రీమత్రిపాద్విభూతి మహావైకుంఠనారాయణ యంత్రాన్ని విష్ణుపంచాయతన పూర్వకంగా 1891వ సంవత్సరం ఆగష్టు నెల ఆరో తేదీన ప్రతిష్ఠించారు. ఆలయాన్ని 1934వ సంవత్సరంలో నిర్మించారు. పంచాయతనం ఉండటం చేత దానికి ప్రతీకగా ముందు గణపతి, శంకరుల చిహ్నాలున్న శూల శిఖరాలతో ఉన్న రెండు చిన్నవిమాన గోపురాలు, మధ్యగా ప్రధాన విమానగోపురం, వెనుకగా ఆదిత్యదేవతా, అంబికా దేవతాప్రతీకలైన చక్రశిఖరాలు ఉన్న మరి రెండు విమాన గోపురాలను ఏర్పాటు చేసారు. ఒకే చోట ఇన్ని విధాలైన భిన్న దేవతాచిహ్నాలు ఉండటం విశేషం.

## అనుబంధ ఆలయాలు

ప్రధాన ఆలయానికి అనుబంధంగా రత్నగిరి మీద మరికొన్ని ఆలయాలున్నాయి.రత్నగిరి కొండలపై శ్రీవీరవేంకట సత్యనారాయణస్వామే ప్రధానదైవం. అన్నవరంలో శ్రీసీతా రాములవారి గుడి, వనదుర్గమ్మ గుడి, కనకదుర్గమ్మ గుడి కూడా ఆలయప్రాంగణంలో ఉన్నాయి. కొండ క్రింద గ్రామదేవత గుడి ఉంది.

పంపానది ఒడ్డున ఉన్న రత్నగిరి మీద ఈ ఆలయం సముద్ర మట్టానికి 300 అడుగుల ఎత్తులో ఉంది. ఈ గుడికి పాదచారులు చేరుకోవడానికి 460 మెట్లు ఉన్నాయి. ప్రధాన ఆలయం రథం ఆకారంలో ఉండి, నాలుగు దిక్కులలో నాలుగు చక్రాలతో ఉంటుంది. అలాగే ప్రధాన ఆలయానికి ఎదురుగా కల్యాణమండపం, రామాలయాలు ఉన్నాయి. ఈ ఆలయం రెండు అంతస్తులలో నిర్మితమైంది. కింది భాగంలో యంత్రం, పై అంతస్తులో స్వామి విగ్రహాలు ఉన్నాయి. క్రింద గర్భగుడి ఉన్న భాగాన్ని విష్ణుమూర్తిగా అర్చిస్తారు, మధ్యభాగాన్ని శివునిగా పూజిస్తారు. ఇలా త్రిమూర్తులు పూజలందుకోవటం ఇక్కడి విశేషం.

## ఉపాలయాల్లో నిర్వహించే పూజలు

ప్రతి శుక్రవారం రత్నగిరిపై ఉన్న వనదుర్గ అమ్మవారి ఆలయంలో చండీహోమం జరుగుతుంది. ప్రత్యేకరోజుల్లో విశిష్టపూజలు జరుగుతుంటాయి. చైత్రశుద్ధపాడ్యమి ఉగాది నాడు పంచాంగశ్రవణం, చైత్రశుద్ధఅష్టమినుంచి బహుళ పాడ్యమి వరకూ శ్రీరామనవమికల్యాణ ఉత్సవాలు జరుగుతాయి. చైత్ర బహుళషష్ఠి నుంచి అమావాస్య వరకూ కనకదుర్గ అమ్మవారి బ్రహ్మోత్సవాలు, వైశాఖశుద్ధదశమి నుంచి బహుళ పాడ్యమి వరకూ శ్రీసత్యదేవుని బ్రహ్మోత్సవాలు, శ్రీనేరేళ్లమ్మ ఉత్సవాలు, శ్రీస్వామివారి జయంతి వేడుకలు, శ్రీకృష్ణజయంతి, వినాయక చవితి నవరాత్రులు, శ్రీదేవి నవరాత్రులు, కార్తికమాసంలో ప్రతి సోమవారం శ్రీస్వామివారికి లక్షపత్రి పూజచేస్తారు. ప్రతి సోమ వారం అమ్మవారికి లక్ష కుంకుమ పూజ, గిరి ప్రదక్షిణ, జ్వాలా తోరణం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

## పండుగలు

రత్నగిరి పై ఎప్పుడూ నిత్యకల్యాణం పచ్చతోరణమే. శ్రావణశుద్ధవిదియనాడు శ్రీసత్యనారాయణస్వామి జయంతి.





**ఇక్కడ సామూహికంగా వందలాది దంపతులు కూర్చుని ఒకేసారి శ్రీసత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆనందంగా చేసుకుంటూ ఉండటం ఒక ప్రత్యేకత!**

వైశాఖశుద్ధ దశమి, వైశాఖ బహుళ పాడ్యమి (ఐదు రోజులు) శ్రీస్వామివారి కల్యాణోత్సవాలు జరుగుతాయి. వైశాఖశుద్ధ ఏకాదశి స్వామివారి కల్యాణం యంత్రాలయంలో లక్షకుంకుమార్చన, విజయదశమి, దీపావళి, కార్తిక పౌర్ణమి-గిరి ప్రదక్షిణ, జ్వాలాతోరణం, కార్తికశుద్ధ ద్వాదశి, తెప్పోత్సవం, మహాశివరాత్రి లక్షబిల్వార్చన.. ఇలా ఎన్నెన్నో పండుగలు, ఉత్సవాలు జరుగుతుంటాయి.

## కాలనిర్ణయ యంత్రం


పిడపర్తి కృష్ణమూర్తి శాస్త్రం ప్రకారం నిర్మించిన కాల నిర్ణయ, నిర్దేశక యంత్రం రత్నగిరి పైన ప్రధాన ఆలయానికి ప్రక్కన ఉంది. సూర్యుని నీడ (ఎండ) ఆధారంగా కాల నిర్ణయం చేసి, పని చేసే గడియారమిది.

## స్వర్ణాలంకరణ

పునరుద్ధరణలో భాగంగా నారాయణ గోపుర కలశం, గణేశ, బాలాత్రిపుర సుందరి, సూర్యనారాయణ, శంకర పంచాయత కలశాలకు బంగారు పూత వేసారు. క్షేత్రపాలకులైన రామాలయ గోపుర కలశం, ఆంజనేయస్వామి గోపురకలశం కూడా బంగరుపూతతో అలరారుతున్నాయి. రుద్రాక్షమండపం, మకరతోరణం, ద్వారాలు, ఊయలకు కూడా బంగారు పూత పూయించడంతో అన్నవరం ఆలయం స్వర్ణకాంతులతో కళకళలాడుతూ సత్యంగా భక్తులపాలిట కొంగుబంగారంగా శోభిల్లుతుంటుంది.

## రవాణా సౌకర్యం

కోల్‌కత్తా- చెన్నై జాతీయ రహదారిపై తుని పట్టణానికి 18 కి.మీ.ల దూరంలో, కాకినాడ నగరానికి 45 కి.మీ.ల దూరంలో, రాజమహేంద్రవరానికి 80 కి.మీ.ల దూరంలో, విశాఖపట్నం నుంచి 120 కి.మీ.ల దూరంలో అన్నవరం ఉంది. అన్నవరం రైల్వేస్టేషన్ ద్వారా రైలు సౌకర్యం ఉంది. విశాఖపట్నం, రాజమండ్రి విమానాశ్రయాల ద్వారా కూడా అన్నవరం చేరవచ్చు.



# అన్నీ సాధించవచ్చు!

- శ్రీ గరిమెళ్ళ శరవణ దీక్షితులు



గాయత్రీమంత్రాన్ని మించిన మంత్రం లేదు. కన్నతల్లి ఎలాగైతే బిడ్డల్ని కాపాడుకుంటుందో తన మంత్రాన్ని ఉపాసించిన వారిని కూడా గాయత్రీమాత కాపాడుతుంది.

మూడు సంధ్యల్లోనూ గాయత్రీమంత్రాన్ని జపించటం వల్ల ఏకాగ్రత, ఇంద్రియాలపై పట్టు లభిస్తాయి. నిత్యం నియమ నిష్ఠలతో గాయత్రిని ధ్యానించలేని, ఉపాసించలేని వారు గాయత్రీ మంత్రాన్ని త్రికాలలోనూ పదిసార్లు చొప్పున జపించినా ఉత్తమ ఫలితాలు కలుగుతాయి. ఏ పనిలో ఉన్నప్పటికీ చేస్తున్న పనిని కాసేపు ఆపి, కాళ్లకు ఉండే పాదరక్షలను వదిలి పెట్టి ఈ మంత్రజపం చేయవచ్చు.

గాయత్రీమంత్రాన్ని జపం చేస్తూ, హోమం చెయ్యటం ద్వారా కొన్ని రోగాల నుంచి ఉపశమనం పొందిన వారి వివరాలను దేవీభాగవతం వివరిస్తోంది.

రావిచెట్టు కింద శనివారం కూర్చొని నూరు సార్లు గాయత్రీ మంత్రాన్ని జపిస్తే భూత రోగాల నుంచి విముక్తి లభిస్తుంది. తిప్పతీగ ముక్కలు పాలలో నానపెట్టి గాయత్రీ మంత్రాన్ని జపిస్తూ ఆహుతి ఇస్తే అది మత్యుంజయ హోమం చేసిన ఫలితాన్నిస్తుంది. సర్వరోగనివారణ కలుగుతుంది. జ్వరం శాంతించటం కోసం గాయత్రీమంత్రాన్ని జపిస్తూ మామిడాకులు, పాలను కలిపి ఆహుతి ఇవ్వాలి. పాలలో వసను నానపెట్టి అగ్నిలో హోమం చేస్తే క్షయరోగం తగ్గుతుంది.

జమ్మి సమిధలను పాలు, నెయ్యితో కలిపి రెండేసి వందల సార్లు గాయత్రీమంత్రంతో హవనంచేస్తే ఇంట్లో శాంతి నెలకొంటుంది. దర్భను తాకి గాయత్రిని జపిస్తే భూతరోగాల నుంచి విముక్తి లభిస్తుంది. గాయత్రీ మంత్రజలాన్ని తాగినా ఇదే ఫలితం కలుగుతుంది. భూతశాంతికి నూరుసార్లు గాయత్రీమంత్రంతో భస్మాన్ని అభిమంత్రించి ఆ తర్వాత దాన్ని నొసటన ధరించాలి. అలాంటి వారికి భూతశాంతితో పాటు వ్యాధుల నుంచి విముక్తి కలుగుతుంది.

గాయత్రీమంత్రంతో చక్కగా విచ్చిన పూలను తెచ్చి అగ్నిలో హోమం చేస్తే పుష్టి కలుగుతుంది. ఎర్ర కమలాలను గాయత్రీమంత్రంతో వ్రేల్చితే ధనప్రాప్తి కలుగుతుంది. మారేడు సమిధలను కానీ, ఫలపుష్పాలను కానీ, మారేడువేళ్లతో కానీ హోమం చేసిన వారింట సిరిసంపదలు తులతూగుతుంటాయి.

పాలు, పెరుగు, నెయ్యి, పేలాలు కలిపి గాయత్రీ మంత్రంతో జపం, హోమం చేసిన వరుడికి మంచి వధువు లభిస్తుందని దేవీభాగవతంలో గాయత్రీ మంత్ర జపహోమాల విశేషాల వివరణ కనిపిస్తుంది. గాయత్రీ మంత్రోపాసన ద్వారా శరీరంలో సర్వశక్తులు జాగృతమవుతాయి. దుర్బలత్వం తొలగిపోతుంది. ఆరోగ్యసిద్ధి కలుగుతుంది. అంతిమంగా పరమశాంతి లభిస్తుంది.

గాయత్రీ మంత్రంలోని విద్యుత్‌ప్రవాహంవంటి తేజస్సు ఆత్మతేజస్సుతో సమానం. ఆ తేజస్సును ధ్యానిస్తే సమస్త ప్రాపంచికవాసనలు నశిస్తాయి. ఆత్మసాక్షాత్కారం లభిస్తుంది. వేదాలు శబ్దబ్రహ్మగా మూర్తీభవించినప్పుడు ప్రజ్వరిల్లిన శబ్ద శక్తి స్వరూపమే గాయత్రీ బీజశక్తి. తపస్సంపన్నులైన మన ఋషులు ముందుతరాల వారిపై అనుగ్రహంతో ప్రసాదించిన దివ్యశక్తి గాయత్రీమంత్రరాజం. ఒక్కమాటలో చెప్పాలంటే గాయత్రీమంత్రజపంతో అన్నీ సాధించవచ్చు!



భూమి నాది యన్న భూమి ఫక్కున నవ్వు

# ఎంత దయామతివయ్యా!

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుశర్మ

శ్రీవైకుంఠంలో జయవిజయులు శ్రీమహావిష్ణువు పార్షదులు లోపలకు ఎవరూ వెళ్లకుండా కాపుకాస్తుంటారు. స్థానబలం విచిత్రమైన అహంకారాన్ని తీసుకుని వస్తుంది. అహంకరించడానికి ప్రత్యేకమైన విభూతి ఉండాల్సిన అవసరం లేదు. శ్రీమహావిష్ణువు ఏకాంతవాసాన్ని రక్షించేవాళ్లం మేమే. మా అనుమతి ఉంటే తప్ప విష్ణుదర్శనం అవదు అని అహంకరించారు.

ఒకసారి సనకసనందనాదులు శ్రీమహావిష్ణు దర్శనార్థం వచ్చారు. జయవిజయులు వారిని అడ్డగించారు. దాంతో వారు "మీరు ధూర్తత్వంతో మీ పరిధిని అతిక్రమించారు. ఈ పదవికి మీరు పనికిరారు. ఈ పదవిని విడిచిపెట్టి భూలోకంలో రాక్షసయోనుల యందు జన్మించమని" శాపమిచ్చారు. జయవిజయులు వారి కాళ్ల మీద పడ్డారు. శ్రీమహావిష్ణువు అంశతో బయటికి వచ్చారు.

ఆయన సర్వజ్ఞుడు. అన్నీ తెలిసినా "ఏమైంది? ఎందుకు అరుస్తున్నారు?" అన్నాడు. సనకసనందనులు జరిగిన విషయం చెప్పారు. "మా యందు ఏదైనా దోషం ఉన్నదా?" అని అడిగారు. "మీ దోషం ఏమీలేదు" అని, జయవిజయుల వంక తిరిగి ఇన్నాళ్లనుండీ పనిచేస్తున్నా ఒక చిన్నతప్పు చేస్తే మా యజమాని మమ్ము వెనక వేసుకుని రాలేదు అంటారని ఒక సిద్ధాంతం చెప్పాడు.

"నా భృత్యులేకదా అని తప్పుచేసినా వెనకవేసుకుని రావడం అలవాటైతే ఆ ప్రభువు చివరికి అపకీర్తి పొందుతాడు. తప్పుచేస్తే తప్పు చేసావు అని చెప్పవలసిందే. లేకపోతే నా ధర్మం పోతుంది. వాళ్లకి అవమానం జరగడానికి కారణం మీరు. అహంకారం ఎంత ప్రమాదకరమో తెలుసుకున్నారు కదా! అనుభవించవలసిందే! మూడుజన్మలు రాక్షసయోనులయందు పుట్టి వాళ్ళని నిగ్రహించిన పాపం పోయిన తరవాత, నా చేతిలోనే సంహరింపబడి తిరిగి మీ స్థానాలను మీరు అలంకరిస్తారు. అప్పుడు అహంకారంపోతుంది" అన్నాడు. అహంకారం అంత తేలికగా పోదు. అది పోవడానికి ఆయన ఎన్నో అవతారాలు స్వీకరించవలసి వచ్చింది. తప్పు వాళ్లది, అవతారాలు ఆయనవి. సీతమ్మతల్లిని పోగొట్టుకుని ఒక అవతారం, శిశుపాల దంతవక్త్రులను చంపడానికి, సభలో నానా మాటలు అనిపించుకుని ఒక అవతారం... ఇన్ని అవతారాలను ఎత్తి తన భృత్యులను తాను తెచ్చుకున్నాడు. స్వామి ఎంతోదయ కలిగినవాడు. వాళ్లు రాక్షసయోనులయందు జన్మించడానికి కారణం కల్పించబడాలి.

కశ్యప ప్రజాపతి ఇద్దరు భార్యలలో ఒకరైన దితికి కవలపిల్లలు ఇద్దరు కుమారులు కలిగారు. ముందు పుట్టినవాడికి హిరణ్యాక్షుడు అని, వెనకపుట్టినవాడికి హిరణ్యకశిపుడు అని పేరు పెట్టారు. హిరణ్యాక్షుడు అంటే హిరణ్యకశిపుడికి అమితమైన ప్రేమ. హిరణ్యాక్షుడు అంటే పేరులోనే తెలుస్తుంది. హిరణ్యం అంటే బంగారం లోభానికి ప్రతీక. హిరణ్య కశిప్ అంటే పడక అనుభవానికి గుర్తు. మంచం భోగానికి గుర్తు. పవిత్రమైన వస్తువులను మంచం మీద పెట్టరు. శరీరత్యాగం మంచం మీద చెయ్యకూడదు. హిరణ్యాక్షుడు తెచ్చి దాస్తే, హిరణ్యకశిపుడు అనుభవిస్తాడు.

ఒకప్పుడు కల్పాంతంలో ప్రళయజలాలలో భూమి అంతా నీటిలో అడుగుకు వెళ్లి పాతాళలోకాన్ని చేరుకుంది. భూమి లేదు. శ్రాద్ధదేవుని మనువుని చేసి భూమిని ధార్మికంగా పరిపాలించి సంతానోత్పత్తి చెయ్యమని అంటే ఆయన "భూమి ఉంటే కదా పరిపాలన చెయ్యడానికి! అది పాతాళలోకం దగ్గరకు వెళ్లిపోయింది. దాన్ని తీసుకుని పైకి ఎత్తితే కదా నేను పరిపాలన చెయ్యడం! ఎవరు తీసుకుని వస్తారు? అన్నారు. ఆయన అలా అనగానే చతుర్ముఖబ్రహ్మగారికి తుమ్ము వచ్చి తుమ్మగానే ఆయన ముక్కులోనుండి ఒకాయన కిందపడ్డారు.

చిన్నగా కిందపడ్డ అతడు భూమి, ఆకాశాలు నిండి పోయేంతగా పెరిగిపోయాడు. అది వరాహఅవతారం. యజ్ఞ వరాహ మూర్తిగా వచ్చాడు. అనగా యజ్ఞంలో వాడే పదార్థాలు ఏవి ఉంటాయో సుక్కు, స్రువం, ఆజ్యపాత్ర ఇటువంటివన్నీ ఆయన శరీరభాగాలుగా మారిపోయి, మంగళకరమైన స్వరూపాన్ని పొందాడు. భూమి సముద్రం లోపల ఉండి పోయింది. లోభం గల

హిరణ్యాక్షుడు వెళ్ళిపోయిన ఆ భూమి నాదే అన్నాడు. ఎవ్వరూ అక్కడకు రావడానికి వీలులేదు. లోభబుద్ధి ఎక్కడ ఏమి ఉన్నా, ఎందుకూ పనికి రాకపోయినా కావాలి అంతే. అదొక అవగుణం, దాస్తాడు.

ఆ లక్షణం చేత భూమి నాదని సముద్రంలో తిరుగుతున్నాడు. అంత భూమి ఏమి చేసుకుంటావు అంటే కావాలి అంతే. శ్రీమహావిష్ణువు భూమ్యాకాశాలు నిండిపోయేంత పెద్ద యజ్ఞవరాహ అవతారం పొందారు. పెద్దరోమాలుగల అది సముద్రంలోకి దిగినప్పుడు ఒక చమత్కారం జరిగింది. భూమి ఎక్కడ ఉన్నది? పైకి ఎత్తుదామని ముట్టె పెట్టి వెతుకుతున్నాడు. ఆ వెతుకుతున్నప్పుడు సముద్రంలోని నీళ్లన్నీ ఆయన రోమ కూపాలలోకి వెళ్లి సముద్రంలోని నీళ్లు తగ్గిపోయాయి. ఆయన వెతికి వెతికి పైకి లేచి తలని ఇటూ అటూ ఊపాడు. అప్పుడు చెవులలోని నీళ్లు జూలు మీదనుండి పైకి చల్లబడ్డాయి. బ్రహ్మాది దేవతలు శ్రీమహావిష్ణువు ఒంటికి తగిలి మీదపడుతున్న నీళ్లు అని అందరూ వెళ్లి తలలు వంచి నమస్కరిస్తూ ఆ నీళ్లన్నీ వాళ్లమీదపడేటట్లుగా నిలుచున్నారు.

తన కోరమీద భూగోళాన్ని నుంచోపెట్టి అడుగులు పైకి వేస్తూ వస్తుంటే హిరణ్యాక్షుడు చూసి, వాడికి అన్నీ నాది నాదన్నభావన కదా, "నువ్వు ఎవడవు ఎత్తుకుని పోతున్నావు" అన్నాడు. ఆయన ఏమీ మాట్లాడక వస్తుంటే భూకాంత ఆయనని గట్టిగా కౌగలించుకుంది. హిరణ్యాక్షుడు గదలతో, త్రిశూలాలతో ప్రహారం చేసాడు. ఇద్దరి మధ్యా ఘోరమైన యుద్ధం జరుగుతోంది. సృష్టిలో మనుష్యులకు, జీవరాశికి ఆధారం ఉండదు. ఆధారం లేకపోతే మనకు పాపపుణ్యాలను పోగొట్టుకునే అవకాశం ఉండదు.



పుడుతుంటే చేసుకున్న పాపం పోగొట్టుకుని కొత్తగా పుణ్యం చేసుకోవచ్చు. పుణ్య పాపాలు లేకపోతే పుట్టే అవసరం లేదు. పాపం, పుణ్యం లేనప్పుడు ఇంక శరీరం ఎందుకు? ఏమి అనుభవించడానికి పుట్టాలి. అలా చేసుకోవాలంటే శరీరం ఉంటేనే సాధ్యమౌతుంది. ఈశ్వరుడు పుట్టుక నివ్వడం దయ. జీవరాశి నిలబడటానికి భూమిని ఉంచాలని కారుణ్యంతో దెబ్బలు తింటూ భూదేవిని పైకి తీసుకుని వచ్చాడు. ఆదివరాహస్వరూపం ఎంతో దయకలిగిన స్వరూపం. అవతారమనగానే పక్కన దయ అన్న మాట ఉంటుంది. హిరణ్యాక్షుడు యుద్ధం చేస్తుంటే ప్రదోషవేళ అయింది. బ్రహ్మాదిదేవతలు చీకటి పడితే వాడి శక్తి పెరుగుతుంది మహానుభావా! సంహరించమని అన్నారు.

హిరణ్యాక్షుడు విసిరిన గదని తప్పించి ఒక్కసారి రెండు కోరలు విదల్చి, చేతిని ఎత్తి గుండెల మీద ప్రహారం చేస్తే నెత్తురు కక్కుకుని వెంటనే శరీరాన్ని విడిచిపెట్టాడు. అక్కడతో హిరణ్యాక్షుని సంహారం పూర్తయిపోయింది. హిరణ్యాక్షుని సంహరించడంలో దయ ఉన్నది. అహంకారంతో ప్రవర్తించిన జయవిజయులలో రాక్షసయోనులలో పుట్టిన ఒక జన్మ హిరణ్యాక్షుడు. వాడు శరీరం వదలిపెట్టాడు అంటే భగవంతుని మ్రోల ద్వార పాలకుడుగా వెళ్లిపోవడానికి ఒక అడుగు ముందుకి వేసినట్లు. భగవంతుడే సంహరించి మళ్లీ తన అక్కున చేర్చుకున్నాడు. సంహారప్రక్రియలో దయ ఉన్నది. హిరణ్యాక్షుని సంహరించిన యజ్ఞవరాహావతారం పరమోత్కృష్టమైంది. ఆ అవతారాన్ని స్మరిస్తే రక్షణ కలుగుతుంది. యజ్ఞస్వరూపమైన యజ్ఞవరాహావతారాన్ని తలచుకుంటే చాలు, మంగళం కలుగుతుంది. యజ్ఞ సాధనాల అమరికతో కూడుకున్న యజ్ఞవరాహస్మరణ మంగళాలకు దారి తీస్తుంది. ఆ మూర్తిని స్మరించుకుని నమస్కరిస్తే చాలు!

# ముురిపాల..
# అరచేతా మొగ్గా
# తొడిగింది..

**- కళారత్న డా॥జి.వి. పూర్ణచందు,**
**9440172642**

ఆయుర్వేదశాస్త్రవేత్తలు వైద్యరహస్యాల్ని ప్రజా పరం చేశారు. ఆహారపరంగానూ, ఆచారాలపరంగానూ ఎన్నో ఔషధ ప్రయోజనాలను ప్రజలకు నేర్పించారు. ఏఏ ఋతువుల్లో ఎలా జీవించాలో పండుగలు, పబ్బాలపేరుతో తెలియజెప్పారు. తెలుగువారు వాటిని అందిపుచ్చుకున్నారు. భారతదేశంలో ఆయుర్వేదవిధానంలో భోజనవిధానాన్ని పాటిస్తున్నది తెలుగు వారే! ఉగాదినాడు ఆరురుచుల ప్రసాదాన్ని తయారు చేసుకోవటమే మన ఆచారాల్లో వైద్యప్రయోజనాలకు ప్రత్యక్షసాక్ష్యం. మన ఆచారాల వెనుక వైద్యప్రయోజనాల గురించి మనం తెలుసుకోవటం అవసరం కూడా!

ఆషాడంలో గోరింటాకు విరగ కాస్తుంది. 'గోరింటా పూచిందీ కొమ్మాలేకుండా... మురిపాలా అరచేతా మొగ్గా తొడిగింది' అంటూ తెలుగుప్రజల గోరింటాకు ప్రీతిని దేవులపల్లి పాటగా వ్రాశారు.

వేసవి వెళ్లి ఆషాఢంరాకతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడుతుంది. ఆషాఢ, శ్రావణమాసాలలో పూలూ గింజలతో కొమ్మలు కనిపించనంతగా గోరింతచెట్టు పచ్చగా ఉంటుంది. తొలకరిజల్లులతో పొలాలు కళకళలాడుతుంటాయి. ప్రకృతి పులకరించే కాలం. కాలే పెనం మీద ఆ వేడికి నీళ్లు చిందులు వేసినట్టు ఆషాఢంలో వేసవి తాపం మీద వానజల్లులు కురిసి, శరీరంలోంచి ఉష్మం బయటకు వస్తుంది. దాన్ని చల్లార్చి శాంతింప చేయటానికి గోరింటాకు పెట్టుకునేవారు. గోరింటాకుని ఇంట్లో రుబ్బి పెట్టుకుంటేనే ఇప్పుడు మనం చెప్పుకోబోయే గుణాలు దక్కుతాయి. బజార్లో దొరికే రంగు రసాయనాలు కలిసిన మెహిందీలకు ఈ గుణాలుండవు.

గోరింటాకును చేతులకు పాదాలకు పెట్టుకోవటం తెలుగువారికి మంగళప్రదమైన. శుభప్రదమైన ఆచారం.

ప్రబంధ వేంకటేశ్వర విజయ విలాసంలో గణపవరపు వేంకటకవి మోదుగపూలు, లక్కకెంపు రంగుల్లో పండిన గోరింటాకుతో గాయాలను మాపటాన్ని గురించి ప్రస్తావించాడు. "మందారంలా పూస్తే కలవాడొస్తాడు/ సిందూరంలా పూస్తే చిట్టీ చేయంతా/ అందాల చందమామ అతనే దిగివస్తాడు..." అని గోరింటాకు భవిషత్తుని కూడా చెప్తుందని తెలుగు వారు భావిస్తారు.

గోరింటాకు గోళ్లకు, చర్మానికి, కేశాలకు రంగునిచ్చే (cosmetic agent); రంగు మొక్క మాత్రమే కాదు, అద్భుత ఔషధ ప్రయోజనాలను కలిగించే మందు మొక్క కూడా!; దీని ఆకులు, పూలు, గింజలు, చెట్టు బెరడు, వేళ్లు ఈ పంచాంగాలూ పరమప్రయోజనాల నిచ్చేవే! నిరపాయకరమైనవి కూడా! పెంచుకుంటే పెరట్లో పెరిగేవే! ఉపయోగాలు తెలిస్తే ఈ మొక్కని ఎవరూ వదులుకోలేరు. దీని ఆకులు చేదు(తిక్త), వగరు (కషాయ) రుచులను కలిగి ఉంటుంది. తేలికగా అరిగే స్వభావం (లఘు) చలవచేసే గుణం (శీత వీర్యం), కఫాన్ని, వేడినీ తగ్గించే ప్రభావం దీనికున్నాయి. కడుపులోకి తీసుకుంటే గోరింటాకులు, పూలు, చెట్టు బెరడు, వేళ్లు కూడా వైరసులకు వ్యతిరేకంగా పనిచేస్తాయి (Antiviral Activity). మలేరియా జ్వరంపైన దీని ప్రయోగం ఉంది.

చర్మానికి ఎరుపురంగుని, జుత్తుకు నలుపురంగుని, వెంట్రుకల కుదుళ్లకు బలాన్ని ఇచ్చి, చర్మరోగాలను పోగొట్టి చర్మానికి పోషణ కలిగించే శక్తి గోరింట ఆకులకుంది. రుబ్బిన గోరింటాకును నీళ్లలో వేసి మరగించి, చిక్కని కషాయం కాచి వడగట్టండి. ఆ కషాయానికి సమానంగా నువ్వులనూనె కలిపి నూనె మాత్రం మిగిలేలా నీరంతా ఆవిరయ్యేవరకూ మరగించండి. ఇది గోరింటాకు తైలం. దీన్ని లేపనం చేస్తే ఎగ్జిమా



త్వరగా తగ్గుతుంది. సొరియాసిస్ పొలుసులు రాలటం ఆగుతుంది. దద్దుర్లు, ఎలర్జీల వలన వచ్చే చర్మవ్యాధులు, ఫంగస్ లాంటి సూక్ష్మజీవుల వల్ల వచ్చే వ్యాధులను ఇది తగ్గిస్తుంది. గజ్జి కురుపులక్కూడా ఇది చక్కని లేపన ఔషధం.

దీని పూలు, గింజలు, వేళ్లు, చెట్టు బెరడులలో; napthoquinone, Linoleic acid; లాంటి రసాయనాలు మెదడుకు, మనసుకు, చర్మానికి, కేశాలకు, జీర్ణాశయానికి మేలు చేసేవి ఉన్నాయి. మూర్ఛల జబ్బులోనూ, లివర్ వ్యాధుల్లోనూ వీటి ప్రయోగం ఉంది. కేన్సర్ వ్రణాలలో గోరింట పంచాంగాలనూ ఔషధంగా; ప్రయోగించవచ్చు.

మూత్రం అయ్యేలా చేసే గుణం గోరింటాకులకుంది. సిఫిలిస్ లాంటి వ్యాధులపైన కూడా ఇది పనిచేస్తుంది. మైగ్రేన్ తలనొప్పిలో ఆకులను రుబ్బి కణతలకు కడితే తలనొప్పి తగ్గుంది. గాయాలు, కాలిన పుళ్లమీద కడితే త్వరగా మానేలా చేస్తుంది(Wound Healing Activity). విషదోషాలను హరించే గుణం (Antioxidant Activity) ఈ ఆకులకుంది.

గింజలను నేతితో నూరి పావు చెంచా నుండి అర చెంచా వరకూ తినిపిస్తే, విరేచనాలు తగ్గుతాయి. చంటిపిల్లల్లో విరేచనాలైనప్పుడు మలద్వారం చుట్టూ ఎర్రగా అయ్యే పరిస్థితి (diaper rash)ని ఇది నివారిస్తుంది. ఆకుల కషాయం తాగితే; మందుతో సమానంగా రక్తంలో షుగరు స్థాయిని తగ్గిస్తుంది (Anti Diabetic Activity). నరాలు, మెదడు, మనసు వీటి పైన పనిచేసే ఔషధాలను మేధ్యాలని(nootropic drugs) పిలుస్తారు. మేధస్సుని, మనోబలాన్ని, నరాలబలాన్ని పెంపుచేసే గుణం దీని ఆకుల కషాయానికి ఉంది. నొప్పి వాపులను తగ్గించే గుణం కూడా ఈ ఆకులకుంది. టి.బి మీద కూడా దీనికి ఔషధ ప్రయోజనం ఉందని ఇటీవల కనుగొన్నారు. రక్తస్రావాన్ని అరికడుతుంది. మానసిక ఒత్తిడిని తగ్గించి, రక్తపోటును అదుపులో పెడుతుంది. గుండెపైన వత్తిడుల్ని తగ్గిస్తుందని ఆధునిక పరిశోధకులు చెప్తున్నారు.

Anthraquinones అనే రసాయనాలు గోరింటాకులోనూ, దాని పూలు, గింజలు, బెరడు. వేళ్లలోనూ ఉంటాయి. Staphylococcus epidermidis లాంటి చర్మవ్యాధుల్లో సూక్ష్మజీవులను సంహరించే (antimicrobial) ఔషధంగా పని చేస్తాయి.

గోరింటలో Trypsin inhibitory effect అనే మాంసకృత్తుల నిరోధకగుణం ఉండటం చేత ఇది స్థూలకాయం, షుగరు వ్యాధి, కొవ్వుకు సంబంధించిన వ్యాధులను, కేన్సరుని అరికట్టటంలో బాగా ఉపయోగపడుతుంది. రక్తవృద్ధిని కలిగిస్తుంది. లివరును, ఊపిరితిత్తుల్ని బలసంపన్నం చేసి కఫం పేరకుండా నివారిస్తుంది.

కరోనాలాంటి వ్యాధులకు దీన్ని వాడితే ప్రయోజనం కన్పించవచ్చు. గోరింటాకు, కొద్దిగా మిరియాలు కలిపి రుబ్బి బఠాణీ గింజలంత ఉండలు చేసుకుని ఆరబెట్టి, రోజూ రెండు మూడు మాత్రలు తీసుకుంటే అన్ని వ్యాధుల్లోనూ మేలు చేస్తుంది.



# సంకటనాశన గణేశస్తోత్రం



## నారద ఉవాచ

ప్రణమ్య శిరసా దేవం గౌరీపుత్రం వినాయకమ్ ।
భక్తావాసం స్మరేన్నిత్యం ఆయుష్కామార్థసిద్ధయే ॥ 1

ప్రథమం వక్రతుండం చ ఏకదంతం ద్వితీయకమ్ ।
తృతీయం కృష్ణపింగాక్షం గజవక్త్రం చతుర్థకమ్ ॥ 2

లంబోదరం పంచమం చ షష్ఠం వికటమేవ చ ।
సప్తమం విఘ్నరాజం చ ధూమ్రవర్ణం తథాఽష్టమమ్ ॥ 3

నవమం బాలచంద్రం చ దశమం తు వినాయకమ్ ।
ఏకాదశం గణపతిం ద్వాదశం తు గజాననమ్ ॥ 4

ద్వాదశైతాని నామాని త్రిసంధ్యం యః పఠేన్నరః ।
న చ విఘ్నభయం తస్య సర్వసిద్ధికరం పరమ్ ॥ 5

విద్యార్థీ లభతే విద్యాం ధనార్థీ లభతే ధనమ్ ।
పుత్రార్థీ లభతే పుత్రాన్మోక్షార్థీ లభతే గతిమ్ ॥ 6

జపేద్గణపతిస్తోత్రం షడ్భిర్మాసైః ఫలం లభేత్ ।
సంవత్సరేణ సిద్ధిం చ లభతే నాత్ర సంశయః ॥ 7

అష్టానాం బ్రాహ్మణానాం చ లిఖిత్వా యః సమర్పయేత్ ।
తస్య విద్యా భవేత్సర్వా గణేశస్య ప్రసాదతః ॥ 8

*ఇతి శ్రీనారదపురాణే సంకటనాశనం నామ*
*గణేశ ద్వాదశనామ స్తోత్రమ్ ।*

# శ్రీకృష్ణ అష్టోత్తర శతనామావళి

శ్రీ శ్రీకృష్ణాయ నమః
శ్రీ కమలానాథాయ నమః
శ్రీ వాసుదేవాయ నమః
శ్రీ సనాతనాయ నమః
శ్రీ వసుదేవాత్మజాయ నమః
శ్రీ పుణ్యాయ నమః
శ్రీ లీలామానుషవిగ్రహాయ నమః
శ్రీ శ్రీవత్సకౌస్తుభధరాయ నమః
శ్రీ యశోదావత్సలాయ నమః
శ్రీ హరయే నమః 10

శ్రీ చతుర్భుజాత్తచక్రాసిగదాశంఖాద్యాయుధాయ నమః
శ్రీ దేవకీనందనాయ నమః
శ్రీ శ్రీశాయ నమః
శ్రీ నందగోపప్రియాత్మజాయ నమః
శ్రీ యమునావేగసంహారిణే నమః
శ్రీ బలభద్రప్రియానుజాయ నమః
శ్రీ పూతనాజీవితహరాయ నమః
శ్రీ శకటాసురభంజనాయ నమః
శ్రీ నందవ్రజజనానందినే నమః
శ్రీ సచ్చిదానందవిగ్రహాయ నమః 20

శ్రీ నవనీతవిలిప్తాంగాయ నమః
శ్రీ నవనీతనటాయ నమః
శ్రీ అనఘాయ నమః
శ్రీ నవనీతనవాహరాయ నమః
శ్రీ ముచుకుందప్రసాదకాయ నమః
శ్రీ షోడశస్త్రీసహస్రేశాయ నమః
శ్రీ త్రిభంగినే నమః
శ్రీ మధురాకృతయే నమః
శ్రీ శుకవాగమృతాబ్ధీందవే నమః
శ్రీ గోవిందాయ నమః 30

శ్రీ యోగినాంపతయే నమః
శ్రీ వత్సవాటచరాయ నమః
శ్రీ అనంతాయ నమః
శ్రీ ధేనుకాసురభంజనాయ నమః
శ్రీ తృణీకృతతృణావర్తాయ నమః
శ్రీ యమలార్జునభంజనాయ నమః
శ్రీ ఉత్తాలతాలభేత్రే నమః
శ్రీ తమాలశ్యామలాకృతయే నమః
శ్రీ గోపగోపీశ్వరాయ నమః
శ్రీ యోగినే నమః 40

శ్రీ కోటిసూర్యసమప్రభాయ నమః
శ్రీ ఇలాపతయే నమః
శ్రీ పరంజ్యోతిషే నమః
శ్రీ యాదవేంద్రాయ నమః
శ్రీ యదూద్వహాయ నమః
శ్రీ వనమాలినే నమః
శ్రీ పీతవాససే నమః
శ్రీ పారిజాతాపహారకాయ నమః
శ్రీ గోవర్ధనాచలోద్ధర్త్రే నమః
శ్రీ గోపాలాయ నమః 50

శ్రీ సర్వపాలకాయ నమః
శ్రీ అజాయ నమః
శ్రీ నిరంజనాయ నమః
శ్రీ కామజనకాయ నమః
శ్రీ కంజలోచనాయ నమః
శ్రీ మధుఘ్నే నమః
శ్రీ మధురానాథాయ నమః
శ్రీ ద్వారకానాయకాయ నమః
శ్రీ బలినే నమః
శ్రీ బృందావనాంతసంచారిణే నమః 60

శ్రీ తులసీదామభూషణాయ నమః
శ్రీ శమంతకమణేర్హర్త్రే నమః
శ్రీ నరనారాయణాత్మకాయ నమః
శ్రీ కుబ్జాకృష్ణాంబరధరాయ నమః
శ్రీ మాయినే నమః
శ్రీ పరమపురుషాయ నమః
శ్రీ ముష్టికాసురచాణూరమర్దనాయ నమః
శ్రీ మల్లయుద్ధవిశారదాయ నమః
శ్రీ సంసారవైరిణే నమః
శ్రీ కంసారయే నమః 70

శ్రీ మురారయే నమః
శ్రీ నరకాంతకాయ నమః
శ్రీ అనాదిబ్రహ్మచారిణే నమః
శ్రీ కృష్ణావ్యసనకర్శకాయ నమః
శ్రీ శిశుపాలశిరచ్ఛేత్రే నమః
శ్రీ దుర్యోధనకులాంతకాయ నమః
శ్రీ విదురాక్రూరవరదాయ నమః
శ్రీ విశ్వరూపప్రదర్శకాయ నమః
శ్రీ సత్యవాచే నమః
శ్రీ సత్యసంకల్పాయ నమః 80

శ్రీ సత్యభామారతాయ నమః
శ్రీ జయినే నమః
శ్రీ సుభద్రాపూర్వజాయ నమః
శ్రీ జిష్ణవే నమః
శ్రీ భీష్మముక్తిప్రదాయకాయ నమః
శ్రీ జగద్గురవే నమః
శ్రీ జగన్నాథాయ నమః
శ్రీ వేణునాదవిశారదాయ నమః
శ్రీ వృషభాసురవిధ్వంసినే నమః
శ్రీ బాణాసురకరాంతకాయ నమః 90

శ్రీ యుధిష్ఠిరప్రతిష్ఠాత్రే నమః
శ్రీ బర్హిబర్హావతంసకాయ నమః
శ్రీ పార్థసారథయే నమః
శ్రీ అవ్యక్తాయ నమః
శ్రీ గీతామృతమహోదధయే నమః
శ్రీ కాళీయఫణిమాణిక్యరంజితశ్రీపదాంబుజాయ నమః
శ్రీ దామోదరాయ నమః
శ్రీ యజ్ఞభోక్త్రే నమః
శ్రీ దానవేంద్రవినాశకాయ నమః
శ్రీ నారాయణాయ నమః 100

శ్రీ పరబ్రహ్మణే నమః
శ్రీ పన్నగాశనవాహనాయ నమః
శ్రీ జలక్రీడాసమాసక్తగోపీవస్త్రాపహారకాయ నమః
శ్రీ పుణ్యశ్లోకాయ నమః
శ్రీ తీర్థకృతే నమః

తిరుమల తిరుపతి దేవస్థానములు



శ్రీ వేదవేద్యాయ నమః
శ్రీ దయానిధయే నమః
శ్రీ సర్వతీర్థాత్మకాయ నమః
శ్రీ సర్వగ్రహరూపిణే నమః
శ్రీ పరాత్పరాయ నమః

..... సాంగాయ సపరివారాయ పత్నీపుత్ర
సకల పరివార సమేత శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః
అనేక విధసుగంధ పుష్పపూజాం సమర్పయామి




శ్రీవారిఆలయం(తిరుమల)లో 25-07-2021న శ్రీశ్రీశ్రీ పెద్దజీయంగారి నేతృత్వంలో జరిగిన చాతుర్మాస దీక్ష సంకల్ప దృశ్యం.
ఈ సందర్భంగా తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ కే.యస్. జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్., తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,గార్లు, శ్రీశ్రీశ్రీ పెద్దజీయంగారు స్వామివారిని, శ్రీశ్రీశ్రీ చినజీయంగారు స్వామివారిని దర్శించుకుని పండ్లు సమర్పించారు




24-07-2021న తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారికి జరిగిన కనకాంబర సహిత కోటి మల్లెపుష్పమహాయాగ దృశ్యం.
ఈ మహోత్సవంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ కే.యస్. జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్., శ్రీ గోపీనాథ్ జెట్టి, ఐ.పి.ఎస్., మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఇటీవల తిరుమలలో జరిగిన సుందరకాండ పారాయణ దృశ్యం



25-07-2021న అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జరిగిన పుష్పయాగ మహోత్సవ దృశ్యం.
ఈ మహోత్సవంలో తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., గారు పాల్గొన్నారు.

# యునెస్కో గుర్తింపు పొందిన...

# రామప్ప దేవాలయం

- శ్రీ అరవింద్ ఆర్య

మన దేవాలయాలు

రామప్ప... ప్రజానీకానికి పరిచయం అవసరం లేని పేరు. రామప్ప అనే పేరు వినగానే మనకు ఎర్రని రాతి మీద చెక్కిన శిల్పాలు గుర్తుకువస్తాయి. కఠినశిలలపై చెక్కబడ్డ రామప్ప ఆలయశిల్పాలు అనేక కథలను చెప్తాయి. ప్రాణం లేకున్నా జీవకళ ఉట్టిపడుతూ ఉండే ఆ శిల్పాలను పరిశీలనగా చూస్తే వీక్షకుల ప్రాణం లేచొస్తుంది. మనం ఎంత బతుకు బతికితే ఏం లాభం ఆ రాళ్లలాగా పుడితే బాగుండు అనిపిస్తుంది. అవకాశం ఉంటే ఆ గుడి కట్టిన కాలానికి వెళ్లి ఎలా కట్టారో, ఈ శిల్పాలను ఎలా చెక్కారో చూడాలన్న కోరిక పుడుతుంది. ఎందరో శిల్పుల చేతుల్లో జీవం పోసుకున్న ఆ శిల్పాలను ఎన్ని సార్లుచూసినా, ఎంతసేపు చూసినా తనివితీరదు. బతికి ఉన్నాయా అనిపించే శిల్పాలు, రాళ్లమీద చెక్కబడ్డ పురాణగాథలూ వీటన్నిం టినీ చూస్తూ అక్కడే ఉండిపోవాలనిపించే శిల్పకళాసంపద రామప్ప ఆలయ సొంతం. ఇక్కడ ప్రతి అంశం అబ్బురపరిచేదే, ప్రతీ శిల్పం ఒక్కొక్కకథను చెప్పేదే. కోట్లాది ఉలుల దెబ్బలను తట్టుకుని కోట్లాది రూపాయలతో సైతం వెలకట్టలేని కళా సంపదగా మారిన గండశిలలు ఇక్కడెన్నో...

రాతిని తొలిచి చేసిన సప్తస్వరాలు పలికే స్తంభం, మనం ఏ దిక్కున ఉన్నా మనల్నే చూస్తున్నట్టు అనిపించించే నంది, నీళ్ళలో తేలే ఇటుకలూ, చీపురు పుల్ల కూడా సులభంగా దూరేంత సన్నటి రంధ్రాలు, అద్దం కూడా అచ్చెరువొందేలా మలిచిన రాతిస్థంభాలు, వాటి మీద రకరకాల శిల్పాలు, గుడి కట్టిన దగ్గర నుండి ఇప్పటి వరకు రామప్ప నేపథ్యంగా ఉన్న అనేక జాన పద కథలు ఇలా ఎన్నోన్నో చిత్రవిచిత్ర విభిన్న విశేషాల సమాహారం రామప్పదేవాలయం.

శతాబ్దాలనాటి జీవకళను తెలియజెప్పే ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచిన కాకతీయ కట్టడం రామప్ప. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందబోతుంది. భారతదేశం తరపున యునెస్కో వారసత్వకట్టడంగా గుర్తింపునకు నామినేట్ అయి యునెస్కో ప్రపంచ ప్రసిద్ధ కట్టడాల జాబితాలో చోటు కోసం పోటీ పడుతోంది. ఈ సందర్భంగా రామప్ప ఆలయ చారిత్రక విశేషాలు 'సప్తగిరి' పాఠకుల కోసం ప్రత్యేకంగా..

## చరిత్ర

పూర్వపు వరంగల్‌జిల్లా కేంద్రానికి 70కి.మీ దూరంలో (ప్రస్తుత ములుగు జిల్లా)లో పాలంపేట అనే గ్రామంలో



రామప్పదేవాలయాన్ని క్రీ.శ.1213 సంవత్సరంలో కాకతీయ గణపతిదేవుని సైన్యాధ్యక్షుడు రేచర్లరుద్రుడు కట్టించాడు. కాకతీయ పాలనాసూత్రం ప్రకారం ఆలయ సమీపంలో విశాలమైన చెరువుని కూడా నిర్మాణం చేయించాడు. రేచర్ల రుద్రుడు ఈ చెరువుతో పాటు మరిన్ని చెరువులు తవ్వించినట్టు శాసనాధారాలున్నాయి.

రామప్పఆలయంలో ఉన్న దైవం పేరు రామలింగేశ్వరుడు. సాధారణంగా కాకతీయులు ఆలయాల నిర్మాణం చేసినపుడు నిర్మాతల పేరుతో గానీ, రాజు పేరుతో గానీ ఆలయానికి నామకరణం చేసేవారు. అలా కాకుండా ఒక్క ఈ ఆలయం విషయంలో ఆలయానికి రూపకల్పన చేసిన శిల్పాచార్యుడు, ప్రధానశిల్పి అయిన రామప్ప పేరు మీదుగా ఏర్పడిందని జానపద, మౌఖికకథల ద్వారా తెలుస్తోంది.

ప్రస్తుతం రామప్ప పేరుకు శివుని పేరు కూడా కలిపి రామలింగేశ్వర ఆలయం లేదా రామప్పదేవాలయంగా పిలుస్తున్నారు. ప్రధాన ఆలయమైన రామప్ప దేవాలయంతో పాటు పలు ఉపాలయాల నిర్మాణం దశాబ్దాలపాటు జరిగింది.

## నిర్మాణ పద్ధతి

కాకతీయుల ఆలయాల్లో త్రికూటాలయాలు ప్రసిద్ధి చెందాయి. అయితే రామప్ప దేవాలయం మాత్రం త్రికూటాలయం కాదు. కాని మూడు ప్రవేశద్వారాలున్న ఆలయం. ఆలయనిర్మాణం ఎత్తైన పీఠంపై నక్షత్ర ఆకారంలో జరపబడి తూర్పునకు అభిముఖంగా ఉండగా ఉత్తర, దక్షిణదిశల్లో కూడా ప్రవేశద్వారాలు ఉన్నాయి. ఆలయ మధ్యభాగంలో మహామండపం ఏర్పాటు చేశారు.

## గర్భాలయ ప్రధానద్వారం

రుద్రేశ్వరాలయ గర్భాలయ ప్రధానద్వారం మరొక గొప్ప కళాఖండం. అంతరాళద్వారానికి రెండువైపులా రెండు పొడవైన ఘనాకార శిల్ప పలకలున్నాయి. వీటికి మృదంగాన్ని వాయిస్తున్న వాయిద్యానికి అనుగుణంగా నాట్యం చేస్తున్న స్త్రీ, పురుషుల శిల్పాలు అనేకం చెక్కబడ్డాయి. ఇవి పేరిణి శివ తాండవానికి చెందిన వివిధ భంగిమలను ప్రతిబింబిస్తున్నాయి. చెరుకుగడలు, అరటిబోదెల మధ్య బాణాలు ధరించి, రకరకాల భంగిమలలో నిలబడ్డ స్త్రీలు జీవకళతో దర్శనమిస్తారు. వాటి పైభాగాన సింహాల వరుసలు, లతలు, వాద్యకారులచిత్రాలు అందంగా తీర్చిదిద్దబడ్డాయి.



## మహాలింగం

గర్భాలయంలో ఉన్న పెద్ద రామలింగేశ్వర మహా లింగం, హనుమకొండలోని వెయ్యి స్తంభాల గుడిలోని రుద్రేశ్వరునితో పోటీపడుతున్నదా అన్నట్లు కనువిందు చేస్తుంది. పానవట్టంపైన భాగంలోనే కాకుండా, కింది భాగంలో కూడా సన్ననిగీతలు గీతలుగా అందంగా చెక్కిన పద్ధతి చూపరులను అబ్బురపరుస్తుంది. ప్రధానలింగం నల్లని కాంతులీనుతూ నిన్నో మొన్నో చెక్కినట్లు కన్పిస్తుంది. గర్భగుడిలో ఎటువంటి దీపంగానీ, లైట్‌గానీ లేకపోయినా బయట వెలుతురు ఉన్నంతసేపు శివలింగంపై వెలుగు ప్రసరించడం నాటి శిల్పుల నిర్మాణ కౌశలాన్ని చాటుతుంది. ఆలయరంగమండపంలోని నల్లని స్తంభాలపై పడే వెలుగు పరావర్తనం చెంది గర్భగుడిలోకి ప్రసరించేలా నిర్మాణం చేశారు.



## సామాజిక, సాంస్కృతిక కేంద్రంగా ఆలయం

కాకతీయులకాలంలో ఆలయాలు అంటే కేవలం పూజలు, మొక్కుబడులు చెల్లించుకునేందుకు మాత్రమే కాకుండా సామాజిక క్షేత్రాలుగా కూడా పనిచేసాయి. భూస్వామిగా, యజమానిగా, సరుకులు, సేవల వినియోగదారుగా, బ్యాంకుగా, పాఠశాలగా, సైనికశిక్షణకేంద్రంగా, వైద్యశాలగా, రంగస్థలంగా, వివాహాలు జరిపే

కల్యాణమండపంగా, సాయంకాలాల్లో సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా, ఒక్కమాటలో చెప్పాలంటే ఆనాటి సామాజిక, సాంస్కృతిక కేంద్రంగా రామప్ప ఆలయం ఉండేది. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాలు లేని ఆ కాలంలో సన్నని దారం కూడా శిల్పంలో ఒక వైపు నుండి మరొకవైపు వెళ్లేంత సునిశితమైన పనితనాన్ని నాటి శిల్పులు చూపారు. రామప్ప దేవాలయం శిల్పకళకు పెట్టింది పేరు. శిల్పాలు ఇంత అందంగా మలచగలగటానికి నాటి శిల్పుల నైపుణ్యం ప్రధాన కారణం. అదొక్కటే కాకుండా రామప్ప ఆలయానికి ఇంకా అనేక ప్రత్యేకతలున్నాయి.

1) ఇసుకని పునాదిగా వాడి పటిష్టమైన ఆలయనిర్మాణం చేయడం..
2) స్థానికంగా దొరికే ఎర్రని డోల రైట్ రాయిని వాడటం.
3) స్థానికంగా అందుబాటులో లేని నల్లని గ్రానైట్(చలువరాయి) శిలలను ప్రత్యేకంగా తెప్పించుకుని ఆలయ రంగమండపం నిర్మాణంలో వాడటం.
4) కఠినమైన రాతిపై శిల్పాలు చెక్కిన తరువాత అద్దంలాంటి నునుపుదనం వచ్చేంతవరకూ ఓపికగా చిత్రిక పట్టగలగటం.
5) ఆలయకప్పు భారాన్ని మోయడానికి నల్లరాతి గ్రానైట్ శిల్పాలను వాడడం.
6) శిల్పాకృతుల ముఖాల్లో హావభావాలు పలికించే విధంగా శిల్పాలు చెక్కడం.
7) విమానగోపురం నిర్మాణంకోసం నీటిలో తేలే ఇటుకలను ఉపయోగించడం.

## ఇసుక రాతిపెట్టె పరిజ్ఞానం

కాకతీయులు నిర్మించిన ప్రతి ఆలయాన్ని కూడా శాండ్బాక్స్ టెక్నాలజీతోనే నిర్మించారు. ఆలయ పునాదుల్లో 12-15 అడుగుల లోతులో సన్నని ఇసుకను నింపి, ఆ పైన రాళ్లతో పునాదులు వేశారు. భూకంపాలు వచ్చినా ఆలయం కుంగకుండా ఉండేందుకే ఈ విధానాన్ని అనుసరించారు. అందుకే ఎన్నో వందల ప్రకృతివైపరీత్యాలు వచ్చినా ఆలయం చెక్కు చెదరలేదు.

## నీటిలో తేలే ఇటుకలు

రామప్ప ఆలయ విమానగోపురం నిర్మాణంలో వాడిన ఇటుకలు చాలా ప్రత్యేకమైనవి. ఆలయం మొత్తం బరువైన రాతితో నిర్మాణం చేపట్టడం మూలానా విమానగోపురం కూడా రాతితో చేపడితే ఆలయపునాదులు బరువును తట్టుకోవడం కష్టమని భావించి తేలికైన ఇటుకలను తయారుచేశారు. ఈ ఇటుకలను ప్రత్యేక రకమైన మట్టితో మాత్రమే కాకుండా ఏనుగు లద్దెతో, అడవిమొక్కల జిగురు, ఊకపొట్టు, మరికొన్ని పదార్థాలు కలిపి తయారు చేసేవారు. రకరకాల పదార్థాలు నిర్ణీత మోతాదులో వాడడం మూలాన ఇటుకలు గట్టితనం తగ్గకుండానే తేలికగా ఉండే లక్షణాన్ని కలిగి ఉంటాయి. తద్వారా ఇటుకలను నీటిలో వేస్తే తేలేంతగా. శాస్త్రీయంగా చెప్పాలంటే నీటి సాంద్రత 1 గ్రామ్ /సిసి అయితే ఈ ఇటుకల సాంద్రత కేవలం 0.9 గ్రామ్స్ / సిసి మాత్రమే. అదే మనం సాధారణంగా ఇప్పుడు వాడే ఇటుకలు 2.2 గ్రామ్స్ /సిసి ఉంటాయి. అంతేకాకుండా ఈ ఇటుకలకు స్పాంజిలో ఉన్నట్లు లోపటంతా బోలుతనం ఉంటుంది. ఈ పోరస్ నెస్ వలన కరిగించిన సున్నం బెల్లపు పాకంలాంటి వాటిని పీల్చుకుని దృఢంగా వాటి లోపల భద్రపరచుకోగలుగుతుంది. కాకతీయ శిల్పులకు మాత్రమే సొంతమైన పరిజ్ఞానం ఇది.



## శిల్పవిశేషాలు

భారతదేశంలో విరాజిల్లిన అద్భుతశిల్ప రీతుల్లో కాకతీయ శిల్పరీతి ఒకటి. శాతవాహనుల తరువాత అంతటి చక్కటి రూపలావణ్యంతో బాగా నగిషీ చేసే శిల్ప ప్రక్రియ మళ్లీ కాకతీయుల కాలంలోనే జరిగింది. రెండున్నర శతాబ్దాల్లో వేలకొద్దీ శిల్పాలు చెక్కించి భారతీయశిల్పకళా చరిత్రలో తమ కంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని కాకతీయులు పొందారు. దేవాలయాల్లోని స్తంభాల నిర్మాణరీతి, వాటిని నిలబెట్టిన విధానం గర్భాలయ ముఖద్వారాలను బట్టి అవి కాకతీయులవని గుర్తించవచ్చు. కాకతీయశిల్పరీతికి మార్గదర్శకమైంది హోయసల శిల్పరీతి. కాకతీయదేవాలయ నిర్మాణానికి దాదాపు 200 సంవత్సరాలకు పూర్వమే హోయసలలు బేలూరు, హళేబీడు, సోమనాథపురాలలో అద్భుతమైన దేవాలయాలు నిర్మించారు. ఆ దేవాలయాలు మీద కనపడే గజపట్టికలు, పద్మపట్టికలు, లతలు వంటివి కాకతీయ దేవాలయాలలో కూడా కన్పిస్తాయి. అయితే హోయసల శిల్పరీతికి కాకతీయ శిల్పరీతికి కొన్ని భేదాలు కనిపిస్తాయి. హోయసల ఆలయాలపై కనిపించేవి దేవతామూర్తులు కాగా, కాకతీయ ఆలయాలపై కనిపించేవి నాటి సామాన్య స్త్రీ పురుషులవి. సామాన్యుల వేషధారణ, సామాజికాంశాలను వందల ఏళ్లపాటు సజీవంగా ఉండేలా ఆలయ కుడ్యాలపై చెక్కించిన ఘనత కాకతీయులదేనని నిస్సందేహంగా చెప్పవచ్చు.

*(ఇంకా ఉంది)*

# మాంగల్యసిద్ధికి...

- శ్రీ కపిలవాయి రైవతశర్మ

కంటికి కనిపించే ప్రకృతి అంతా పరమేశ్వరీ స్వరూపం. అందుకే ఆమెను మహాప్రకృతి స్వరూపిణిగా వేదాలు భావన చేస్తాయి. అటువంటి ప్రకృతి స్వరూపిణికి లౌకిక సమాజంలో మహిళలు ప్రతిరూపాలుగా నిలుస్తారు. పుణ్యవతులైన మహిళలు ప్రకృతిస్వరూపాలుగా నిలిచి, తమ ఇంటికి తద్ద్వారా సమాజానికి మంగళత్వాన్ని చేకూరుస్తారు. ఈ విధమైన మంగళత్వం, సౌభాగ్యంవారికి అందజేసే పరమేశ్వరీ స్వరూపమే మంగళగౌరీదేవి.

మంగళగౌరీదేవి నిత్యసుమంగళి. సకలమంగళ ప్రదాయిని. మాంగల్యానికి అధిష్ఠానదేవత. ఆ దేవి అనుగ్రహం ద్వారా నిత్యసుమంగళిగా ఉండే అనుగ్రహాన్ని మహిళలు అందుకుంటారు. ఈ ఫలితాన్ని ఆశిస్తూ మహిళలు చేసే గౌరీ ఆరాధన విధానమే మంగళగౌరీవ్రతంగా లోకవ్యాప్తి పొందింది.

మన మనస్సులన్నీ మంగళకరమైన భావనలతో నిండి ఉండటానికి మంగళత్వానికి అధిష్ఠానదేవత అయిన మంగళ గౌరీదేవి అనుగ్రహం మనకు ఉండాలి. అప్పుడే మనస్సు, మాట మంగళత్వానికి ప్రతీకలుగా మారుతాయి.

చక్కని పసుపువర్ణంతో ప్రకాశిస్తున్న దేవికి ప్రతీకగా పసుపుముద్దనే గౌరీదేవిగా భావించి అర్చించే ఆచారం వాడుకలో ఉంది. ఇతర పూజల్లో విగ్రహాలు లేదా అనేకవిధాలైన ప్రతిమల్ని ఉపయోగిస్తారు కానీ పసుపుముద్దనే దేవతగా భావించి ఆచరించటం మంగళగౌరీవ్రతంలో ప్రధానంగా కనిపిస్తుంది. పసుపు శుభానికి సంకేతం. సకలశుభాలు ఈ దేవి అనుగ్రహం ద్వారా కలుగుతాయనటానికి ఇది ప్రతీక.

## నవవధువులకు ఆరాధ్యదేవత

అర్చనపరంగా చూస్తే మంగళగౌరీదేవిని ఆరాధించటం వివాహసమయంలో ప్రారంభమౌతుంది. వివాహానికి ముందుగా వధువు చేత గౌరీపూజ చేయిస్తారు. తనకు సౌభాగ్యాన్ని అందించమని. ఈ భాగ్యం తనకు శాశ్వతం కావాలని కోరుకుంటూ వధువు గౌరీదేవిని ఆరాధిస్తుంది. గౌరీదేవి ప్రతిమకు శాస్త్రవిధానంగా అర్చన చేసిన తర్వాతనే కన్యను వివాహవేదిక వద్దకు తీసుకువెళ్తారు. ఆ తర్వాత వివాహ క్రతువంతా జరుగుతుంది. గౌరీపూజలో భాగంగా తాను ఆరాధించిన గౌరీ ప్రతిమను వధువు కన్నవారింటనే విడిచిపెట్టి, తాను అత్తవారింటికి చేరుతుంది. వివాహం, ఆ తర్వాతి ఆచారాలన్నీ పూర్తయ్యాక వచ్చే తొలి శ్రావణమాసంలో మంగళవారం రోజున తిరిగి పుట్టింటికి వచ్చి, తాను వివాహసమయంలో ఆరాధించిన గౌరీ ప్రతిమను తిరిగి ఆరాధన చేస్తుంది. గౌరీదేవిని అర్చించి, మంగళగౌరీవ్రతాన్ని జరుపుకుంటుంది. ఇలా, వివాహమైన ఐదు సంవత్సరాల పాటు పుట్టింటికి వచ్చి మంగళగౌరీవ్రతాన్ని చేసుకోవటం ఆచారంగా ఉంది.

మంగళగౌరీవ్రతం బాహ్యస్వరూపంలో గౌరీరూపంలో ఉన్న పార్వతీదేవిని ఆరాధించడంగా కనిపించినా ఈ వ్రతం ఆచరించటం వెనుక ఎన్నో సామాజిక, ఆధ్యాత్మికభావనలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. వీటన్నిటినీ అందిపుచ్చుకుని, అమ్మ చాటు నుంచి అత్తింట అడుగుపెడుతున్న అమ్మాయిని పరిపూర్ణురాలుగా తీర్చిదిద్దటమే మంగళగౌరీవ్రతంలోని అంతరార్థం.

ఈ వ్రతంలో తొలిగా అర్థం చేసుకోవాల్సిన అంశం కుటుంబసంబంధాల వ్యవస్థీకరణ. అత్తింటికి చేరుకున్న కొద్ది కాలానికి అమ్మాయి నోముల కోసం పుట్టింటికి వస్తుంది. అమ్మాయిచేత తల్లిదండ్రులు ఎంతో ఘనంగా నోములు చేయిస్తారు. మంగళగౌరినోములో తొలి వాయినాన్ని తల్లికే అందిస్తుంది అమ్మాయి. "అమ్మా! అత్తింటికి వెళ్ళినా నా తొలి ప్రాధాన్యత నీకేనమ్మా... నీవే నా దైవం" అంటూ తల్లి పాదాలకు నమస్కరిస్తుంది. తన చాటున పెరిగిన బిడ్డ తనంతగా ఎదిగిన వైనాన్ని చూసి అమ్మ మనసు పొంగిపోతుంది. తన బిడ్డ కలకాలం సుమంగళిగా ఉండాలంటూ ఆశీర్వదిస్తుంది. అప్పగింతలతోనే బంధం ముగిసిపోకుండా తల్లీబిడ్డల మమకారబంధాన్ని మరింతగా దృఢపరుస్తుంది మంగళగౌరీవ్రతం. నోముల పేరుతో అటు అత్తింటికీ, ఇటు పుట్టింటికీ వస్తూపోతూ ఉండటం ద్వారా రెండు కుటుంబాల మధ్య స్నేహసంబంధాలను ఈ వ్రతం మరింతగా ప్రదీప్తం చేస్తుంది.

తల్లితో పాటు మరికొందరు ముత్తయిదువులకు కూడా వాయినాలు, తాంబూలాలు ఇచ్చి వారిని గౌరీ స్వరూపంగా ఆరాధన చేస్తుంది అమ్మాయి. పెద్దల ఆశీస్సులు అందుకోవటం, వారిని దైవాలుగా భావించటం ఈ వ్రతాచరణ ద్వారా అందుకునే మరొక ఫలితం. నూతనవస్త్రాలు ధరించటం, ఆధ్యాత్మిక



భావనల్ని ఎల్లప్పుడూ మనసులో నిలుపుకోవటం, నోము కోసం ఆచారాలు తెలుసుకోవటం, వ్రతంలో భాగంగా కాటుక వెయ్యటం, నూతనవస్త్రాలు, మంగళకరమైన ఆభరణాలు ధరించటం, రుచికరమైన పిండివంటల్ని నివేదన కోసం సిద్ధం చెయ్యటం, వాయినాలపేరుతో చుట్టుపక్కల ఉన్న కుటుంబాలను కలుసుకోవటం, అక్కడి పెద్దల ఆశీర్వచనం తీసుకోవటం... ఇవన్నీ సామాజికబంధాలను పటిష్టపరచటంలో తమవంతు పాత్రలు పోషిస్తాయి. నోము పేరుతో ఒక ఉన్నతమైన బంధాన్ని పదిలం చేసేందుకు మన పూర్వీకులు ఏర్పాటుచేసిన వ్యవస్థలోని భావాన్ని మనం అర్థం చేసుకుని, ఆచరణలోకి తీసుకురావాలి.

మంగళగౌరీవ్రతంలో మరొక విశేషం... ఈ నోము పూర్తిచేసుకున్న ముత్తయిదువులు తమ ఉద్యాపనను బంధువుల వివాహసమయంలో చేసుకుంటారు. పెళ్లిపీటల మీద ఉన్న నవ వధువుకే వాయినాన్ని మెట్టెలు, మంగళసూత్రాలతో సహా అందించి ఉద్యాపన పూర్తిచేసుకుంటారు. ప్రతి ముత్తయిదువులోనూ పరమేశ్వరిని చూడగలిగే భావాన్ని పెంచటమే నవ వధువుకు ఉద్యాపన చేసుకోవటంలో అంతరార్థంగా కనిపిస్తుంది. చిన్నా, పెద్దా అనే తేడా కాదు. ప్రతి మనిషిలో, ప్రతి మనసులో ఉన్న 'అమ్మ' భావాన్ని అందుకోవటమే భక్తికి అసలైన అర్థం.

## సాహిత్యంలో గౌరీదేవి

ఆంధ్రసాహిత్యంలో గౌరీదేవి ప్రస్తావన, ఆరాధన అనేకచోట్ల కనబడుతుంది. ముఖ్యంగా గౌరీదేవి అర్చనకు బహు ప్రాధాన్యత తీసుకువచ్చి, సామాన్యులకు సైతం ఆ దేవి వైభవాన్ని అందించిన ఘనత సహజకవి పోతనామాత్యుడికే దక్కుతుంది. భాగవతంలో అత్యంత రమణీయమైన రుక్మిణీకల్యాణఘట్టమే ఇందుకు వేదిక. శ్రీకృష్ణుడిని వలిచిన రుక్మిణీదేవి తనకు విశ్వాసపాత్రుడైన అగ్నిద్యోతనుడనే బ్రాహ్మణునితో శ్రీకృష్ణుడికి రాయబారం పంపిస్తుంది. ఎంతకాలమైనా కృష్ణుడి నుంచి సమాధానం రాదు. నిరంతరం గౌరీదేవిని అర్చించే రుక్మిణి “ఆర్యా మహాదేవియున్ నను రక్షింప నెరుంగునో ఎరుగదో నా భాగ్యమెట్లున్నదో” అంటూ వాపోతుంది. కానీ, లోకాలనేలే చల్లనితల్లి గౌరమ్మ రుక్మిణి మొర ఆలకించింది. శ్రీకృష్ణుడు 'వస్తా'నంటూ సందేశం పంపించాడు. రుక్మిణీ కల్యాణఘట్టం లోకానికి ఆదర్శప్రాయంగా నిలచింది. ఇదంతా గౌరమ్మ దీవెన ఫలితమే. మహాభారతాన్ని అనువాదం చేసే సందర్భంలో తిక్కన సోమయాజి కూడా 'శ్రీయన గౌరినాబరగు జెల్వగు చిత్తము పల్లవింప భద్రాయిత మూర్తివై...' అంటూ గౌరీదేవిని ప్రస్తావిస్తాడు. పురాణగాథల్లో సీత, మండోదరి వంటి పతివ్రతలు నిరంతరం గౌరీదేవిని ఆరాధించిన ఇతివృత్తాలు ఎన్నో ఉన్నాయి.

నేటికీ తెలంగాణ ప్రాంతంలో అత్యంత ఘనంగా జరుపుకునే బతుకమ్మ పండుగలో మహిళలు పాడేవి గౌరమ్మ పాటలే. జానపదుల పాటల్లో ఎక్కువ భాగం గౌరమ్మ పాటలే ఉంటాయి. వానలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని, తమ పసుపు కుంకుమలు చల్లగా కాపాడాలని కోరుకుంటూ జానపద మహిళలు గౌరమ్మను కొలుస్తారు. మొక్కులు కూడా గౌరమ్మకే చెల్లిస్తారు.

జనం గొంతుకలోనే కాదు గుండెల్లోనూ కొలువైన తల్లి గౌరమ్మ. ఆమె మంగళదాయిని. సర్వార్థప్రదాయిని. ఆ తల్లి ఆరాధన ద్వారా సకలశుభాలను పొందుదాం!

ధారావాహిక - 5

# శ్రీమద్భగవద్గీత

- ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ

*గత సంచిక తరువాయి భాగం...*

"అంటే నీవు పాండవులతోనే ఎక్కువగా విద్యాభ్యాసం చేయించావు. మాక్కొంచెం తక్కువగా నేర్పించావు. అందులోనూ నీ పిల్లవాడి క్కూడ ఇవ్వని అస్త్రశస్త్రాలు ఆ అర్జునుడికి ఇచ్చావు. వారేమో నీ ఎదురుగుండా నిన్ను చంపుతాను అన్నట్లుగా నిల్చున్నారు. ఏం తెలివయ్యా నీది" అన్నాడు.

వాళ్ల దగ్గర పెద్దసేన ఉందంటున్నాడు. వాళ్లకు ఏడు అక్షౌహిణులు, వీళ్లకు పదకొండు అక్షౌహిణులు ఉన్నాయి. వీళ్లకు సేన ఎక్కువుంది, వాళ్లకు తక్కువ ఉంది. లోపల అసూయ. ఏమని అసూయ? ఆ పాండవులు రాజ్యం లేని వాళ్లు. ఎందుకూ పనికిరానివాళ్లు. రాజ్యభ్రష్టులు. వాళ్లకు యేమీ లేదు. వాళ్ల తరపున యెవరూనించోరు అనుకున్నాడు కానీ పాండవులు వాళ్ల ధర్మదీక్షతో ఏడక్షౌహిణులసేనను తీసుకొచ్చేసారు. వాళ్ల తరపున నించున్నవాళ్లున్నారు. విశేషించి శ్రీకృష్ణపరమాత్మ వాళ్ల ప్రక్కన ఉన్నాడు. ఆ అసూయ తట్టుకోలేకే "మహతీం చమూమ్" అంటున్నాడు. వాస్తవానికి తన సేన మీద నమ్మకం ఎక్కువ ఉండాలి కానీ ఎదుటివాళ్ల సేన మీద ఎక్కువ నమ్మకముంది. కాస్త ఆవేశంలో ఉన్నప్పుడో, లేకపోతే బాధలో ఉన్నప్పుడో, ఈ రకంగా మాట్లాడటమనేది సహజమనుకోవచ్చు. ఆ తర్వాత మాట్లాడిన మాట సామాన్యులెవరూ భరించరానిమాట. ఏమంటున్నాడంటే– "వ్యూఢాం ద్రుపదపుత్రేణ" అంటున్నాడు. "ద్రుపద పుత్రేణ" అంటే దృష్టద్యుముడు అనుకున్నాం గదా! 'ద్రుపద' అనే పదం హింసాపరులను మాటలతో హింస చేసే స్వభావంతో కూడిన పదం.

ద్రుపదుడు అనే ఓ మహారాజు పాండవులకు మామగారు. ఆయన, ద్రోణాచార్యుడు చిన్నప్పుడు సహాధ్యాయులు. వారిద్దరు చాలాస్నేహంగా ఉండేవారు. ఆ స్నేహంతోనే ద్రుపదుడు "నేను పెద్దయింతరువాత రాజునై పోతానుగదా. నీవు వచ్చేయి నిన్ను బాగా సుఖపెడతాను" అన్నాడు. స్నేహితులిద్దరు నవ్వుకున్నారు. సామాన్యంగానే తీసుకున్నారు. విద్యాభ్యాసం ముగిసింది. ఎవరిదారిన వాళ్లు వెళ్లారు.

ద్రుపదుడు మహారాజు అయ్యాడు. ఈలోపల ద్రోణుడికి కృపి అనే ఆవిడతో వివాహం జరిగింది. వారికి అశ్వత్థామ అనే పిల్లవాడు పుట్టాడు. అంతవరకు ఈ ద్రోణాచార్యుడు అడవిలో ఉన్నాడు. ఎలాంటి అడవి అంటే అక్కడ ఆవులు కూడ దొరకని అడవి. గ్రామీణప్రాంతాల్లో ఆవులులాంటి జంతువులు అడవుల్లో బ్రతకలేవు. ఆవులు బ్రతకలేనటువంటి కీకారణ్యంలో నివాసం ఉంటున్నాడు. జాగ్రత్తగా తపస్సు చేసుకునే వంశం వారిది. చాలా పెద్దవంశం అది. అట్లాంటి ద్రోణుడు పిల్లవాడు పుట్టిన తరువాత ఆ పిల్లవాడికి ఎవరో పాలు రుచి చూపించారు. దాంతో ఆ పిల్లవాడు "పాలు కావాలి" అన్నాడు. "పాలంటే యేమిటి" అని అడిగారు వీళ్లు అడిగితే "తెల్లగా ఉంటాయి గదా!" అన్నాడు ఆ పిల్లవాడు. "తెల్లగా అంటే యేమిటి" అంటే "అదేనండీ తెల్లగా ఉండి అందులో నీళ్లుగా ఉంటుంది" అన్నాడు ఆ పిల్లవాడు. వీళ్లేం చేశారంటే అరణ్యంలో పెరిగే ధాన్యం తీసుకొచ్చి దాన్ని కొట్టి, పిండి చేసి ఆ పిండి కలిపి పిండిపాలిచ్చారు. కాని పిల్లవాడొప్పుకోలేదు. ఇవి పాలరుచి కాదన్నాడు. దాంతో పిల్లవాడి మీద ఉండేటటువంటి ప్రేమతో ఈయన ఒక ఆవును సంపాదించుకుందాం అని బయలుదేరాడు. ఎవరి దగ్గరకెళ్ళాలి? ఆవు కావాలంటే? ఎలాగూ మన స్నేహితుడున్నాడు గదా? నన్ను సుఖపెడతానన్నాడు గదా? ద్రుపద మహారాజు దగ్గరకు వెళితే ఆయన ఒక్క ఆవు ఇస్తాడు ఆవు తీసుకొచ్చుకుని పిల్లవాణ్ణి కాపాడుకొందామని అనుకున్నాడు ద్రుపదమహారాజు దగ్గరకు వెళ్లాడు.

ద్రుపదుడు చిన్నవయసులోనే రాజ్యం రావటంతో అప్పటికే చాల అహంకరించి ఉన్నాడు. ఈ స్నేహితుణ్ణి చూసిన వెంటనే పలకరించలేదు. పలకరించ లేదు సరిగదా "అయ్యా స్నేహితుడా!" అని పిలిస్తే నువ్వు నేను స్నేహితులమేమిటి? నువ్వెవడివి? నేనెవరిని? నువు ముష్టివాడివి నేనేమో మహారాజును. మనిద్దరికి స్నేహమేమిటి?" అన్నాడు. ద్రోణుడిలో ఎక్కడో రాజసాంశ ఒకటుంది. సామాన్యంగా తపస్సు చేసుకొనేటటువంటి అరణ్యాల్లో ఉండేవారు ఇటువంటి మానావమానాలకు లొంగరు. ఇటువంటిదొక విషయమే కాదు వాళ్లులెక్క చెయ్యరు. కానీ ఎందుకో ఒక చిన్నకణిక, రాజసకణిక, ఒక నిప్పుకణిక ఒక్కసారిగా రగిలింది. రగలటంతో ఒక్కసారిగా యేమన్నాడంటే "యెట్లాగైనా నీకు సమానమై నీకు సరిజోడై నీతో స్నేహం చేస్తాను" అని ప్రతిజ్ఞ చేసుకున్నాడు.

*(ఇంకా ఉంది)*

# ప్రకృతికి ప్రతీక ఈ దేవుడు!

- శ్రీమతి జె.ఎస్.కె.దుర్గ

మహాభారతంలో శ్రీకృష్ణుడి సోదరుడిగా మాత్రమే సాధారణ ప్రపంచానికి కనిపించే బలరాముడు పాత్ర నుంచి తెలుసుకోవాల్సిన ఆధ్యాత్మిక రహస్యాలెన్నో ఉన్నాయి. వాస్తవానికి బలరాముడు దేవకీదేవి ఏడవ గర్భం నుంచి పుట్టాల్సి ఉంది. కంసుడికి దేవకీ దేవికి కలిగే ఏడు, ఎనిమిది గర్భాల గురించిన సందిగ్ధతను పెంచటం కోసం దైవం చేసిన మాయలో భాగమే బలరాముడు రోహిణి గర్భం నుంచి జన్మించటం వెనక ఉన్న రహస్యం.

బలరాముడిని దేవకీ గర్భం నుంచి సంకర్షించి, వ్రేపల్లెలో ఉన్న వసుదేవుడి భార్యే అయిన రోహిణి గర్భంలో ఉంచారు. ఆ కాలంలోనే ఈ గర్భమార్పిడి పద్ధతి జరిగింది. అందుకనే బలరాముణ్ని సంకర్షణుడని అంటారు. సంకర్షించడ మంటే బ్రహ్మ చైతన్యం నుంచి దూరంగా లాగడమని అర్థం.

భగవంతుడి నుంచి దూరంగా లాగుతూ ప్రపంచ విలాసాల ప్రలోభాలను చూపించేది ప్రకతి. ఇలా సంకర్షణ చేసే ప్రకృతే బలరాముడు. ప్రకృతి అంటే భగవంతుడి ప్రకృష్టమైన, గొప్పదైన కృతి. భగవంతుడనే పురుషుడు గీసిన గిరలోనే ఉంటూ పనిచేస్తుంది ప్రకృతి. మనను దూరంగా లాగుతున్నా, దూరంగా పోవడం వల్ల కలుగుతూన్న కష్టనష్టాలను అనుభవించేలాగ చేసి, తిరిగి భగవంతుడి వైపు మరలేట్లు చేయటం ప్రకృతి ధర్మాల్లో ఒకటి. ఈవిధంగా కూటస్థుడైన శ్రీకృష్ణుణ్ణి దాటి ప్రకృతి రూపమైన బలరాముడు ఎప్పుడూ ప్రవర్తించడు. ఇదే బలరామతత్త్వం.

బలరాముడు ప్రకృతిగా దుర్యోధన పక్షపాతిగా, భగవంతుడి దగ్గరే ఉన్నా అతనికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తూన్నట్టు కనిపిస్తాడు. మోసం చేసి సంపాదించిన పాండవుల రాజ్యాన్ని కౌరవులు తిరిగి ఇవ్వాలి లేదా యుద్ధంలో చావాలి అని శ్రీకృష్ణుడు అంటే, జూదమాడడమూ రాజ్యాన్ని పోగొట్టుకోవడమూ ధర్మరాజు స్వయంకృత అపరాధాలే తప్ప, వాటిలో దుర్యోధన శకునుల తప్పేమీ లేదన్నట్టు మాట్లాడతాడు బలరాముడు.

యుద్ధానికి ముందు శ్రీకృష్ణుడి సాయంకోసం దుర్యోధనుడు, అర్జునుడు ఇద్దరూ వస్తారు. కృష్ణుడు చేసిన విభాగంలో మొత్తం సైన్యాన్ని దుర్యోధనుడు తీసుకుంటాడు. అర్జునుడు కన్నయ్యను మాత్రమే కోరుకుంటాడు. ఆ తర్వాత దుర్యోధనుడు తనకు గదాయుద్ధం నేర్పిన బలరాముడి దగ్గరికి వెళ్లి సహాయ మడిగాడు. అందుకు ప్రతిగా బలరాముడు నాకు కౌరవపాండవులు ఇద్దరూ సమానమే. కాబట్టి నేను ఎవరి పక్షానా ఉండను అంటూ వెళ్ళిపోతాడు. యుద్ధానికి ముందు పాండవుల శిబిరానికి వెళ్ళినప్పుడు కూడా కృష్ణుడులేని జగత్తును నేను చూడలేనంటాడు. పరమాత్మకు లోబడిన ప్రకృతి తత్త్వాన్ని ఇక్కడ బలరాముడు ప్రదర్శించాడు.

బలరాముడికి నాగలి, రోకలి ఆయుధాలుగా వర్ణించడంలో కూడా అతను ప్రకృతికి ప్రతీక అనే అంతరార్థాన్ని మనం గ్రహించాలి. నాగలి నేలను దున్ని ధాన్యాన్ని పండిస్తే, ఆ ధాన్యాన్ని రోకలితో దంచి పొట్టును దూరం చేసి అన్నాన్ని సిద్ధం చేసుకుంటాం. బలరామ పాత్ర అందించే జీవన సందేశం ఇది.



గృహలక్ష్మి

# సౌభాగ్యకరం... వరలక్ష్మీ వ్రతం

- శ్రీ కె. జానకిరామావధాని

మన కోరికలు తీరడానికి భగవంతుడి అనుగ్రహం తప్పనిసరి. అయితే కోరిక ఏదైనప్పటికీ, ఇచ్చే దైవం ఎవరైనప్పటికీ అంతిమంగా ఆ కోరికల్లో ఉండేది లేదా ఆ కోరికల ద్వారా అందుకునేది ఆనందం, తృప్తి మాత్రమే. ఈవిధమైన సంతృప్తి పొందిన వ్యక్తి మాత్రమే నిజమైన భాగ్యవంతుడు. అటువంటి భాగ్యాన్ని (లక్ష్మిని) అందించేది వరలక్ష్మీదేవి మాత్రమే. వరాలరూపంలో సౌభాగ్యాన్ని భక్తులకు అనుగ్రహించే మాత 'వరలక్ష్మీదేవి'. 'వర' అంటే 'కోరుకున్నది', 'శ్రేష్ఠమైనది' అనే అర్థాలు ఉన్నాయి. ఈ అర్థాలను అన్వయం చేస్తే కోరిన కోర్కెలు లేదా శ్రేష్ఠమైన కోర్కెలు ఇచ్చే తల్లిగా వరలక్ష్మీదేవిని భావించవచ్చు. ఈదేవిని సమంత్రకంగా, భక్తి భావనతో కొలిచే వ్రతమే **'శ్రీవరలక్ష్మీవ్రతం'.**

స్వయంగా పరమేశ్వరుడే పార్వతికి ఈ వ్రతం గురించి చెబుతాడు. అదే సందర్భంలో మహాభక్తురాలైన చారుమతీదేవి వృత్తాంతాన్ని కూడా పరమేశ్వరుడు పార్వతికి వివరిస్తాడు. భర్త పట్ల ఆదరాన్నీ, అత్తమామల పట్ల గౌరవాన్నీ ప్రకటిస్తూ చారుమతి ఉత్తమఇల్లాలుగా తన బాధ్యతల్ని నిర్వహిస్తూ ఉండేది. మహాలక్ష్మీదేవి పట్ల ఎంతో భక్తిశ్రద్ధలు కలిగిన చారుమతి అమ్మవారిని త్రికరణశుద్ధిగా పూజిస్తూ ఉండేది. ఆమె పట్ల వరలక్ష్మీదేవికి అనుగ్రహం కలిగి, స్వప్నంలో ఆమెకు సాక్షాత్కరిస్తుంది. శ్రావణపూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం రోజున తనను ఆరాధిస్తే కోరిన వరాలన్నీ ఇస్తానని ఆమెకు అభయమిస్తుంది. అమ్మ ఆదేశానుసారం వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించిన చారుమతి సమస్త సిరిసంపదల్ని వరలక్ష్మీవ్రత ప్రసాదంగా అందుకుంటుంది.

## వరలక్ష్మీ వైభవం

ఈ వ్రతానికి ఓ ప్రత్యేకత ఉంది. ఈ వ్రతాన్ని శ్రావణ మాసంలో చేస్తారు. శ్రావణమాసంలో శ్రవణనక్షత్రం రోజున పూర్ణిమ వస్తుంది. శ్రవణం శ్రీనివాసుడి జన్మనక్షత్రం. పూర్ణిమ రోజున అమ్మవారు షోడశకళలతో వెలుగొందుతుంది. శుక్రవారం అమ్మకు ప్రీతిపాత్రమైన వారం. ఈవిధంగా చూస్తే లక్ష్మీశ్రీనివాసుల వైభవం అనంతంగా ప్రకాశించే పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీవ్రతం చెయ్యటం లక్ష్మీశ్రీనివాసుల అనుగ్రహానికి తొలిసోపానంగా చెప్పుకోవచ్చు.

సకలసౌభాగ్యాలు కలగాలని, నిత్యసుమంగళిగా తాము జీవితకాలం ఉండాలని కోరుకుంటూ దేశవ్యాప్తంగా మహిళలు ఈ వ్రతాన్ని చేస్తారు.

వరలక్ష్మీవ్రతంలో భాగంగా కలశాన్ని స్థాపించి పూజించటం జరుగుతుంది. కలశం అమ్మవారికి ప్రతిరూపం. కలశపాత్రగా మట్టిపాత్రనుగాని, చేసుకునే యజమాని శక్తిని బట్టి వెండి, బంగారు, రాగి, పంచలోహపాత్రలను గాని విని యోగిస్తారు. లోహమైనా, మట్టి అయినా అది పృథ్వీతత్త్వానికి సంకేతం. అందులో పోసే నీరు జలతత్త్వానికి సంకేతం. అందులో కలశాన్ని పూర్తిగా నీరుతో నింపం కనుక శూన్యస్థితి ఆకాశతత్త్వానికి సంకేతం. మనం చదివే మంత్రం వాయు జనితం. కనుక అది వాయుతత్త్వానికి సంకేతంగా ఉంటుంది. కలశం ముందు ఉంచే దీపం అగ్నితత్త్వానికి సంకేతం. ఇలా పంచభూతాలను ఒకచోటికి చేర్చి పూజిస్తాం.

ఈవిధంగా పంచభూతాలకు ప్రతీకగా ఆయా వస్తువులను ఉంచి పంచ భూతాల్లోనూ వ్యాపించి ఉండే పరతత్త్వం, శక్తిస్వరూపమైన అమ్మను ఆరాధించటం కలశారాధనలోని అంతరార్థం.

## వ్రతాచరణకు నియమాలు

కలశం కోసం తెచ్చుకున్న పాత్రను శుభ్రంగా కడిగి, పసుపు, కుంకుమలతో అలంకరించాలి. వ్రతానికి ఎంపిక చేసుకున్న స్థలాన్ని శుభ్రం చేసుకుని, పీటవేసి, దానిమీద నూతన వస్త్రం వేసి, దానిపై బియ్యంపోసి వేదికను సిద్ధం చేయాలి. వేదికను పూలు, చందనం, పరిమళద్రవ్యాలు చల్లి శోభాయమానంగా చేసుకోవాలి. ఆ తర్వాత కలశాన్ని దానిపై అమర్చాలి. దానికి తాంబూలం సమర్పించి ఆరాధించాలి. కలశంలో నీరుపోసి మామిడాకులు లేదా తమలపాకులు కాని అందులో వేయాలి. ఆకులు ఏవైనా అవి నిటారుగా నిలిచేటట్టు చూసుకోవాలి. దాని మీద కొబ్బరికాయ నుంచి దానికి రవికె గుడ్డను వస్త్రంగా చుట్టాలి. కొబ్బరికి ముఖస్వరూపం వచ్చేలా కళ్లు ముక్కు, పెదవులు, కనుబొమలు అమరేలా దిద్దవచ్చు లేదా

అమ్మవారి రూపును దానికి తగిలించి ఆకారం ఏర్పరచవచ్చు. దానికి తమకు తోచిన నగలు వగైరాలు అలంకరించవచ్చు.

వ్రత తోరాన్ని ఐదుపోరలుగా తీసుకుని దానికి పసుపురాయాలి. దానికి మధ్యలో మామిడి ఆకునుకాని, తమలపాకును కాని పెట్టి ముడివేయాలి. దీన్ని అమ్మవారి సమక్షంలో ఉంచి పూజించాక చేతికి మణికట్టు దగ్గర ధరించాలి. దీన్ని మొదటి శుక్రవారం కట్టుకుంటే నెలంతా ఉంచుకుని అమ్మవారి పూజ నెలరోజులూ జరుపుకోవాలి లేదా శ్రీవరలక్ష్మి వ్రతం నాడు కట్టుకుని కలశానికి ఉద్వాసన పలికిన తర్వాత తీసేయొచ్చు. ఇంటి ఆచారాలను బట్టి పూజావిధానంలో మార్పులు ఉండొచ్చు.

అమ్మవారికి పూజలో ప్రసాదంగా చక్కరపొంగలి కానీ పాయసం కాని నివేదన చెయ్యాలి. పాయసం దేనితో తయారు చేసినా దోషం కాదు. పూజలో వినియోగించిన బియ్యాన్ని మర్నాడు అన్నంవండి దేవతామందిరంలో ఇలవేలుపుకు ప్రసాదంగా సమర్పించి స్వీకరించాలి. కలశంలో ఉంచిన కొబ్బరికాయను మరుసటి రోజున మనం రోజూ పూజించే దేవుడికి నివేదన చేసి ఆ టెంకాయను కొట్టి ప్రసాదంగా చేసుకుని అందరూ తీసుకోవాలి. కలశంలో ఉన్న జలాన్ని కుటుంబసభ్యులందరూ తీర్థంగా తీసుకోవాలి. శిరస్సు మీద చల్లుకోవచ్చు. ఏదైనా అవాంతరం వల్ల శ్రావణశుక్రవారం రోజున వ్రతం చేసుకోవటం సాధ్యపడకపోతే తర్వాతి వారం చేసుకోవచ్చు.

## విశ్వమంతా లక్ష్మి స్వరూపమే

ప్రతి స్త్రీలోనూ లక్ష్మి కళ ఉంటుందని శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకనే స్త్రీలను లక్ష్మీస్వరూపంగా ఆరాధించటం, అర్చించటం మన సంప్రదాయంలో ఒక భాగంగా ఉంటుంది. ఏ పనికైనా మహిళే ఆదిశక్తి. ఆమెదే ఉన్నత స్థానం. అందరి మాటలు ఓర్పుగా వింటుంది. ఇతరులతో పనులు చేయిస్తుంది. తాను స్వయంగా చేస్తుంది. గుణాల చేత వ్యాపిస్తుంది. దోషాలు తొలగిస్తుంది. అందుకే స్త్రీరూపంలోని లక్ష్మికి మన సంస్కృతి సమున్నతస్థానాన్ని ఇచ్చింది.

అనంతవిశ్వాన్ని 'లక్షించేది' లక్ష్మి. అందరూ లక్షించేది లక్ష్మిని. 'లక్షించటం' అంటే చూడటమని అర్థం. అందరినీ తన కరుణామృతపూర్ణమైన చల్లనిచూపులతో 'కనిపెట్టుకుని', గమనించి, పాలించే శక్తిని లక్ష్మిగా చెప్పుకోవచ్చు. సర్వసాక్షియైన ఈ భగవద్దర్శన శక్తిని లక్ష్మిగా ఉపాసించటం లక్ష్మీ ఆరాధన



లోని ప్రత్యేకత. అందరూ ఆనందాన్నీ, ఐశ్వర్యాన్నీ, జ్ఞానాన్నీ, 'లక్ష్యం'గా పెట్టుకొనే జీవిస్తారు. ఇలా అందరికీ లక్ష్యమైన జ్ఞాన, ఆనంద, ఐశ్వర్యాల సాకార రూపమే 'లక్ష్మి'. ఈ దివ్య భావాన్ని సగుణంగా, లీలారూపంగా పురాణాలు వ్యక్తీకరించాయి.

## వరలక్ష్మి సందేశం

సంప్రదాయకంగా తరతరాల నుంచి వస్తున్న ఈ వ్రతం పైకి మామూలు పురాణ కథలానే కనిపించినా ఇందులో ఒక సామాజిక చైతన్య సూత్రం ఇమిడి ఉంది. చారుమతికి వరలక్ష్మీ దేవి కలలో కనిపించి తనను పూజించమని, సకల ఐశ్వర్యాలనూ ఇస్తానని చెప్పింది. చారుమతి ఆ వ్రతాన్ని స్వార్థబుద్ధితో తానొక్కతే చెయ్యలేదు. తనతోపాటు తనవారు, తన చుట్టుపక్కల ఉన్న కుటుంబాల స్త్రీలంతా వరలక్ష్మీదేవి కటాక్షానికి పాత్రులు కావాలని అందరినీ కలుపుకొని వ్రతం చేసింది. స్త్రీలు ఇలా అందరినీ కలుపుకొని సామరస్యధోరణిలో, నిస్వార్థబుద్ధితో మెలగాలనే ఓ సామాజికసందేశం ఈ వ్రత కథ వెనుక ఉంది.

# చేత వెన్న ముద్ద!

- శ్రీమతి పురాణపండ వైజయంతి



శ్రీకృష్ణుడు అనగానే చేతిలో వెన్నముద్దే గుర్తుకొస్తుంది. నల్లని వానిజన్మదినాన్ని దేశవ్యాప్తంగా ఎంతో సంతోషంగా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. కొన్నిప్రాంతాలవారు ఆ రోజంతా ఉపవాసం ఉంటారు. కొన్నిప్రాంతాలవారు శ్రీకృష్ణునికీర్తనలు గానం చేస్తూ, కోలాటం ఆడుతారు. చాలాప్రాంతాల్లో ఉట్టి కొడతారు. కొన్నిప్రదేశాల్లో శ్రీకృష్ణునికి ప్రీతిపాత్రమైన మధురపదార్థాలను తయారుచేసి నివేదన చేస్తారు. శ్రీకృష్ణుడికి మధురపదార్థాలంటే మిక్కిలి మక్కువ. ఆయన సాక్షాత్తు మధురానగరవాసి.

బాలగోపాలుని బాల్యచేష్టలు వర్ణించతరమా? గోకులంలో గోపికల ఇళ్లకు రహస్యంగా వెళ్లి పాలు, పెరుగు, వెన్నమీగడలతో పాటు మిఠాయిలకోసం గాలించేవాడు. "వీడటే! మందలో వెన్నలు దొంగిలి దర్పించి మెక్కిన దాపరీడు." అని పోతన ఆయనను కీర్తించాడు. అలావారిఇళ్లకు వచ్చి, దొంగతనంగా తింటుంటే ఆ ఇళ్లవారు ఆనందించేవారట. అందు కోసమనే ప్రత్యేకంగా స్వచ్ఛమైనఆవునేతితో మిఠాయిలు తయారుచేసి, ఉట్టి మీద ఉంచేవారని కృష్ణభక్తులు కథలు కథలుగా చెప్పుకుంటారు. శ్రీకృష్ణభక్తులు పాలతో తయారు చేసినమిఠాయిలు మధురాధిపతికి నివేదన చేస్తారు.

జన్మాష్టమినాడు ముఖ్యంగా అన్ని ప్రాంతాలవారు కాయం తయారు చేస్తారు. మిగిలిన మిఠాయిలు నివేదన చేసినా, చేయకున్నా ఇది మాత్రం తప్పనిసరి.

| | |
|---|---|
| శొంఠిపొడి | - టీ స్పూను (శొంఠిని నేతిలో వేయించి పొడి చేయాలి) |
| బెల్లం పొడి | - 8 టేబుల్ స్పూన్లు |
| మిరియాల పొడి | - అర టీ స్పూను |
| వాము | - అర టీ స్పూను |
| ధనియాల పొడి | - అర టీ స్పూను |
| కరిగించిన ఆవు నెయ్యి | - పావు కప్పు |

అన్ని పదార్థాలను ఒక పెద్దపాత్రలో వేసి బాగా కలపాలి. చివరగా నెయ్యివేస్తూ ఉండలు చేయాలి. బుల్లి కృష్ణుడికి నివేదన చేసి ప్రసాదంగా తినాలి. అతిగా తిన కూడదు.

శ్రీకృష్ణజన్మాష్టమినాడుమాత్రం కొన్నిరకాల మధుర పదార్థాలు మాత్రమే తయారుచేసి, ఆయనను పూజించి, నివేదన చేస్తారు. రబ్రీ, ఖీర్ పాలకోవా, గోపాల్‌కాలా, మిస్టీ దోయ్, కలాకండ్.. వంటివి ఆ చిన్నికృష్ణుడు ఇష్టంగా తింటాడని భక్తుల విశ్వాసం. ఇవి కాకుండా ఆయాప్రాంతాల ఆచారాలను అను సరించి రకరకాలమిఠాయిలనుకూడా తయారుచేసి, నివేదన చేస్తారు. కొబ్బరితురుము, చిక్కటిపాలమీగడ, పంచదారలతో తయారుచేసే పాల లడ్డును ఉపవాసం ఉన్నవారు సాయంత్రం భగవంతుడికి నివేదన చేసి తింటారు. కేసరి, కోవా, హల్వా, సేమ్యా... అబ్బో ఎన్నిరకాలో, ముఖ్యంగా మహారాష్ట్రవాసులు తయారుచేసే బాసుంది ఈ పండుగకు ప్రత్యేకం. బియ్యాన్ని నీళ్లలో నానబెట్టి, రవ్వ తయారుచేసి, పాలలో ఉడకబెట్టి, డ్రైఫ్రూట్స్ వేసుకుని చల్లనయ్యాక అర్పించి, ఆ నల్లనివానికి ఇష్టమైన చల్లటి వంటకాన్ని ప్రసాదంగా సేవిస్తారు.

## చిన్ని చిన్ని కన్నయ్యా.....

**శ్రీకృష్ణుడు సర్వాంతర్యామి, సర్వులకూ ఆనందం కలిగించే సుందరవదనుడు. అందుకే శ్రీకృష్ణాష్టమి వచ్చిందంటే చాలు ఆనల్లనివాడు పసిపాపలున్న ప్రతి ఇంటిలోనూ ప్రవేశిస్తాడు. ఇంటింటా బుల్లికృష్ణుల రూపంలో కనువిందుచేస్తాడు. ప్రతితల్లీ యశోదమ్మలా మారిపోతుంది. పిల్లల్ని దండిస్తుంది, అంతలోనే గారం చేస్తుంది. బాల్యంలో పసిపిల్లలు చేసే అల్లరిచేష్టలు కృష్ణుడిని గుర్తుచేస్తాయి. ప్రతిపాఠశాలలోనూ శ్రీకృష్ణాష్టమిసందర్భంగా శ్రీకృష్ణుడు వేషంలో పిల్లలకు పోటీలు పెడతారు. పిల్లలంతా కృష్ణుడి జడవేసుకుని, తలలో నెమలికన్ను, చేతిలో వేణువు, మెడలో చెంగల్వ పూలహారం, కాళ్లకు కడియాలు, పట్టు పంచెకట్టుకుని బుడి బుడి అడుగులు వేస్తూ శ్రీకృష్ణుడిలా వృత్యస్తపాదాలతో అందరినీ అలరిస్తారు. ఇటువంటి వేషధారణ కేవలం శ్రీకృష్ణాష్టమి ప్రత్యేకం.**



ఉత్తరాదివారు ఎక్కువగా తయారుచేసే బాదం ఫిర్నీ... వాస్తవానికి కశ్మీరదేశం నుంచి వచ్చింది. బియ్యం పిండికి, బెల్లం జతచేసి, బాదంపప్పులు వేసి ఆ బాలగోపాలునికి నివేదిస్తారు. గులాబీఖీర్‌ను కేవలం అరగంటలో తయారు చేసి ఆకలివేస్తున్న కిట్టయ్యకు తినిపిస్తారు.

బోలెడన్ని పాలు, వెన్న వేసి తయారుచేస్తే ఈ వంట కాన్ని బాలగోపాలుడు తినకుండా ఉండగలడా? బెంగాలీలు శిఖిపింఛమౌళికి రంగురంగుల మలై చమ్‌చమ్ ప్రేమగా సమర్పిస్తారు. మరింత రుచికోసం కుంకుమపువ్వు, మీగడ బాగా దట్టిస్తారు.

బాలగోపాలుడు జగత్తులో జన్మించిన శుభదినం. ఈ రోజు తెల్లవారుజామునుంచి అర్ధరాత్రివరకు ఉపవాసదీక్ష కొనసాగుతుంది. అర్ధరాత్రి పన్నెండుగంటలకు చందమామను దర్శించి, ఉపవాసదీక్ష విరమిస్తారు. విరమణ సమయంలో శ్రీకృష్ణుడిని ఆహ్వానిస్తూ పూజ ఆచరించి, నైవేద్యాలు సమర్పిస్తారు. ఇక్కడొక చిన్నసవరణ ఉంది. ఉపవాససమయంలో పండ్లు, పాలు తీసుకోవచ్చు. అలాగే దీక్ష విరమించాక సగ్గుజావ, శ్రీఖండ్, అటుకులు, ఇడ్లీ, సెనగలు తినవచ్చునని శాస్త్రం. ఉల్లి, వెల్లుల్లి, బియ్యం పూర్తిగా నిషేధం.

ఈ పండుగను ఒంటరిగా కాకుండా సామూహికంగా జరుపుకోవాలి. కొందరు దేవాలయాలకు వెళ్లి, భజనలు చేస్తూ భక్తితో అర్చిస్తారు. ఇంటిదగ్గరే పండుగ చేసుకోవాలనుకునేవారు శ్రీకృష్ణుడిని భక్తిపూర్వకంగా ఆయాగృహాలకు ఆహ్వానించాలి. ఇందుకు ముఖ్యంగా రెండుమార్గాలు అవలంబిస్తే బాలగోపాలుడు సంబరపడతాడట. ఆయనకు మిఠాయిలంటే ఇష్టమని తెలిసిందే కదా. పూజగదిని అందంగా అలంకరించి, ఆ వెన్న దొంగను కన్నబిడ్డలా భావించి వెన్నతో ఆహ్వానిస్తే పరమానంద పడతాడట.

అన్నమయ్య తనకీర్తనలలో చిన్నికృష్ణున్ని వెన్నదొంగగా కీర్తించాడు.

**చిన్నిశిశువు చిన్నిశిశువు**
**ఎన్నడూ చూడమమ్మ ఇటువంటిశిశువు**

**బలుపైన పొట్టమీద పాలచారలతోడ**
**నులివేడి వెన్న తిన్ననోరితోడ.....**

**నవనీతచోరా నమో నమో**

**పాలదొంగవద్ద వచ్చిపాడేరు**
**తమపాలిటి దైవమని బ్రహ్మాదులు......**

**పిల్లలందరూ చల్దులు తిని, ఆటలకు పోగా - యశోదాదేవి పెరుగు చిలుకుతూ, వెన్న తీస్తూన్నది. ఆ సమయానికి కృష్ణుడు వచ్చి, రెండుకాళ్లూ చుట్టుకుని పైటలాగుతూ అమ్మా..! పాలు. ఆకలి, పాలియ్యవే..!! అని ఆగడం చేసి, తన చేతుల్లోకి కవ్వం అందుకోగా, చేసేది లేక ఆ తల్లి, బిడ్డను ఒడిలోకి తీసుకుని పాలిచ్చింది. ఈలోగా దాలి పొయ్యిలో పాలు పొంగడం చూసి దింపడానికి వెళ్లింది. ఆ సందుచూసి ఉట్టి మీద కుండకు చిల్లు పెట్టి, వెన్నతినడం మొదలుపెట్టాడు కృష్ణుడు.**





హరిదాస వాఙ్మయంలో...

# శ్రీవేంకటాచలాధీశుడు

12

- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం...*

ఎల్లభకుతరభీష్ట । కొడువుదకెతాకై
వల్య స్థానవ బిట్ట । శేషాద్రిమందిర
దల్లి లోలుప దిట్ట । సౌభాగ్యనిధిగిది
రిల్ల భుజబలపుష్ట । కస్తూరి యిట్టు ॥

చెల్వ ఫణెయలి శోభిసువ సిరి ।
వల్లభన గుణ పొగళదిహ జగ
ఖుల్లరెదెల్లణ పరాక్రమ । మల్ల మర్దన మాతులారి ।
ఫల్గుణ సఖ ప్రకటనాగిహ। దుర్గభను అఘదూర బహుమాం
గల్య హృదయను సృష్టిగె । ఉల్లాసకొడుతలి చెందదిందలి ॥

(శ్రీ వేంకటేశ్వరుడు సకలభక్తులకు అభీష్టాలను ప్రసాదించుటకే కైవల్యస్థానమైన వైకుంఠాన్ని వీడి ఈ శేషాద్రి మందిరంలో ఉన్నాడు. ఈతడు సౌభాగ్యనిధి. ఇతనికి ఎదురు లేదు. భుజబలపుష్టుడు, ప్రకాశించే లలాటంపై కస్తూరితిలకాన్ని ధరించినవాడు, దుర్మార్గుల పక్షాలను కాలదన్నేవాడు, మల్ల మర్దనుడు, మాతులాంతకుడు పార్థసఖుడు, దుర్లభుడు, పాప దూరుడు, భక్తులకు శుభోదయాన్ని కల్గిస్తూ ఎంతో చక్కగా ఉన్నవాడు).

పదక కౌస్తుభధార । సరిగెయ కంధర
సుదరుశనదరధార । సుందర మనోహర ।
పదయుగది నూపుర । ఇట్టి హను సన్ముని
హృదయస్థితగంభీర । బహుదానశూర ।
విధి భవాద్యర పొరెవదాతను ।
తుది మొదలు మధ్యమ విరహితను
ఉదుభవాదిగళిగె కర్తను । త్రిదశ పూజిత త్రిభువనేశ ।
సదువిలాసది స్వామి తీర్థది । ఉదిసుతిరె సిరిమహిళె సహితది।
పదుమనాభ పురందర విఠల ।
ప్రతి వరుష బ్రహ్మోత్సవది మెరెయుత ॥

కౌస్తుభాది పతకాలను, దండలను కంఠాన ధరించిన వాడు, సుందరమనోహరపదయుగళిచే ప్రకాశిస్తూ అందులో నూపురాన్ని పెట్టుకొన్నవాడు. సన్ముని హృదయవిహారుడు, బహుదానశూరుడు అయిన ఇతడు బ్రహ్మరుద్రాదుల కనుగ్రహ ప్రదుడై, ఆదిమధ్యాంతరహితుడై, త్రిలోకాలచే పూజింపబడే త్రిభువనేశుడై సద్విలాసంతో స్వామిపుష్కరిణీతీరంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా పద్మనాభుడైన పురందరవిఠలుడై శ్రీవేంకటేశ్వరుడు ప్రతిసంవత్సరం వలే బ్రహ్మోత్సవంలో ప్రకాశించాడు.

స్వతఃసిద్ధంగా ఉన్న శ్రీనివాసుని దివ్యమంగళ విగ్రహాన్ని వృత్యానుప్రాసాలంకారంతో నాట్యానుకూలంగా, తాళానుకూలంగా గాయకహృదయోల్లాసంగా, పాఠకునికి విచిత్రానందానుభూతి కలుగునట్లుగా రాయబడిందీ పాట.

'నిన్నదివ్యమూరితియ కణ్ణుదేశియ నోడి ధన్యనాదెనో ధరేయోళ్' అనే క్రింది మోహనరాగకీర్తన భక్త్యుత్సాహంచే పాడుతూంటే తిరుమల ఆలయంలో మానసికంగా సంచరించక తప్పదు.

పల్లవి :
నిన్న దివ్యమూరితయ కణ్ణుదణియనోడి ధన్యనాదేనోధరేయోళు।
అనుపల్లవి :
ఇన్ను ఈ భవ భయకె అంజలేతకో చెన్నసిరి వేంకటేశ ॥

కనులారా నీ దివ్యమంగళమూర్తిని చూచి ధన్యుడనైతిని. ఈ భూమిపై ఇక భవభయ బాధలకు భయపడనవసరం లేదు శ్రీ వేంకటేశ!

చరణము :
ఏను జన్మద పుణ్య బందొదగితో శ్రీస్వామి పుష్కరిణియోళు ।
స్నానజపతపమాడి వరహదేవరనోడి శ్రీస్వామిమహద్వారకె ।
ఈ శరీరవను ఈడ్యాడి ప్రదక్షిణెమాడి లేశదింపఃగళుతలి ।
ఆసువర్ణదగరుడగంభవనె నోడి సంతోషదింకొడాడిదె । బిడదె।

అనేకజన్మలలో చేసుకున్న పుణ్యప్రభావంతో ఈ కొండకు వచ్చి శ్రీస్వామి పుష్కరిణిలో స్నానం జపం తపాలను చేసి,

వరాహదేవుణ్ణి దర్శించి శ్రీవారి మహాద్వారానికి వచ్చి అక్కడ సాష్టాంగనమస్కారంచేసి ప్రదక్షిణం చేసి, స్వామిని స్తుతించి ఆపై సువర్ణగరుడస్తంభాన్ని చూచి సంతోషంతో మిక్కిలి కొనియాడితిని.

నోట్టనేరదనే ద్వారదాటిపోగుతలి దట్టణియుం బహుజనదలి ।
ఘట్టమనదలి తలెయ చట్టిదుతనేట్టనె కటాంజనేకేబరుతలి ।
కృష్ణాజినదవర పెట్టుగళకాణుతలి కంగెట్టు హరియెనుతలి ।
బెట్టదధిపతినిన్న దృష్టింద కాణుతలి । సుట్టతెన్న యదురితవు॥
సర్వవు

ఆపై లోపలిరెండో ద్వారాన్ని దాటి భక్తజనుల గోవింద నామస్మరణతో మార్మోగడాన్ని చూస్తూ, వింటూ లోపలికి ప్రవేశించి కొండలరాయణ్ణి కనుల నిండా చూచి నా పాపాలన్నీ భస్మమైనవని తలచాను.

శిరదల్లి రవికోటి తేజదిందెసేవంథ వరకిరీటవుకుండల
కొరళిళిహసరిగె వైజయంతీయమాం పరిపరి హారగళను ।
ఉరది శ్రీవత్సను కరదిశంఖచక్రగళు వరనాభి మాణికవను ।
నిరుపమ మణిఖచిత కటిసూత్ర పీతాంబ్రచరణ ద్వయందుగెయను ॥
॥ ఇన్ను॥

రవికోటితేజపుంఖమైన కిరీటాన్ని ధరించిన శిరస్సును, కుండలాలు ధరించిన చెవులను, వైజయంతి మొదలైన హారాలను ధరించిన కంఠాన్ని, శ్రీవత్సాన్ని కలిగిన వక్షాన్ని, శంఖచక్రాలు ధరించిన చేతిని మాణిక్యంతో ప్రకాశించే నాభిని, మణిఖచితకటిసూత్రంతో కూడిన కటిసూత్రాన్ని, పీతాంబరాన్ని ధరించిన శరీరాన్ని, గజ్జెలతో కూడిన పాదద్వయాన్ని కల్గిన శ్రీనివాసుని చూచాను.

ఇక్షుచాపనపితనె పక్షీంద్రవాహననె లక్ష్మిపతి కమలాక్షనే।
అక్షయ అజసురేంద్రాది వందితనె సాక్షాజ్జగన్నాథనె ।
రాక్షాంతకనె నిరపేక్ష నిత్యతృప్తనె నిరుపమ నిస్సీమనె ।
కుక్షియొళ గిరేళలోకవను తాళ్దవనె రక్షిసువుదెందదయాదీమువది॥

ఉదరమందు ఏడులోకాలను ధరించిన మన్మథ జనకుడ! పక్షీంద్రవాహనుడ! లక్ష్మీపతి! కమలాక్ష! అక్షయ! అజసురేంద్రాదివందిత! జగన్నాథ! రాక్షసాంతక! నిరపేక్ష! నిత్యతృప్త! నిరుపమనిస్సీమ సదా నన్ను రక్షింపుము స్వామి

ఉరగగిరి అరసు నిమ్మచరణగళు కండమ్యేలే ఉరగకరివ్యాఘ్రసింహ।
అరసచోరాగ్ని వృశ్చిక మొదలాద పరిపరియ బహుళభయవు ।
పరమ విషలంపటదొళగెనా సిగదంతె కరుణి సువుదొలిదుదయయ
స్మరగధికలావణ్య తందె పురందరవిఠల శరణజన కరుణార్ణవ।
దేవా॥

ఉరగగిరి దొరవైన నీ పాదపద్మాలను చూచిన తర్వాత ఉరగ, కరి, వ్యాఘ్ర, సింహ, రాజ, చోర, అగ్ని, వృశ్చికాది పరిపరి విధాలైన భయాలు దూరాలు. పరమ విషయసుఖ లంపటుడు కాకుండా రక్షించే భారం నీదె స్వామి. మన్మథుణ్ణి మించిన లావణ్యంగల తండ్రీ! పురందరవిఠల నీవు శరణజన కరుణార్ణవుడు దేవా!

ఇందు నానేను సుకృతవమాడిదెనో
మంగళమహిమ వేంకట బంద మనెగె॥

అనే 9 చరణాలుగల ఈ కీర్తనలో శ్రీనివాసుడు అద్భుత అలంకారాలతో కూడుకొని గరుత్మంతునిపై వచ్చిన తీరును వర్ణించడం చూస్తే నిజంగా గరుడోత్సవం మన కంటికి గోచరం కాక తప్పదు.

మాహాత్మ్యజ్ఞానపూర్వకంగా తెలుసుకోవడం భక్తిలక్షణాలలో ఒకటైనందున పురందరదాసులవారు శ్రీనివాసుని గూర్చి తాము తెలుసుకొన్నదానిని, విన్నదానిని మనకు తెలుపుతూ, తెలుసుకొనినట్లె నిన్ను నమ్మి కొలుచుచున్నాను అని శ్రీనివాసుణ్ణి ఈ విధంగా స్తుతించారు. దాసులవారి దృష్టిలో శ్రీనివాసుడు అపరవాసుదేవుడే. ఆనాటి రామచంద్రుడే, నేడు ముల్లోకాలలోని తనవారిని కాపాడుటకు ఈ వేంకటంపై నిలబడి శ్రీవేంకటేశ్వరుడు అయినాడని అంటారు.

*(ఇంకా ఉంది)*

## వైకుంఠపాళి
### :: 67 – సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ప | | 2 శ | శి | | 3 భ | 4 వా | ని | |
| శు | | క్తి | | 5 కు | | ణి | | 6 వి |
| 7 ప | ద్మ | | 8 కు | రు | డు | | 9 ఉ | ష |
| తి | | 10 గ | | డు | | 11 సు | | య |
| | 12 మ | యు | డు | | 13 సు | శ | ర్మ | |
| 14 ప్ర | | డు | | 15 ప్ర | | ర్మ | | 16 అ |
| 17 ద్యు | తి | | 18 య | యా | తి | | 19 శి | వ |
| మ్ను | | 20 హే | | గ | | 21 ప్రి | | ని |
| డు | | 22 మ | తి | | 23 ఆ | య | తి | |

# రక్తసంబంధాలకు రక్ష.. రక్ష!

- శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి



కుటుంబసభ్యుల మధ్య బంధాల్ని
అనుబంధాన్ని పటిష్టం చేయడానికి,
వారి మధ్య సుహృద్భావాన్ని పెంచడానికి
ప్రసిద్ధిపొందిన పండుగ **రాఖీ పండుగ.**

రాఖీపూర్ణిమగా వ్యాప్తిలో ఉన్న
ఈ పండుగ కేవలం కుటుంబమనే కాదు...
యావజ్జాతిలో అంతులేని విశ్వాసాన్ని
పాదుకొల్పడానికి, ఆత్మస్థైర్యం నింపడానికి,
శాంతియుత సహజీవనానికి
ఈ పండుగ ప్రతీక.

గుండె నిండా ధైర్యం, నేనున్నాననే భరోసా అన్నయ్య రూపంలో చెల్లెమ్మకు అందివస్తే మరో అమ్మగా అనురాగం, ఆప్యాయత చెల్లెమ్మ చేతిపంటగా అన్నయ్యకు అందుతాయి.

నుదుటిన తిలకం దిద్ది, నోరుతీపి చేసి, ఆత్మీయ శుభాకాంక్షలు అందించేందుకు ప్రతి ఇంటా చెల్లెమ్మ తన అన్నయ్య కోసం ఎదురుచూస్తుంది.

చెల్లెమ్మ కట్టే రాఖీ కోసం రెక్కలు కట్టుకుని వాలతాడు అన్నయ్య. మాటలకందని మధురానుభూతుల పందిరి ఇది. జన్మజన్మల బంధంగా పెనవేసుకున్న అన్నాచెల్లెళ్ల అనుబంధానికి శాశ్వతవేదిక రాఖీపూర్ణిమ.

## ఎన్నో పురాణ కథలు

రాఖీ ఈ నాటి పండుగ కాదు. పురాణకాలం నుంచే శ్రావణపూర్ణిమ రోజున మనదేశంలో 'రక్ష' (రాఖీ) కట్టుకునే ఆచారం ఉంది. ఈ పండుగ ఏర్పడడానికి ఓ పురాణగాథ కూడా ఉంది.

ఒకానొక సమయంలో దేవతలు, రాక్షసుల మధ్య పన్నెండు సంవత్సరాల పాటు భీకరయుద్ధం జరిగింది. రాక్షసుల ధాటికి తట్టుకోలేక దేవతల రాజైన ఇంద్రుడి శక్తి క్షీణించడం ప్రారంభమైంది.

పరివారంతో సహా తన రాజధాని అయిన అమరావతి లోని రహస్యప్రాంతంలో దాక్కుంటాడు ఇంద్రుడు. భర్త నిస్సహాయతను గమనించిన శచీదేవి విష్ణుమూర్తిని పూజించి, ఆ 'రక్ష'ను ఇంద్రుడికి కడుతుంది.

ఇది గమనించిన ఇతర దేవపత్నులు కూడా విష్ణువును అర్చించి, తమ భర్తలకు రక్ష కడతారు. ఈ శక్తితో ఆత్మస్థైర్యం కలిగిన దేవతలు రాక్షసులపై విజయం సాధిస్తారు. శ్రావణ పూర్ణిమ రోజున శచీదేవి ఇంద్రునికి రక్ష కట్టడంతో, నాటినుంచి శ్రావణపూర్ణిమ రోజున రక్షకట్టడం ఆచారంలోకి వచ్చింది.

మరికొన్ని పురాణగాథలు కూడా రాఖీ పండుగ ప్రాచుర్యానికి ప్రాతిపదికగా నిలుస్తున్నాయి. బలిచక్రవర్తి ఆధీనంలో ఉన్న విష్ణువును విడిపించడానికి లక్ష్మీదేవి బలిచక్రవర్తికి 'రక్ష'

పంపించినట్లు కథ ఉంది. అదేవిధంగా మరెందరో స్త్రీలు: బలికి రక్ష కట్టి, తమ భర్తలను విడిపించుకున్నట్లు ఐతిహ్యం ఉంది.

ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడికి ద్రౌపదీదేవి రక్ష కడుతుంది. ఇందుకు ప్రతిగా ఆపద కలిగిన ప్రతిసారి కృష్ణుడు పాండవులను రక్షించి, తన చెల్లెలి పసుపుకుంకుమలు కాపాడతాడు. రక్ష ధరించిన వారికి యమదూతల భయం ఉండదని యమధర్మరాజు చెప్పినట్లు భవిష్యోత్తరపురాణంలో ఉంది. శత్రుభయం లేకుండా ఉండడానికి ధర్మరాజు, భరతుడు కూడా రక్ష ధరించినట్లు ఇతిహాసాలు చెబుతున్నాయి.

## వేదాధ్యయనానికి శ్రీకారం

ఆధ్యాత్మికంగా కూడా శ్రావణపూర్ణిమకు ఎంతో ప్రాశస్త్యం ఉంది. శ్రావణ పూర్ణిమ రోజు నుంచే వేదాధ్యయనం ప్రారంభం చేస్తారు. శ్రావణ పూర్ణిమ రోజున వేదవాణి స్పష్టంగా వినబడుతుందని, అందుకే ఈ రోజునుంచి వేదాధ్యయనం ప్రారంభించాలని శాస్త్ర నియమం. సంస్కృతంలో 'శ్రవణం' అనే పదానికి వేదశబ్దాన్ని లోకంలోకి తీసుకువచ్చేది, ప్రసారం చేసేది అనే అర్థాలు ఉన్నాయి. ఈ కారణంగానే శ్రావణాన్ని విజ్ఞాన మాసంగా కొందరు చెబుతారు.


చారిత్రకంగా, ఆచారవ్యవహారాలపరంగా, శాస్త్రపరంగా, వ్యవస్థాపరంగా శ్రావణపూర్ణిమ యుగాలనాటి భారతీయ సంస్కృతికి ప్రతిరూపంగా అందరి హృదయాల్లో అనుబంధాల వెలుగులు నింపుతోంది. తరతరాల సాంస్కృతిక పెన్నిధిని కాపాడుకోవడమే నేటి తరాల కర్తవ్యమనే భావన వృద్ధి అయితే మన సంస్కృతి చిరంజీవి అవుతుంది. ఇందుకు రక్షాబంధనమే వేదికగా నిలుస్తుంది.

రక్షాబంధనం కేవలం పండుగ మాత్రమే కాదు. కుటుంబసంబంధాల పటిష్టతకు పునాదులు తొక్కే పరమ ఔన్నత్యం కలిగిన రోజు ఇది. భారతీయ సనాతనధర్మం నిత్యనూతనం అనడానికి రక్షాబంధనం కన్నా వేరే నిదర్శనం అవసరం లేదు.

రాఖీ కట్టుకోవడంతోనే శ్రావణపూర్ణిమ పరమార్థం నెరవేరదు. యుగాలనాటి భారతీయచరిత్రకు, ఈ దేశ చక్రవర్తుల శౌర్యప్రతాపాలకు రాఖీ ప్రతీకగా నిలుస్తుంది. యావత్ ప్రపంచం ఒప్పుకున్న చారిత్రకసత్యాలకు నిలువుటద్దం రాఖీ. అనుబంధాలు మరుస్తున్న నేటితరానికి రాఖీ అన్నచెల్లెళ్ల అనురాగ పరిమళాలు అందిస్తుంది. ఇది మనసు పండుగ. మనదైన పండుగ.

### 'రక్ష' ఎలా కట్టుకోవాలంటే...

రక్ష(రాఖీ) ధరించడానికి కొన్ని నియమాలను శాస్త్రాలు చెబుతున్నాయి. అవేమిటంటే.. శ్రావణపూర్ణిమరోజున రక్ష కట్టేవారు, కట్టించుకునేవారు ఇద్దరూ అభ్యంజన స్నానం చేయాలి.



తర్వాత సోదరి సోదరుడి నుదుటిన తిలకం దిద్దాలి.


అనంతరం రక్షా బంధన శ్లోకాన్ని చెబుతూ సోదరుడికి రక్షకట్టాలి.

సోదరుడు సోదరికి మంగళద్రవ్యాలు, మధురఫలాలు అందించాలి.

# మనోబలం ఈయన వల్లే...

- డా॥ మేడికుర్తి ఓబులేశు

చంద్రుడు జలగ్రహం. జల సంబంధమైన వ్యాపారాలు, చల్లని పానీయాలకు సంబంధించిన వ్యాపారాలు, వివిధరకాల కళలకు, మాతృసౌఖ్యానికి, తల్లివైపునుండి వచ్చే సమస్త భోగ భాగ్యాలకు చంద్రుడే కారకుడు. చతుషష్టి కళాకోవిదుడైన చంద్రుడు మనసును రంజింపజేసే అనేక కళలకు కారకుడు. క్రీడలలో కొన్నింటికి కారకుడు. నిష్కల్మషమైన మనస్తత్వం, ఎంతటి వార్తలు విన్నా చలించకపోవడం, విదేశీయానం, విద్యాసంబంధ విషయాల్లో మానసికంగా ఒత్తిడికిలోను కావడం, మతిమరుపు, అతిగా నీళ్లు త్రాగడం, తప్పని సరిగా స్నానంచేసే అలవాటు. తెలుపువస్తువులపై మక్కువ ఎక్కువ. వివాదాస్పదవిషయాల్లో తల దూర్చకపోవడం, అనవసరంగా ఖర్చులు చేయడం, సౌకర్యాలు లేనిదే మనలేనితత్త్వం, పుష్కలంగా జలవన రులను, సరస్సులను ఆస్వాదించడం, ప్రకృతిశోభవల్ల మానసికోల్లాసం, విహార యాత్రలు, జలవనరులపట్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా లాభపడటం, కీర్తిప్రతిష్టలు, అవార్డులు అందుకోవడం, చిన్నవిషయాలకు అబద్ధాలు చెప్పడం, తల్లిపట్ల అమిత మైన భక్తి కలిగి ఉండటం చంద్రగ్రహం ఇచ్చే ఫలితాలు. జీవితంలో త్వరితగతిన అభివృద్ధి సాధించడానికి చిన్నతనంలోనే మంచి ప్రఖ్యాతి సాధించడానికి చంద్రగ్రహ అనుకూలతే కారణం.






## చంద్రగ్రహ అనుకూలతకు చేయవలసినవి

ప్రతి సోమవారం దుర్గాదేవి పూజ చేయాలి. నిత్యం దుర్గాస్తోత్రం పఠించాలి. చంద్రగ్రహ అనుగ్రహం లభించడానికి మహాలక్ష్మీహోమం, మహాపాశుపతహోమం చేయాలి. శివ తాండవస్తోత్రం పఠించాలి. ప్రతినిత్యం నాగసిందూరం నుదుటన ధరించాలి. నీళ్లను వృథాచేయటం పనికి రాదు. చంద్రప్రతిష్ఠ శివలింగాన్ని అర్చించాలి (కోటిపల్లి). బియ్యం, తెల్లని వస్త్రాలు, అర్హులైన వారికి దానం చేయాలి. చేటలో పోసిన బియ్యం నుండి భిక్షం వేయాలి. సూర్యాస్త మయం తర్వాత బియ్యం బదులుగా ఇవ్వకూడదు. (దానం ఎప్పుడైనా చేయవచ్చు). లక్ష్మీచందనంతో మహాలక్ష్మీదేవి పూజ చేయాలి. ప్రతి మాసశివరాత్రి రోజున చంద్రగ్రహప్రార్థన వీలైనన్ని ఎక్కువసార్లు పఠించి, అదే రోజున ముత్యపుజలంతో రుద్రాభిషేకం చేయించాలి. చంద్రగ్రహణసమయంలో ఉపవాసం ఉండాలి. మరుసటిరోజు శాంతిదానాదులు (శక్తి మేరకు) చేయాలి. చంద్రుణ్ణి ధరించిన శివుడి విగ్రహాన్ని పూజించాలి. చంద్రబింబాన్ని శివాలయంలో దానంచేయాలి. రోహిణీనక్షత్రం ఉన్న రోజున అనాచారపు పనులు మాని బియ్యం, నూకలు కలిపి పక్షులకు ఆహారంగా సమర్పించాలి. వేపచెట్టుకు నీళ్లు పోయాలి.

### చంద్రగ్రహస్తోత్రం

**దధిశంఖ తుషారాభం। క్షీరోదార్ణవ సంభవం।**
**నమామి శశినం సోమం। శంభోర్మకుట భూషణం॥**




# నా తండ్రి...

- శ్రీ టి. శివకుమార్

ఏ దిక్కూ లేనివాడికి దేవుడే దిక్కు అంటారు. కొన్నేళ్ల క్రితం వరకు అది కేవలం సామెత మాత్రమే అనుకునేవాడిని. కానీ, తిరుమల శ్రీవారిలీల నాకు స్వయంగా అనుభవంలోకి వచ్చిన తర్వాత ఏ దిక్కూ లేనివాడికే కాదు లోకంలో అందరికీ స్వామివారే దిక్కు అని గట్టినమ్మకం ఏర్పడింది.

మాది అవనిగడ్డ సమీపంలోని కోడూరు ప్రాంతం. మాది కిరాణావ్యాపారం. మరీ పెద్ద, మరీ చిన్న కాని మధ్య స్థాయి వ్యాపారం. మరీ లాభాలు సంపాదించి మిద్దెలు కట్టలేదు కానీ ఉన్నంతలో సుఖంగానే ఉండేది జీవితం. నేను పెద్దవాడిని. ఇద్దరు చెల్లెళ్లు. అందరికీ వివాహాలు చేసారు నాన్నగారు. నా దురదృష్టం ఏమిటంటే వివాహమైన కొద్దికాలానికే నాన్న వెళ్లిపోయారు. అప్పటికి నాకు పాతికేళ్ళు ఉంటాయేమో. ఏదో కొద్దిపాటి చదువు, ఆ తర్వాత వివాహం... అప్పటికదే జీవితం. లోకం తెలియనంత అమాయకుడిని కాదు కానీ ఏదీ పట్టించుకునే వాడిని కాదు. నాన్న స్వయంగా అన్ని పనులు చూసుకునే వారు. పిల్లాడు కదా నేర్చుకుంటాడని పెద్దగా ఏ పనీ చెప్పేవారు కాదు. అలా గడిచిపోయింది కాలం.

కానీ, నాన్న లేని రోజున అప్పటిదాకా గడిచిన కాలమంతా ఒక్కసారి ఆగిపోయినట్లయింది. పెద్దదిక్కు లేక పోవటంతో బంధువులు కేవలం పలకరింపులకే పరిమితమయ్యారు. ఏదో నాన్నకు తోడుగా దుకాణంలో కాసేపు కూర్చోవటం తప్ప ఇంకేమీ తెలియదు నాకు. ఉద్యోగం చేసేంత చదువు లేదు. అమ్ముకుని బతికేంత ఆస్తులు లేవు.

నాన్న చాటున పెరిగిన నేను, నాన్న లేకుండా ఆ రోజు దుకాణం తెరిచాను. కంటివెంట నీరు తప్ప మరొకటి లేదు. నాన్న లేరని తెలిసి అలవాటుగా వచ్చేవాళ్లు కూడా దుకాణానికి రావటం మానేసారు. నిజానికి ఉన్న సరుకు అమ్మటం తప్ప మార్కెట్‌కి వెళ్ళి సరుకు తేవటం కూడా తెలియని పరిస్థితి నాది. రెండు మూడు రోజులు గడిచాయి. రోజూ దుకాణం తెరుస్తున్నా. పైసా వ్యాపారం లేదు.

ఆ రోజు బాగా గుర్తుంది... శనివారం. దుకాణంలో సామాన్లు సర్దుతూ షోకేస్ పక్కగా గోడమీద ఉన్న దేవుడి పటాలు కూడా తుడిచాను. వినాయకుడు, అమ్మవారు, తిరుపతి శ్రీవేంకటేశ్వరుడి పటాలు ఉన్నాయి. చాలాకాలం క్రితం తిరుపతి నుంచి నాన్న తెచ్చిన శ్రీవారిపటమే అది. యాదృచ్ఛికంగా పటాలన్నీ శుభ్రంగా తుడిచి, గంధం, కుంకుమ బొట్లు పెట్టాను.

వారం వారం నాన్నగారు తీసుకునేవారయ్యా... ఇదిగో తీసుకో. డబ్బులు వద్దులే... అంటూ ఓ పొట్లం అక్కడ పెట్టి వెళ్ళిందో మహిళ. చామంతులు, ఇంకా మరేవో కాసిని పూలు అందులో ఉన్నాయి. అప్రయత్నంగానే ఆ పూలు తీసుకుని పటాలకు అలంకరించాను. దీపం వెలిగించాను. చదువుదామంటే కనీసం ఓ శ్లోకం కూడా గుర్తుకురాలేదు. ఏదైతే ఏమి... స్వామికి గట్టిగా నమస్కారం పెట్టుకున్నా. ఏం చెప్పాలో, ఏం కోరుకోవాలో తెలియదు. నాన్నతో మాట్లాడినట్లే స్వామితో మాట్లాడా. నా గోడు చెప్పుకున్నా.

స్వామీ! ఇప్పుడు నువ్వే నాకు నాన్నవు. నడి సముద్రంలో ఉన్నట్లుంది నా పరిస్థితి. ఏం చెయ్యాలో కూడా ఆలోచించలేను. అన్నీ నువ్వే నేర్పించాలి స్వామీ అంటూ నిండు మనసుతో దండం పెట్టుకున్నా. ఏమిటో తెలియదు కానీ... నేనలా అడుగుతుంటే స్వామి వింటున్నట్లే అనిపించింది.

నాన్న లేకుండా దుకాణం తెరచిన తర్వాత ఆ రోజే బోణీ అయింది. ఆశ్చర్యం... మూడొందలు అమ్మాను ఆ రోజు. ఏడుకొండలస్వామి నా మాట విన్నారని గట్టిగా నమ్మకం కుదిరింది. అప్పటి నుంచి స్వామికి అన్నీ చెప్పుకునేవాడిని. ఒక్కొక్కటిగా పరిస్థితులన్నీ మెరుగయ్యాయి. మా నాన్నతో మాట్లాడినట్లే అన్నీ స్వామితో మాట్లాడేవాడిని. ఇప్పటికీ అదే అలవాటు. ఆయనే నాకు ఆప్తమిత్రుడు. దైవం. తండ్రి. బంధువు.

ఇప్పుడు నేనొక ఆసామిని. వ్యాపారం బాగా పెరిగింది. ధాన్యం వ్యాపారం బాగా కలిసొచ్చింది. సొంతంగా రైస్ మిల్ పెట్టాను. నా దగ్గర 10 మంది పనిచేస్తున్నారు. అంతా ఏడుకొండల తండ్రి దయ. నా దగ్గర పనిచేసే వాళ్ల కుటుంబాలతో సహా ప్రతినెలా కచ్చితంగా స్వామిదర్శనం చేసుకుంటాను. ఇలా ఐదారేళ్ళుగా క్రమం తప్పకుండా చేస్తున్నాను. స్వామిని దర్శించుకున్న ప్రతిసారీ ఏదో కొత్త అనుభూతి. ఇదే మొదటిసారి కొండకు వచ్చినంత ఆనందం కలుగుతుంది. అంతా మా తండ్రి శ్రీనివాసుడి అనుగ్రహం తప్ప మరొకటి కాదు. మా జీవితాల రక్ష తిరుపతిదైవమే!

ఆయుర్వేదం

# పరమ పవిత్ర మంగళద్రవ్యం

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ

భారతీయ సంస్కృతి సంప్రదాయాల్లో ఒక ప్రత్యేకమైన విశిష్టమైనస్థానాన్ని పొంది పరమపవిత్రమైన ద్రవ్యంగా భావించ బడే మంగళకర ద్రవ్యాలలో కొబ్బరిదే అగ్రస్థానం అంటే అతి శయోక్తి కాదు. కల్పవృక్షమైన కొబ్బరి లేనిదే ఏ శుభకార్యం ఉండదు.

ఎంతో ఆధ్యాత్మిక ప్రాధాన్యత సంతరించుకున్న ఈ కొబ్బరి పోషకద్రవ్యంగా, సౌందర్యసాధనాద్రవ్యంగా, వివిధరకాల అనారోగ్యసమస్యలను తుదిముట్టించే అపారఔషధ గుణాలఖనిగా ప్రసిద్ధినొందింది. ఆయా వ్యాధులకు ఆహార ఔషధంగా ఈ కొబ్బరిని ఎలా ఉపయోగించుకోవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం.

**శిరోజాలు బాగా పెరిగేందుకు:** ఎండు కొబ్బరి తురుము, నల్ల నువ్వులు ఉసిరిక పొడి, బెల్లంలను ఒక్కొక్కటి 50 గ్రాముల చొప్పున తీసుకొని అన్నింటిని కలిపి దంచి ఉంచుకొని రెండు పూటల పూటకు ఒక టీ స్పూను ఔషధాన్ని చప్పరించి కప్పు పాలు సేవిస్తు వుంటే శిరోజాలకు మంచి పోషణ కలిగి శిరోజాలు వత్తుగా, నల్లగా నిగనిగ లాడుతూ ఆకర్షణీయంగా పెరుగుతాయి.

**నోటిపూతకు :** రోజు 1-2 సార్లు పూటకు 100 మి.లీ. కొబ్బరి పాలు పుక్కిలిపడుతు ఉంటే నోటి పూత తగ్గుతుంది.

**కడుపు చిన్న ప్రేవుల్లోని వ్రణాలకు:** రోజు ఒకసారి 100-200 మి.లీ. కొబ్బరి నీటిలో 10 గ్రాముల పచ్చి కొబ్బరి తురుము, 5 గ్రాముల పటిక బెల్లంపొడి, ఒక యాలుకబుడ్డలోని విత్తుల చూర్ణం కలిపి సేవిస్తుంటే కడుపు చిన్నప్రేవుల్లోని వ్రణాలు, అల్సర్లు, పుండ్లు తగ్గిపోతాయి.



**వివిధ రకాల తలనొప్పులకు :** రోజు పరగడుపున 100 మి.లీ. కొబ్బరిపాలలో ఒక టీ స్పూను పటికబెల్లం పొడి కలిపి సేవిస్తుంటే గుణం కనిపిస్తుంది.

**చెమట కాయలకు :** కొబ్బరి పాలలో తగినంత జీలకర్ర పొడి కలిపి పట్టించి ఆరిన తరువాత సున్నిపిండిని ఉపయోగించి స్నానం చేస్తుంటే త్వరగా ఈ సమస్య తగ్గుతుంది.

**చుండ్రుకు :** వారంలో 1-2 సార్లు కొబ్బరిపాలు తలకు పట్టించి గంటసేపు ఆగి గోరువెచ్చని నీటితో తలస్నానం చేస్తుంటే చుండ్రు సమస్య అదుపులో ఉంటుంది. తల వెంట్రుకలు బాగా పెరుగుచూ నిగనిగలాడుతూ ఉంటాయి.

**కాలిన గాయాలు, బొబ్బలు:** లేత కొబ్బరి నీరు, సున్నపుతేట సమానంగా కలిపి కొద్దిగా పసుపు కలిపి పై పూతకు రోజు రెండుసార్లు లేపనం చేయుట వల్ల త్వరగా ఈ సమస్య తగ్గుతుంది. ఈ ఔషధాన్ని ఇలా వాడటం వల్ల కాళ్ళు, చేతులు, మంటలు, కురుపులు తగ్గిపోతాయి.

**మూత్రంలో మంట :** రోజు ఉదయం, సాయంత్రం పూటకు 100-200 మి.లీ. కొబ్బరి నీటిలో ఒక టీ స్పూను అల్లపు రసం కలిపి సేవిస్తు వుంటే మూత్రంలో మంట, నొప్పి, చురుకు, పోటు లాంటి ఇబ్బందులు త్వరగా తగ్గుతాయి.

**ప్రశాంతమైన నిద్రకు :** ఎండు కొబ్బరి, గసగసాలు, పటికబెల్లం చూర్ణాలను సమానంగా కలిపి ఉంచుకొని కొన్ని రోజుల పాటు రాత్రి రోజు పడుకునేటప్పుడు 100 మి.లీ. గోరువెచ్చని పాలలో ఒక టీ స్పూను ఈ పొడిని కలిపి సేవిస్తు ఉంటే ప్రశాంతమైన నిద్రపట్టి చక్కటి ఆరోగ్యం చేకూరుతుంది.

**చేతులు, కాళ్ల పగుళ్లు:** కొబ్బరి పాలు, గ్లిజరిన్ ఒక్కొక్కటి 10 మి.లీ. చొప్పున తీసుకొని రెండింటిని బాగా కలిపి లేపనం చేస్తుంటే చక్కటి ప్రయోజనం చేకూరి చేతులు, కాళ్ళు మృదుత్వాన్ని సంతరించుకుంటాయి.

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-10

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య     నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | | |
|---|---|---|
| देवा: = దేవతలు | देवं = దేవుని | देवान् = దేవుళ్లను |
| अन्यत्र = మరొక చోట | तथा = అలాగు | सर्वत्र = అన్ని చోట్ల |
| कुर्वन्ति = చేయుచున్నారు | कुरुथ = మీరు చేయుచున్నారు | कुर्म: = చేయుచున్నాము |

అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) यूयं तत्र किं कुरुथ?
02) वयं तत्रास्म।
03) किमपि नास्ति।
04) ते तत्र किं कुर्वन्ति?
05) न किञ्चिदपि।
06) वयं किं कुर्म:?
07) देवा: कुत्रासन्?
08) कुत्रापि नासन्।
09) अग्रजा: के?
10) ते सर्वेऽपि अग्रजा:।

ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) ఎవరేమి చేయుచున్నారు?
02) వారు మరొకచోటనున్నారు.
03) అలాగా!
04) అయ్యో! మీరిక్కడనేమి చేయుచున్నారు?
05) ఏమియును లేదు.
06) కొందరక్కడ లేరు.
07) ఎందరు లేరు?
08) మేమందరము ఇక్కడనే యున్నాము.
09) వీరందరును దేవుళ్లట.
10) మేమందర మేమియును చేయుట లేదు.


అ) జవాబులు

01) మీరక్కడ ఏమి చేయుచున్నారు?
02) మేమక్కడ నుంటిమి.
03) ఏమియు లేదు.
04) వారు అక్కడ ఏమి చేయుచున్నారు?
05) ఏమియు చేయుట లేదు.
06) మనము ఏమి చేయుచున్నాము!
07) దేవుతలు ఎక్కడ ఉన్నారు?
08) ఎక్కడను లేరు.
09) అగ్రజులు (పెద్దలు) ఎవరు?
10) వారందరు కూడ అగ్రజులే (పెద్దలే).

ఆ) జవాబులు

01) के किं कुर्वन्ति?
02) ते अन्यत्र सन्ति।
03) तथा वा!
04) हन्त! यूयमत्र किं कुरुथ?
05) किमपि नास्ति।
06) केचन तत्र न सन्ति।
07) कतिचन न सन्ति?
08) वयं सर्वेऽपि अत्रैव स्म:।
09) एते सर्वेऽपि देवा: इति।
10) वयं सर्वेऽपि किमपि न कुर्म:।

విశ్వదాభిరామం     వేమన పద్యసూక్తి



# లోభి – ధనము

లోభివాని జంప లోకంబులోపల
మందు వలదు; వేరె మతము గలదు;
పైక మడుగ చాలు భగ్గున పడి చచ్చు;
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** లోభి = పిసినిగొట్టు; మతము = ఉపాయము; పైకము = డబ్బు, ధనం.


**భావం:** పిసినారివానిని చంపడానికి ఈలోకంలో ఏమందూ అవసరం లేదు. వేరే ఉపాయం ఉంది. వాణ్ణి డబ్బడిగితే చాలు భగ్గు మని పడి చస్తాడు.

**వివరణ:** పిసినిగొట్టువాడిని బాధ పెట్టాలంటే ఏమీ కష్టపడనవసరం లేదు. వాడిని డబ్బులు ఇమ్మని అడిగితే చాలు. ధనం ఇవ్వడానికి ఏమాత్రం ఇష్టపడనివాడికి డబ్బు పోతుందేమో అని చచ్చినంత బాధ కలుగుతుంది. నిజానికి సంపాదించినడబ్బును వృథాగా ఖర్చు చేయకూడదు. కానీ, పిసినారితనం ఏమాత్రం పనికిరాదు. సంపాదనలో కొంతభాగం దానం చేయడానికి, ధర్మసంస్థలకు వినియోగించాలి. "అటు పెట్టిన, ఇటు పెట్టిన ఇటుపెట్టక ముక్తి రాదు" అన్నారు. నిలువునామాలు పెట్టినా, అడ్డనామాలు పెట్టినా, ఆపదలో ఉన్నవారికి పెట్టకుండా మోక్షం రాదు అని అర్థం. అటువంటి పిసినారుల మీద వేమన సెలగోల విసరుతున్నాడు.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

67

# వైకుంఠపాళి



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

## అడ్డం

2)చంద్రుడు(2); 3)పార్వతి(3); 7)పురాణాల్లో ఒకటి(2); 8)ఆగ్నీధ్రుని కుమారుడు. ఇతని పేరిటనే కురువంశంగా ఖ్యాతి పొందింది(3); 9)బాణాసురుని కూతురు(2); 12)మయసభను నిర్మించినవాడు(3); 13)దుర్యోధనుని మిత్రుడు(3); 17)కాంతి(2); 18)చంద్రవంశపురాజు, నహుషుని కుమారుడు(3); 19)పురాణాల్లో ఒకటి(2); 22)ధరణీదక్షుల కుమారిత(2) 23) మేరువు కుమార్తె(3)

## నిలువు

1)శివుడు(4); 2)ఇంద్రుడు కర్ణునికిచ్చిన అస్త్రం(2); 4)బ్రహ్మ భార్య(2); 5)సంవరణునకు పుత్రుడు(3) (ఇతని పేరుతోనే కురుక్షేత్రం ఏర్పడింది); 6)దుష్టబుద్ధి కూతురు(3); 10)మణిపురాన్ని పాలించే గంధర్వుడు(3); 11)కర్ణుని పుత్రుడు(3); 14)కృష్ణునికి రుక్మిణికి కల్గిన కుమారుడు(4); 15)బ్రహ్మ క్రతువులు చేసిన చోటు(3); 16)భూమి(3); 20)మయుని భార్య(2); 21)దక్షుని కూతురు(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు

బాలనీతి

# భూదానానికి మించిన ఫలం


– ఆచార్య పి.ఎల్.శ్రీనివాస రెడ్డి,
94414 93777

కం. జ్ఞానము కేవల కృప న
జ్ఞానికి నుపదేశ విధి ప్రకాశము సేయం
గానది సకల ధరిత్రీ
దానమ్మున కంటె నధికతర ఫలదమగున్

డబ్బు, దస్కం తీసుకోకుండా కేవలం దయతో జ్ఞానాన్ని అజ్ఞానికి సమగ్రంగా తేటతెల్లమయ్యేట్టుగా అందిస్తే అది మొత్తం భూమినంతా దానం చేస్తే వచ్చే ఫలితం కన్నా ఎక్కువ ఫలితాన్ని ఇచ్చేది అవుతుందంటాడు మహాకవి తిక్కన.

అన్నిదానాల కన్న ఏ దానం మిన్న అని అడిగితే ప్రభుత్వేతర వాహనాల అధిపతులు నిదానం అనీ, పరోపకార పరాయణులైన వాళ్ళు అన్నదానం అనీ అంటారు. కవులు, రచయితలూ మాత్రం జ్ఞానదానం అనే అంటారు. ఎవరి అవసరాలూ, అభిరుచులూ వాళ్లవి కదా!

విద్య దివ్యమైంది. అందుకే అందరికీ విద్య అనే నినాదం బయలుదేరింది. అందరికీ విద్య ఎందుకంటే అన్ని సమస్యల'కీ' (Key) విద్య కాబట్టి. ఇంత గొప్పదైన విద్యను, దాని ద్వారా వచ్చే జ్ఞానాన్ని పంచవలసిన, పెంచవలసిన గుర తరమైన బాధ్యత చదువుకున్న వాళ్ల అందరి పైనా ఉంది. అందుకే ఆంగ్లంలో 'Each one teach one' అనే మాట పుట్టింది.



బడి ఏ దేశానికైనా, ఏనాటికైనా ఎనలేని పెట్టుబడి. అది ఏనాడూ కాకూడదు ఒక మొక్కుబడి. అట్లాంటి బడిని సమర్థవంతంగా నడిపే గురువు దేశానికి పరువు. ప్రతిపూట పాఠం చెప్పని గురువు దేశానికి బరువు.

ఆంగ్లంలో ఒక మంచి వాక్యముంది "Blood, money and knowledge are for circulation, not for stagnation" అని. అంటే "రక్తం, ధనం, జ్ఞానం ఈ మూడు నిరంతరప్రసరణకే తప్ప, కదలకుండా పడి ఉండి మురిగి పోవడానికి కాదు" – అని.

భావితరాల జ్ఞానాన్ని పెంచడానికి దోహదం చేయడం ప్రతి ఉపాధ్యాయుని ప్రథమకర్తవ్యం. తనకన్న తన శిష్యులు తక్కువస్థాయిలో ఉండాలని ఏ గురువైనా అనుకుంటే ఆ గురువు దేశం తిరోగమించాలని స్థిరంగా అనుకుంటున్నాడన్నమాట. పోనీ తనతో సమానంగా ఉండవచ్చుననుకుంటున్నాడంటే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉండాలనుకుంటున్నాడని అర్థం. అలా కాకుండా తనను మించి ఎంతో జ్ఞానవంతులు కావాలని ఆకాంక్షిస్తే, అందుకోసం తపన పడితే ఆ గురువు దేశ పురోగమనాన్ని మనసారా కోరుకుంటున్నట్టు లెక్క.

దీన్ని అంతటినీ ఇంకోవిధంగా చెబితే –

తన అంతేవాసి తనకన్న తక్కువవాసి కలవాడు కావాలనుకునే గురువు అధమగురువు.

తన అంతేవాసి తన అంతే వాసి కలవాడు కావాలనుకునే గురువు మధ్యమగురువు.


తన అంతేవాసి తనకన్న ఎంతో వాసి కలవాడు కావాలనుకునే గురువు– మనసావాచా కర్మణా కాంక్షించే గురువు– ఉత్తమ గురువు.

చిత్ర కథ

# దేవుడి రథాన్ని ఆపిన హారతి

కథ–డా॥ కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు–కె. తులసీప్రసాద్




దీక్షితులూ! అలా అనకు. ఒకసారి వెళ్లి ఆమెను అడుగుదాం.
అమ్మా తల్లీ! వెంగమాంబా!
అమ్మా! ఆగినది రథం. నీవు ముత్యాలహారతి తేవమ్మా! స్వామిని కదలనివ్వు!
నేను మహిళను, పైగా మీ దృష్టిలో విధవరాలిని కదా! నా హారతి కొందరికి నచ్చదేమో? సరే! ఉండండి! వస్తాను.
వేంకటరమణా! సంకటహరణా!
ఇంక లాగండి!
ఆం... ఇక లాగండయ్యా...!
గోవిందా! గోవిందా! రథం కదులుతోంది...
అమ్మా! నీకు సరిసమాన భక్తులు ఇలలో లేరు తల్లీ! నీవిచ్చే ముత్యాలహారతి ఎంతగొప్పదో, లోకానికి తెలిసింది. ఇక మీదట రోజూ ఏకాంతసేవలో మీరు స్వామికి ముత్యాలహారతి పట్టండి. మహంతుగా దాన్ని నేను అమలు చేస్తాను.
లోకాః సమస్తాః సుఖినో భవన్తు!

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధస్సుకు పదును పెట్టండి

## కదంబం

### ఏడుకొండలు

1) శ్రీశైలం
2) శేషశైలం
3) గరుడాద్రి
4) వేంకటాద్రి
5) నారాయణాద్రి
6) వృషభాద్రి
7) వృషాద్రి

## పిల్లలూ..జతచేయండి!!

| | |
|---|---|
| 1) నందుడు | అ) శకుంతల |
| 2) లక్ష్మణుడు | ఆ) పద్మావతి |
| 3) జయదేవుడు | ఇ) భానుమతి |
| 4) దుష్యంతుడు | ఈ) ఊర్మిళ |
| 5) దుర్యోధనుడు | ఉ) యశోద |

జవాబులు: 1-(ఉ); 2-(ఈ); 3-(ఆ); 4-(అ); 5-(ఇ)

## మీకు తెలుసా?

1) రామాయణాన్ని ఎవరు రచించారు?
2) శ్రీరాముడు ఏ నక్షత్రంలో జన్మించాడు?
3) సుమిత్రకుమారులు?
4) సీత తండ్రి ఎవరు?
5) భరతుని తల్లి ఎవరు?
6) రావణాసురుడి భార్య ఎవరు?
7) సుగ్రీవుడి సోదరుడు ఎవరు?

**జవాబులు:**
1) వాల్మీకి
2) పునర్వసు
3) లక్ష్మణుడు, శత్రుఘ్నుడు
4) జనకమహారాజు
5) కైకేయి
6) మండోదరి
7) వాలి

## కనుక్కోండి


ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

న్నా ణం ప స్మ ర ర ర్వ
భ గ మ ణం హ వ స

**జవాబు:**
భగవన్నామ స్మరణం
సర్వపాపహరణం

## చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

Printed by Sri P.Ramaraju, M.A., Special Officer (Press & Publications), T.T.D. Press, Tirupati and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Published at Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.


యో దేవ స్సవితాఽస్మాకం ధియో ధర్మాదిగోచరాః।
ప్రేరయేత్ తస్య యద్భర్గః త ద్వరేణ్య ముపాస్మహే॥
SIVAPRASAD

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY
Published by Tirumala Tirupati Devasthanams
Printing on 20-08-2021

విశుద్ధవిజ్ఞానఘనస్వరూపం
విజ్ఞానవిశ్రాణనబద్ధదీక్షమ్,
దయానిధిం దేహభృతాం శరణ్యం
దేవం హయగ్రీవ మహం ప్రపద్యే॥

